
అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సోమవారం 12-6-2023
సమగ్ర తెలుగు దినపత్రిక



హుస్సేన్‌సాగర్ వద్ద ఆకాశంలో..

సంపుటి : 9 | సంచిక : 162 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50



బడులు బాగుపడేనా!

నేటి నుంచి పాఠశాలలు... సమస్యలు యథాతథం..

- ప్రారంభం రోజు పుస్తకాలు, యూనిఫామ్స్ కష్టమే..!
- నత్తనడకన మన ఊరు మన బడి పనులు

నవతెలంగాణ - మొఫిసిల్ యంత్రాగం

వేసవి సెలవుల అనంతరం రాష్ట్రంలో సోమవారం నుంచి పాఠశాలలు పున:ప్రారంభం అవుతున్నాయి. ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వం అనేక ప్రణాళికలు రూపొందించుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభం రోజే పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్‌తో పాటు టై, బెల్ట్, షూస్ విద్యార్థులకు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. సమస్యలు లేకుండా స్కూళ్లను ప్రారంభించాలని, విద్యార్థులకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని సూచించింది. కానీ ఎప్పటిలాగే ఈ ఏడాదీ అరకొర వసతులతోనే ప్రభుత్వ బడులు ప్రారంభం కాబోతున్నాయి. మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ విద్యా వ్యవస్థకు దీటుగా తీర్చిదిద్దేందుకు మన ఊరు మనబడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినా పనులు నత్తనడకన నడుస్తున్నాయి. పనులు పూర్తయిన చోట స్కూల్స్ మెరుగుపడ్డాయి. టీచర్ల ఖాళీలు షరామామూలే.. స్కూల్స్ ప్రారంభం నాటికే ఖాళీ పోస్టుల్లో విద్యావాలంటీర్లను నియమిస్తామని చెప్పినా ఇప్పటివరకు ఏర్పాట్లు జరగలేదు. బడిబాట ఈ నెల 17 వరకు కొనసాగనుంది. అన్ని పాఠశాలల్లో కంప్యూటర్ విద్య నేటికీ హామీగానే మిగిలి ఉంది. మరోవైపు ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో ఈ ఏడాది ఫీజులమోత మరింత భారీగా మోగుతోంది.

కనిపించని 'స్వచ్ఛ'త..

రాష్ట్రంలో 26,065 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 1.06 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో 60 లక్షల మంది విద్యార్థులుంటే.. ప్రభుత్వ స్కూళ్లలోనే సుమారు 26 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా, గతంలో రాష్ట్రంలో 16 వేల మంది దాకా ఉన్న స్వచ్ఛ కార్మికులు ప్రస్తుతం లేరు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్ కార్మికులు పాఠశాల పరిసరాలను మాత్రమే శుభ్రం చేస్తున్నారు. తరగతి గదులు, స్టాఫ్‌రూమ్‌లు, మరుగుదొడ్లను మాత్రం శుభ్రం చేయడం లేదు. ఉదాహరణకు జీహెచ్‌ఎంసీ పరిధిలో 690 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. పాఠశాలలో 40మందిలోపు విద్యార్థులు ఉంటే ఒకరిని రూ.2వేలు, అంతకంటే ఎక్కువ విద్యార్థులుంటే ఇద్దరు కార్మికులకు రూ.2,500 చొప్పున వేతనంతో నియమించారు. ఉన్నత పాఠశాలల్లో వందలాది మంది విద్యార్థులకు వీరి సేవలు కీలకంగా

...2లో



భారీగా ఉపాధ్యాయ ఖాళీలు.. వాలంటీర్ల నియామకానికి డిమాండ్



ఆ బడుల్లో నీటి సమస్య

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2, 400 ప్రభుత్వ పాఠశాలలుండగా 80% మౌలిక వసతుల లేమితో ఉన్నాయి. మిషన్ భగీరథతో ప్రతి ప్రభుత్వ పాఠశాలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం చెప్పినా నేటికీ కనెక్షన్లు ఇవ్వలేదు. రంగారెడ్డి జిల్లాలోని శివరాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో 1600 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వాటర్ తాగితే యూరిన్‌కి వెళ్లాలని నీళ్ళు కూడా సరిపడా తాగట్లేదు. 'మన ఊరు-మన బడి' కింద ఎంపికైన పాఠశాలల్లో కొంత మేర మౌలిక వసతులు కల్పించారు. నిధుల లేమితో నూతన భవనాలు పూర్తి కాలేదు.



టార్గెట్ ఈటల?

ఒంటరిన్నిచేసే యత్నం...

- గ్రూపులుగా చీలిన ఈటల, బండి
- మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ఇంట్లో పలువురు నేతల భేటీ
- కొండా, విజయశాంతి, వివేక్, విఠల్, బూర తదితరులు హాజరు
- ఈటలకు ప్రమోషన్ ప్రచారంపై పెదవివిరుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీలో పదవుల మార్పు అంశం చిచ్చు రేపుతున్నది. కొంత కాలంగా నడుస్తున్న అంతర్గపోరు పీక్‌స్టేజీకి చేరుతున్నది. మొన్నటిదాకా బండికి వ్యతిరేకంగా వీచిన గాలి ఇప్పుడు ఈదురుగాలై ఈటల వైపు మళ్లింది. ఈ రాజకీయ తుఫాన్ బీజేపీలో కల్లోలం సృష్టించేలా కనిపిస్తున్నది. ఈ విషయంలో జాతీయ నాయకత్వం ఎత్తులు జిత్తులు కూడా పనిచేయట్లేదని తెలుస్తున్నది. ఆ పార్టీలో ఇన్నాళ్లు ఈటల రాజేందర్ పాట పాడినోళ్లంతా ఇప్పుడు బండి రాగం ఎత్తుకోవడం కొత్త పరిణామాలకు దారితీస్తున్నది. ఇప్పుడు ఈటలే టార్గెట్‌గా తతంగం నడుస్తున్నది. అందులో భాగంగానే తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసి ఇప్పుడు బీజేపీలో ఉన్న నేతలంతా ఉన్న ఫలానా మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ఇంట్లో భేటీ కావడం కాక పుట్టిస్తున్నది. ఆ సమావేశంలో విజయశాంతి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, విఠల్, బూర నర్సయ్యగౌడ్, రవీంద్రనాయక్, వివేక్, మహేశ్వర్‌రెడ్డి, తదితర నేతలంతా పాల్గొన్నారు. బీజేపీలో చీలిక తెచ్చేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నాడంటూ సమావేశం అనంతం మీడియాకు చెప్పినప్పటికీ.. బీజేపీలో ఈటలకు ప్రమోషన్‌పైనే ప్రధానంగా చర్చ నడిచిందని తెలుస్తోంది. ఈ ప్రమోషన్‌పై ఆ నేతలంతా ఈటలకు వ్యతిరేకంగా మారి బండికి అనుకూలంగా మారారని ప్రచారం జరుగుతున్నది. తామూ ఉద్యమకారులమే...తమకూ ప్రజల్లో పేరుంది...మమ్ముల్ని అధిష్టానం ఎందుకు పట్టించుకోవట్లేదు? అనే కొత్తపల్లవి ఎత్తుకున్నట్టు తెలిసింది. పార్టీ కార్యాలయం కేంద్రం కాకుండా రోజుకో చోట నేతలు సమావేశాలు

...5లో

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష



హైదరాబాద్: తెలంగాణ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పరీక్ష రాసిన అభ్యర్థులు మాట్లాడుతూ.. గత గ్రూప్ 1 పరీక్ష కంటే ఈసారి పేపర్ సులభంగా ఉందని చెప్పారు. ఔటాఫ్ సబ్జెక్ట్ ప్రశ్నలు రాలేదన్నారు. పరీక్ష హాల్లో కూడా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారని


...5లో

అదానీ, మోడీ కవలలు

మోడీకి 30 మంది కార్పొరేట్ దత్తపుత్రులు

- దేశంలో ఆర్థిక నేరస్తులకు ప్రతినిధి మన ప్రధాని
- ముత్తయిదువు కాదుకాబట్టే పార్లమెంట్ ప్రారంభానికి రాష్ట్రపతికి ఆహ్వానం లేదు
- మోడీ గడ్డంతో పాటు గ్యాస్, పెట్రోల్ ధరలు పెరుగుతున్నాయి : సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

వివరాలు 2లో





అమిత్ షా గో బ్యాక్

తొమ్మిదేండ్ల విద్రోహ పాలనపై వామపక్షాల నిరసనలు

- ఏపీకి ద్రోహం చేసిన బీజేపీకి పాడెకట్టండి : సీపీఐ(ఎం)ఏపీ కార్యదర్శి వి శ్రీనివాసరావు
- దేశానికి, రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీలేదు : సీపీఐ ఏపీ కార్యదర్శి కె రామకృష్ణ

విశాఖ: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాకను నిరసిస్తూ రాష్ట్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ఆదివారం ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. 'అమిత్ షా గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం

...5లో



సామరస్యానికి తెలంగాణ ప్రతీక

మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ

- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రవీంద్రభారతిలో ఘనంగా సాహిత్యోత్సవం

నవతెలంగాణ-కల్చరల్

తెలుగు, ఉర్దూ భాషలు తెలంగాణ ప్రాంతంలో పాలు నీరులా కలసి ఉంటాయని, గంగాజమునా కా తెహజీబ్‌కు ప్రతీక తెలంగాణ రాష్ట్రమని మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా సాహిత్య అకాడమీ, బాషా సాంస్కృతిక శాఖ నిర్వహణలో సాహిత్యోత్సవంగా ఉర్దూ తెలుగు కవులు సమ్మేళనం జరిగింది. ఉర్దూ భాషా కవులు, తెలుగు భాషా కవులు పెద్ద ఎత్తున హాజరు కావడంతో రవీంద్ర భారతి ఆడిటోరియంలో పండుగ వాతావరణం కనిపించింది. హెూం మంత్రి మహమూద్ అలీ కవి సమ్మేళనంను ప్రారంభిస్తూ మాట్లాడారు. తెలంగాణలో ఉర్దూ ప్రాధాన్యత రాష్ట్ర ఆవిర్భావం తరువాత పెరిగిందన్నారు. గత ముఖ్యమంత్రులు పీవీ, చెన్నారెడ్డిలకు తప్ప ఎవరికి ఉర్దూ రాదని, ఇప్పుడు కేసీఆర్‌కు భాషపై పట్టు ఉందన్నారు. ఉర్దూ తెలిసిన అధికారులకు ప్రాముఖ్యత ఇస్తున్నారని తెలిపారు. ఉర్దూ, తెలుగు కవులు ఒకే వేదికపై కవిత్వం చదవటం అరుదైన సంఘటన అన్నారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. 33 జిల్లాల్లో కవి సమ్మేళనం జరుగుతున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రజలది కలసి మెలసి జీవించే సంస్కృతి అని, దర్వాజ, పరార్, చౌరస్తా వంటి ఉర్దూ పదాలు తెలుగులో మిళితమైనాయని వివరించారు. చివరి నైజాం కాలంలో కొంత ఇబ్బంది పడ్డా మంచి కూడా ఎక్కువ జరిగిందన్నారు. సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాక ముందు కన్నీళ్లు, నెత్తురుతో నేల తడిసిందని, రాష్ట్రం వచ్చినక నీళ్ల చెరువులతో కళకళ లాడుతోందని అన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మెన్ ముజిబుద్దీన్ మాట్లాడుతూ.. ఉర్దూ కవులకు ముగ్దుమ్ మోహినుద్దీన్ పేరిట అవార్డ్స్ ఇస్తున్నామని తెలిపారు. ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న మాట్లాడుతూ.. మంచి చేసే ప్రభుత్వాలకు కవులు ప్రచారం చేయాలని, ఇలా చైనాలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో అధికార భాష సంఘం చైర్మెన్ మంత్రి శ్రీదేవి, గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్, మైనార్టీ కమిషన్ చైర్మెన్, సలహాదారు ఏ.కె.ఖాన్, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ పర్యవేక్షణ చేశారు. ఉర్దూ ముషాయిరా, ఖవాలీ, తెలుగు పద్య వచన కవిత్వంతో తెలంగాణ సంస్కృతి పరిమళించింది.

నాలుగో క్లాస్ పాస్..నకిలీ డిగ్రీ

ఇది రాజు గారి పాలన

- కేంద్ర ఆర్డినెన్స్‌కు వ్యతిరేక ర్యాలీలో కేజ్రీవాల్



న్యూఢిల్లీ: కేంద్రంలోని నియంతృత్వ ప్రభుత్వాన్ని దేశం నుంచి తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆదివారం ఢిల్లీలో ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ ఈ రోజు ఢిల్లీకి ఈ ఆర్డినెన్స్ వచ్చింది, రేపు ఇతర రాష్ట్రాలకూ వస్తుంది. కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను తరిమికొట్టేందుకు రాంలీలా మైదాన్‌కు వచ్చాం.అని చెప్పారు.

సుప్రీంకోర్టుపై నాకు నమ్మకం లేదని దేశ ప్రధాని

...5లో

కండ్లల్లో పొడిచి..కత్తితో దాడి చేసి..

యువతి దారుణ హత్య

- వికారాబాద్ జిల్లా పరిగిలో ఘటన


(ఫైల్)

నవతెలంగాణ-పరిగి

యువతి దారుణ హత్యకు గురైన ఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాడ్లాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. పరిగి ఎస్ఐ విట్టల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాడ్లాపూర్ గ్రామానికి చెందిన శిరీష(17)వికారాబాద్‌లోని హాస్పిటల్‌లో నర్సుగా విధులు నిర్వహిస్తోంది. కాగా, తల్లి అనారోగ్య సమస్యల కారణంగా శిరీష.. ఇంట్లో ఉంటుండగా.. శనివారం ఇంట్లో వంట చేయలేదు. దాంతో ఆమె తమ్ముడు శ్రీను వాళ్ల అక్క జుట్టు శారద భర్త అయిన బావ అనిల్‌కుమార్‌కు ఫోన్ చేసి శిరీష అన్నం

...5లో

ఒత్తిడిలో రెజ్లర్లు

రాజీ కోసం బెదిరింపులు

- లేదంటే 40 లోక్‌సభ, 160 అసెంబ్లీ స్థానాలలో బీజేపీకి షాక్..



లోక్‌సభ ఎన్నికల్లో జాట్ ఓట్ల కోసం ముందుచూపు

లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యూఎఫ్ఐ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహిస్తున్న మహిళా మల్లయోధులపై రాజీ చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం నుండి తీవ్రమైన ఒత్తిడి వస్తోంది. దీనికి కారణం లేకపోలేదు. ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లలో జాట్ కులానికి చెందిన వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. జాట్ల ప్రాబల్యం కేవలం హర్యానాకే పరిమితం కాదు. పశ్చిమ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌తో పాటు ఢిల్లీలో కొంతమేర వీరు నిర్ణయాత్మక శక్తిగా కొనసాగుతున్నారు.

న్యూఢిల్లీ : ఈ నాలుగు రాష్ట్రాలలోని 40 లోక్‌సభ స్థానాలలో, వాటి పరిధిలోని 160 అసెంబ్లీ స్థానాలలో అభ్యర్థుల జయాపజయాలను తారుమారు చేసే బలం వీరి సొంతం. కర్నాటక ఓటమితో దక్షిణాది రాష్ట్రాలపై పూర్తిగా పట్టు కోల్పోయిన బీజేపీ, ఉత్తరాదిలోనూ వ్యతిరేకతను మూటకట్టుకుంటోంది. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో విజయం సాధించాలంటే తక్షణమే రెజ్లర్లను భయపెట్టో లేక బతిమాలో దారికి తెచ్చుకోవడం మినహా మరో మార్గం లేదని ఆ పార్టీ నిర్ణయానికి వచ్చింది. ఆ క్రమంలోనే రాజీ ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది.

ఈ నేపథ్యంలోనే నిరసన విరమించాలని, రాజీ చేసుకోవాలని రెజ్లర్లకు బెదిరింపులు వస్తున్నాయి. బ్రిజ్ భూషణ్‌పై తొలుత ఆరోపణలు చేసిన మైనర్ రెజ్లర్ ఆ తర్వాత మాట మార్చడానికి ఈ ఒత్తిడే కారణమని ఒలింపిక్ కాంస్య పతక విజేత

...5లో

ఆధారాలు ఇవ్వండి

- రెజ్లర్లకు నోటీసులు ఇచ్చిన ఢిల్లీ పోలీసులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌పై కేసును నమోదు చేసిన ఇద్దరు మహిళా రెజ్లర్లకు ఢిల్లీ పోలీసులు సమన్లు పంపించారు. సింగ్‌పై లైంగిక ఆరోపణలు చేస్తూ కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో సీఆర్‌పీసీ సెక్షన్ 91

...5లో

ఒకప్పుడు పెన్నూ పేపర్‌కే డబ్బుల్లేవు..

ఇప్పుడు మన పోలీస్ స్టేషన్లలో అన్ని వసతులు, సౌకర్యాలు...

- కేవలం ఆరేండ్లలోనే అద్భుత ప్రగతి..
- పోలీసు సంస్కరణల్లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శం 'పంజాగుట్ట పీఎస్‌కు సర్వత్రా ప్రశంసలు'
- కేసీఆర్ దూరదృష్టి వల్లే ఇదంతా సాధ్యం
- 'నవతెలంగాణ'తో తెలంగాణ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్



ములాఖాత్

తెలంగాణ సిద్ధించిన తర్వాత ఎన్నో ఆటుపోట్లు, ఒడిదుడుకులు ఎదుర్కొని తొమ్మిదేండ్లను పూర్తి చేసుకున్నామని రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ తెలిపారు. వాస్తవానికి రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిదేండ్లు పూర్తయినా.. మొదటి ఏడాది ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు, సర్దుబాట్లతోనే సరిపోయిందని ఆయన చెప్పారు. ఆ తర్వాత కరోనా వల్ల రెండేండ్ల విలువైన సమయాన్ని కోల్పోయామని గుర్తు చేశారు. ఇవిపోను మిగిలిన ఆరేండ్ల వ్యవధిలోనే రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించిందని వివరించారు.

ఒకప్పుడు పోలీస్ స్టేషన్లలో పెన్నూ పేపర్ కూడా ఉండేది కాదనీ, కానీ ఇప్పుడవి సకల హంగులు, వసతులు, సౌకర్యాలతో దర్జాగా ఉన్నాయని తెలిపారు. ఇదంతా సీఎం కేసీఆర్ పరిపాలనా పటిమ, దక్షత, దూరదృష్టితోనే సాధ్యమయ్యాయని చెప్పారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 'పోలీస్ పరుగు'ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దామోదర్... నవతెలంగాణ ప్రతినిధి బి.వి.యన్.పద్మరాజుతో ప్రత్యేకంగా ముచ్చటించారు. రాష్ట్రంలో పోలీస్ సంస్కరణలు, జిల్లాలు, మండలాల్లో నూతన పోలీస్ కార్యాలయాలు, స్టేషన్లు, వాటి నిర్వహణ తదితరాంశాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

అప్పుడలా.. ఇప్పుడిలా...

'ఉమ్మడి రాష్ట్రంలో అన్ని రంగాల మాదిరిగానే పోలీసులనూ, ఆ శాఖను ఆనాటి పాలకులు పట్టించుకోలేదు. పోలీస్ స్టేషన్ల నిర్వహణకు కూడా డబ్బులుండేవి కావు. ఎవరైనా ఒక ఫిర్యాదు రాయటానికి వస్తే... పెన్నూ పేపర్ కూడా బయటి నుంచే కొనుక్కోవాలంటూ చెప్పే దుస్థితి. కానీ తెలంగాణ వచ్చాక పోలీస్ స్టేషన్ల ఆధునీకరణ, నిర్వహణలో గణనీయమైన మార్పులను తెచ్చాం. సీఎం కేసీఆర్ ప్రత్యేక జీవోను విడుదల చేయటం ద్వారా గతంలో రూ.375 కోట్లను పోలీస్ శాఖలో మౌలిక సదుపాయాల కోసం విడుదల చేశారు. మరో రూ.500 కోట్లను నూతన వాహనాల కొనుగోలు కోసం కేటాయించారు. తద్వారా గతంలో ఎన్నడూ లేనంతగా అత్యాధునిక వసతులతో కొత్త స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాం. ఈ రకంగా రూపొందించిన హైదరాబాద్ పంజాగుట్ట స్టేషన్ అత్యద్భుతంగా ఉంది. దాన్ని ఇతర రాష్ట్రాలకు చెందిన సీఎంలు, ఉన్నతాధికారులు సందర్శిస్తున్నారు.. ప్రశంసలు కురిపిస్తున్నారు. గతంలో ఒక్కో పోలీస్ స్టేషన్ కేవలం 600 చదరపు అడుగుల్లో ఇరుకిరుగా ఉండేవి. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఆ విస్తీర్ణాన్ని 15 వేల చదరపు అడుగులకు పెంచాం. మరోవైపు పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో మహిళలకు 30 శాతం అవకాశమిస్తున్నాం. షీ టీమ్‌ల నిర్వహణ కోసం హైదరాబాద్‌లో నెలకు రూ.75 వేలు, జిల్లా కేంద్రాల్లో రూ.50 వేలు, మండలాల్లో రూ.25 వేలు కేటాయించటం ద్వారా ఎన్నో ఫలితాలను సాధిస్తున్నాం. మరోవైపు కొత్తగా ఏర్పాటు చేసిన ప్రతీ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్లకు సొంత భవనాలను నిర్మించబోతున్నాం. హైదరాబాద్‌లో నిర్మించిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ దేశం మొత్తం మన వైపు చూసేలా చేసింది...'

ఒకప్పుడు వెలవెల.. నేడు జలకళ...

'మా స్వస్థలం రామగుండం. ఉమ్మడి రాష్ట్రంలో అక్కడి నుంచి హైదరాబాద్‌కు వస్తుంటే ఎక్కడ చూసినా వెలవెల బోతున్న చెరువులు, కుంటలు.. నెర్రెలు బారిన నేలలు కనబడేవి. కానీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయతో చెరువులకు జలకళ వచ్చింది. రైతు బంధు, రైతు బీమాతో అన్నదాతలకు భరోసా వచ్చింది. ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేకుండా అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవార్డులు, రివార్డులే ఇందుకు నిదర్శనం. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణను కొంగు బంగారమైంది. కొంతమంది ఆధునిక సాంకేతికత వల్ల అన్ని చోట్లా అభివృద్ధి సాధ్యమైందని అంటున్నారు. అలాంటి వారు పక్కనున్న మహారాష్ట్రతోపాటు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలను తెలంగాణతో పోల్చి చూస్తే వాస్తవం బోధపడుతుంది. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు నచ్చి... మహారాష్ట్రకు చెందిన ప్రజలు తమ ప్రాంతాలను తెలంగాణలో కలపాలంటూ కోరుతున్నారు. ఈ క్రమంలో మనం సాధించిన అభివృద్ధిని చూసి ప్రతీ ఒక్కరూ గర్వపడాల్సిందే...'

పండుగలా జరుపుకుందాం...

'సంక్షేమ, అభివృద్ధి రంగాల్లో శరవేగంగా దూసుకుపోతున్న తెలంగాణ ప్రగతిని దశ దిశలా చాటి చెప్పేందుకే రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోంది. తెలంగాణలోని ఇంటింటికీ పథకాలు, ప్రయోజనాలు అందుతున్న ప్రస్తుత తరుణంలో మనం ఈ ఉత్సవాలను పండుగలా జరపుకుందాం. వీటిని జయప్రదం చేసేందుకోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాలి...'

అమరవీరుల స్మారక చిహ్నం పనులు

- పరిశీలించిన మంత్రి వేముల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అమరవీరుల స్మారక చిహ్నం నిర్మాణ పనులను రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. అదే విధంగా నిమ్స్ శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించారు. హుస్సేన్ సాగర్ తీరాన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం పనులను పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో దిగజారిన ఐఐఎఫ్‌టీ ప్లేస్

- మూడు స్థానాలు దిగజారి 27వ ర్యాంకుకు పడిపోయిన వైనం

న్యూఢిల్లీ : వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) ర్యాంకు పడిపోయింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ 2023లో మేనేజ్‌మెంట్ విభాగంలో మూడు స్థానాలు దిగజారి 27వ స్థానానికి చేరుకున్నది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) కింద ర్యాంకింగ్‌ను హెచ్ఆర్డీ మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసింది. గతేడాది ర్యాంకింగ్‌లో, ఐఐఎఫ్‌టీ 24వ స్థానంలో ఉండగా.. 2021లో 25వ స్థానంలో ఉన్నది. 2020లో 26వ స్థానంలో, 2019లో 31వ స్థానంలో ఉన్నది. ఎన్ఐఆర్ఎఫ్ 2015లో దేశంలోని ఉన్నత విద్యాసంస్థలకు ఆబ్జెక్టివ్ ప్రమాణాల ఆధారంగా ర్యాంక్ ఇవ్వడానికి అటువంటి సంస్థలలో పోటీ నైపుణ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రారంభించబడింది.

అదానీ, మోడీ కవలలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ కొత్తగూడెం:

అదానీ-ప్రధాని నరేంద్ర మోడీ కవలపిల్లలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. దేశంలో ఆర్థిక నేరస్తులు, దోపిడీదారులకు ప్రతినిధి మోడీ అని ఆరోపించారు. మోడీకి ఈ రకమైన కార్పొరేట్ దత్తపుత్రులు 30 మంది వరకూ ఉన్నారని వ్యాఖ్యానించారు. మోడీ కేబినెట్‌లో 24 మంది క్రిమినల్స్ ఉన్నారని, వీరిలో హెూం మంత్రి అమిత్‌షా ప్రముఖుడని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ ప్రజాగర్జన సభలో నారాయణ మాట్లాడారు. ముత్తయిదువు కాదు కాబట్టే రాష్ట్రపతి ద్రౌపదిముర్మును నూతన పార్లమెంట్ భవన ప్రారంభానికి బీజేపీ ఆహ్వానించలేదని వ్యాఖ్యానించారు. ప్రధాన మోడీ పాలనలో న్యాయవ్యవస్థ, సీబీఐ, చివరికి ఎలక్షన్ కమిషన్ కూడా దిగజారాయన్నారు. 26 రాష్ట్రాల్లో ఉన్న సీపీఐకి గుర్తింపు రద్దు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశస్థాయిలో బీజేపీ వ్యతిరేక కూటమిలో కేసీఆర్ చేరాలని, లేదంటే అనుమానాలొస్తాయని వ్యాఖ్యానించారు. రేపిస్టులు, క్రిమినల్స్‌ను కాపాడేది బీజేపీ ప్రభుత్వం అన్నారు. అందుకే రేజ్లర్లు నెలల తరబడి ఆందోళన చేసినా బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌శరణ్ సింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఒకప్పటి గంజాయి స్మగ్లర్ అదానీకి ఎయిర్‌పోర్టులు, పబ్లిక్ సర్వీసులు అమ్మేస్తున్నారని ఆరోపించారు. సంపన్నులపై పన్ను తగ్గించి సామాన్యులపై పన్ను భారం మోపుతున్నారని, మోడీ గడ్డం పెరిగినట్లే గ్యాస్, పెట్రోల్, నిత్యావసరాల ధరలు పెంచుతున్నారన్నారు. పోడుభూములను ఖాళీ చేయించి కేంద్రం కార్పొరేట్లకు అప్పగించాలనే కుట్ర చేస్తుందన్నారు. పోడుదారులందరికీ కేసీఆర్ పట్టాలిచ్చి కేంద్రం ఆగడాలను అడ్డుకోవాలని కోరారు. ఎన్ని ఓట్లు ఉన్నాయని కాదు.. బీజేపీని వ్యతిరేకించే శక్తి లెఫ్ట్ పార్టీలకే ఉందని స్పష్టంచేశారు. ఓట్లు కాదు.. రాజకీయ ఐక్యత కీలకమన్నారు. కర్నాటకలో కులమతాలను రెచ్చగొట్టి, సీబీఐని ఉసిగొల్పి లబ్ది పొందాలని చూసిన బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, అక్కడ పోగొట్టుకున్న సూదిని తెలంగాణలో వెతుక్కోవాలనే భావనతో బీజేపీ ఉందన్నారు. పొంగులేటి ఎవరు? డబ్బుల అహంభావంతో వస్తున్న అవకాశవాద రాజకీయ నాయకులను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అలా అని సీట్ల కోసం లక్ష్మణ రేఖ దాటాల్సిన అవసరం కమ్యూనిస్టులకు లేదన్నారు. కేసీఆర్‌కు అతి తెలివి తేటలు ఎక్కువని, రాజకీయాల్లో విమర్శలు సహజం.. వాటిని సద్విమర్శలుగా స్వీకరిస్తే బాగుపడతారని వ్యాఖ్యానించారు. రూ.10 లక్షల దళితబంధు స్కీంలో రూ.రెండు, మూడు లక్షలకు మించి లబ్దిదారులకు అందడం లేదన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఏమైందని ప్రశ్నించారు. అందరూ కలిసి వస్తేనే తెలంగాణ కల సాకారమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బాధల్లో ఉన్నవారిని కేసీఆర్ ఓదార్చాలని సూచించారు. మిగతా పార్టీలు ఉంటాయో.. లేదో తెలియదు కాని సృష్టి ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుందన్నారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా అస్వస్థత కారణంగా ఈ సభకు రాలేకపోయారని తెలిపారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు మనీష్ కుంజం తదితరులు మాట్లాడారు. అంతకుముందు కొత్తగూడెం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సభలో మాజీ శాసన సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, రావులపల్లి రాంప్రసాద్, మౌలానా, దండి సురేష్ తదితరులు పాల్గన్నారు.

మధ్యప్రదేశ్ బీఆర్ఎస్ సమన్వయకర్తగా బుద్దసేన్ పటేల్

- సీఎం సమక్షంలో పలువురు చేరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మధ్యప్రదేశ్ రాష్ట్ర బీఆర్ఎస్ సమన్వయకర్తగా బుద్దసేన్ పటేల్‌ను కేసీఆర్ నియమించారు. ఆదివారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో కేంద్రంలోని సర్కారు తన లక్ష్యాన్ని విస్మరించిందని చెప్పారు. దశ దిశ లేని పరిపాలన దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా మారిందని విమర్శించారు. రానున్న రోజుల్లో చైతన్యమై, పార్టీలను కాకుండా తమ ఆకాంక్షలను గెలిపించుకోవాల్సిన అవసరముున్నదని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో చాంద్వాడా జిల్లా,

బడులు బాగుపడేనా..!

(మొదటిపేజీ తరువాయి)

మారాయి. కానీ రెండేండ్ల క్రితం ప్రభుత్వం సర్కారు బడుల్లో స్కావెంజర్లను తొలగించడంతో సుమారు 821 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. స్కావెంజర్ల వ్యవస్థ పునరుద్ధరణ అంశం ప్రభుత్వ పరిధిలో ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఉపాధ్యాయులు సొంత డబ్బులతో కార్మికులను నియమించుకుని పారిశుధ్య పనులను చేయిస్తున్నారు. బాలికల పరిస్థితి వర్ణనాతీతం. ఈ విద్యాసంవత్సరమైనా స్వచ్ఛ కార్మికులను నియమిస్తారా? అన్నది తేలలేదు.

'మనబడి'కి నిధుల లేమి..?

మన ఊరు- మనబడి, మనబస్తీ-మనబడి పథకాన్ని ప్రభుత్వం గతేడాది జనవరిలో ప్రారంభించింది. రూ.7వేల కోట్లతో 26 వేల బడుల్లో 12 రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. మొదటి విడతలో రూ.3,497 కోట్లతో 9,123 బడుల్లో చేపట్టింది. బడుల ప్రాంగణం, తరగతి గదులకు రంగులు, కిచెన్‌షెడ్ల నిర్వహణ, డిజిటల్ తరగతి గదుల నిర్మాణం, తాగునీరు, నిరంతర నీటితో కూడిన టాయ్‌లెట్ల నిర్మాణం వంటి వసతులు కల్పించడం ఈ పథకంలో ప్రధాన విధి. మొదటి విడతలో సగం స్కూళ్లలోనే పనులు పూర్తి అయ్యాయి. మిగతా వాటిని షెడ్యూల్ ప్రకారం చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ గడువు పెట్టుకోలేదు. నిధుల లేమితో పనులు జరగడం లేదని తెలుస్తోంది.

ఖాళీగా ఖాళీలు..

అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 21 వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదనపు పోస్టులు, రిటైర్‌మెంటు, ప్రమోషన్లు, బదిలీలు, తదితర కారణాలతో మొత్తంగా 28 వేల పోస్టులు ఖాళీ ఉన్నట్టు ఉపాధ్యాయసంఘాలు వెల్లడిస్తున్నాయి. స్కూల్ అసిస్టెంట్‌లు 7,111, ఎస్‌జీటీ 6,975 పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. 484 ఎంఇఓ పోస్టులకు గాను 467 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనైతే ఏ ఒక్క మండలానికి ఎంఈవో లేరు. పీజీ హెచ్ఎం గ్రేడ్-2 1947, గ్రేడ్-1 పోస్టులు 16కు గాను 15 , ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు 2,043 ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ డీఈవో పోస్టులు 62కు గాను 58, పీఈటీ పోస్టులు 99 ఖాళీగా ఉన్నాయి. సంస్కృతంలో 23 పోస్టులుంటే మొత్తంగా ఖాళీనే. ఆర్ట్ డ్రాయింగ్ 331, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ 443 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

జిల్లాల వారీ ఖాళీలు..

జిల్లాల వారీగా చూస్తే ఖమ్మం జిల్లాలో 5,759 ఉపాధ్యాయులకు గాను 4,702 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇంకా 1,057 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అత్యధికంగా ఎస్జీటీ తెలుగు 342 ఖాళీ ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,372 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఎస్‌జీటీలే 816 భర్తీ చేయాల్సి ఉంది. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 803 ఖాళీలకు గాను స్కూల్ అసిస్టెంట్ 187, ఎస్జీటీలు 616 వరకు, ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,499 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో మొత్తం ఉపాధ్యాయుల పోస్టులు 3,174 ఉంటే ప్రస్తుతం పని చేస్తున్న వారు 2,689. పెద్దపల్లిలో 168 పోస్టులు, జగిత్యాలలో 666, రాజన్నసిరిసిల్లలో 338 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 11,484 మంది ఉపాధ్యాయులు ఉండగా 991ఖాళీలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు.కామారెడ్డిలో 1,119 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

స్కూళ్లకు చేరని పుస్తకాలు, యూనిఫామ్స్

ఉమ్మడి మెదక్ జిల్లాలో 3,582 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. సిద్దిపేటలో తొలి విడత మన ఊరు..మన బడి కింద 343 స్కూల్స్ ఎంపిక చేయగా 100 బళ్లలోనే పనులు పూర్తయ్యాయి. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ స్కూళ్లల్లో 1,07,885 విద్యార్థులకు 5.19 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరముండగా 5.13 లక్షల పుస్తకాలు వచ్చాయి. దుస్తులు మాత్రం ఇంకా రాలేదు. ఇప్పటి వరకు బడిబాట కింద జిల్లాలో 5,612 మందిని నమోదు చేయించారు. మెదక్‌లో 97 స్కూల్స్‌లోనే పనులు వంద శాతం పూర్తయ్యాయి. మిగతా స్కూల్స్‌లో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 4.60 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరముండగా ఇప్పటికే 3.75 లక్షల పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. సంగారెడ్డిలో 158 స్కూల్స్‌లో పనులు పూర్తయ్యాయి. జిల్లాకు 10.38 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరముండగా ఇప్పటికి 4.32 లక్షల పుస్తకాలు మాత్రమే మండలాలకు చేరాయి. స్కూల్స్ ప్రారంభంలోనే పుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తామని అధికారులు చెప్పినా వరంగల్ జిల్లాలో ఆ ఏర్పాట్లు జరగడం లేదు.

మరమ్మతులకు నోచని పాఠశాలలు

కనీస మరమ్మతులకు నోచని పాఠశాలలూ చాలానే ఉన్నాయి. జిల్లా, పట్టణ కేంద్రాల్లోనూ ఇలాంటి సమస్యలున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గెజిటెడ్ నెంబర్ 1పాఠశాలలో సుమారు 500పైగా విద్యార్థులు ఉన్నారు. బడిలో మౌళిక సదుపాయాలు మాత్రం లేవు. ప్రస్తుతం ఈ పాఠశాలలో కిటికీలు ఊడిపోవడం, బేస్మెంట్ పగుళు తేలి ప్రమాదకరంగా మారాయి. ఇలా అనేక పాఠశాలలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతుండగా నేటి నుంచి పునఃప్రారంభం కానున్నాయి.

కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జులైలో మహాపడావ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలైలో మహాపడావ్ నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి. ఆదివారం హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ నేత చంద్రయ్య అధ్యక్షతన కార్మిక సంఘాల సన్నాహక సమావేశం జరిగింది. కార్మిక సంఘాల నాయకులు చంద్రశేఖర్, బాల్‌రాజు, భూపాల్, జె. వెంకటేష్, ఈశ్వర్ ప్రసాద్, ప్రసాద్, అనురాధ తదితరులు మాట్లాడుతూ గత తొమ్మిదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మిక హక్కులను హరిస్తున్నదని చెప్పారు. రైల్వే రక్షణ, ఫార్మా, సింగరేణి తదితర సంస్థలను నిర్వీర్యం చేస్తున్నదన్నారు. ధర పెరుగుదలను అదుపు చేయకపోవడంతో కార్మికుల కొనుగోలు శక్తి క్షీణిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షన్ నిధులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వినాశకర చర్యలను ప్రతిఘటిస్తూ దేశ వ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ, సంఘాల అధ్వర్యంలో దేశ వ్యాప్త సమ్మెలు, ధర్నాలు, నిరసనలు జరుగుతున్నాయని చెప్పారు. జూలై, ఆగస్టు నెలల్లో మోడీ సర్కార్ కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రచార క్యాంపెయిన్‌తోపాటు 48 గంటల రిలే దీక్షలు చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో చంద్రశేఖర్ (ఐన్‌టీయూసీ), బాలరాజు, నర్సింహ (ఎఐటీయూసీ), భూపాల్, జె.వెంకటేష్, కె. ఈశ్వర్ రావు (సీఐటీయూ), ఈశ్వర్ ప్రసాద్ (హెచ్ఎంఎస్), ప్రసాద్ (టీఎన్‌యూసీ), అనురాధ (ఐఎఫ్‌టియు) తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ పాయిట్రీ కేఫ్‌లో అశోక్ చక్రవర్తి కవిత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



పర్యావరణ పరిరక్షణపై డాక్టర్ టీ అశోక్ చక్రవర్తి రాసిన ఆంగ్ల కవిత కెనడాకు చెందిన రేడియో స్టేషన్ వరల్డ్ పొయిట్రీ కేఫ్‌లో ప్రసారం అయ్యింది. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ (యూఎన్‌ఓ) ఏటా జూన్ 5న పర్యావరణ పరిరక్షణ దినం నిర్వహిస్తుంది. ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తుంది. దానిలో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యంపై డాక్టర్ అశోక్ చక్రవర్తి ఆంగ్లంలో కవిత రాసారు. ఈనెల 8వ తేదీ కెనడా రేడియోలో 180 దేశాల్లో ఈ కవితను ప్రసారం చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ టీ అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ 30 ఏండ్లుగా తాను ఆంగ్ల కవిత్వం రాస్తున్నట్టు తెలిపారు. ప్రపంచశాంతి, పర్యావరణంపై ప్రధానంగా కవితలు రాసాననీ, 90 దేశాల్లోని పలు ప్రసారమాధ్యమాల్లో ఇవి ప్రచురితమయ్యాయని వివరించారు. ఈ సందర్భంగా అనేక ప్రసంసలు, అవార్డులు, బిరుదులు అందుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. పలు దేశాల అధ్యక్షులు కూడా తన కవితలను ప్రసంసించారని తెలిపారు.

ప్రతి ఇల్లూ ఓ పోరాట కేంద్రంగా మారాలి

- ఆడబిడ్డలకు న్యాయం కోసం కదలిరండి
- బ్రిజ్‌భూషణ్‌కు తప్పించేందుకు కేంద్రం మౌనం :ఐద్వా అఖిల భారత కోశాధికారి ఎస్.పుణ్యవతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రెజ్లర్ల పోరాటం స్ఫూర్తిదాయకమనీ, వారంతా తమ ఇంట్లోని ఓ ఆడబిడ్డగానే భావించి ప్రతి ఇంటినీ ఓ పోరాట కేంద్రంగా మార్చాలని ప్రజలకు ఐద్వా అఖిల భారత కోశాధికారి ఎస్.పుణ్యవతి పిలుపునిచ్చారు. దేశమంతటా సర్వత్రా విమర్శలొస్తున్నా ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్‌ను అరెస్టు చేయకుండా బీజేపీ సర్కారు మొండిగా ముందుకెళ్తున్నదని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహిళా రెజ్లర్ల పట్ల మనువాదుల దురహంకారం అనే అంశంపై వెబినార్‌ను నిర్వహించారు. అందులో పుణ్యవతి మాట్లాడుతూ.. దేశ చరిత్రను ఆడబిడ్డలు తిరగరాస్తారనీ గురజాడ చెప్పినట్టుగానే క్రీడలతో పాటు అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారనీ, దేశ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేస్తున్నారని అన్నారు. అది గిట్టకే మనువాదులు ఆడబిడ్డలను అణచివేస్తున్నారనీ, మనుధర్మ శాస్త్రం ప్రకారం అణిగిమనిగి ఉండేలా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కొంత భాగం మీడియా కూడా పుండుమీద కారంచల్లినట్టుగా రెజ్లర్లను లైంగిక దాడికి సంబంధించిన ఆధారాలు, ఫొటోలు, వీడియోలు చూపించాలని రెజ్లర్లను వేధించడం దుర్మార్గమని విమర్శించారు. కెమెరాలు తీసుకెళ్లడానికి అది ఏమైనా ఫొటో సెషనా? అని ప్రశ్నించారు. ఆ మీడియా ప్రతినిధుల ఇండ్లలోని మహిళలకు ఇలా జరిగితే అట్లాగే వ్యవహరిస్తారా? అని నిలదీశారు. అంతర్జాతీయ వేదికల మీద దేశ చరిత్రను ఇనుమడింపజేసిన మహిళా రెజ్లర్ల పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరు సరిగాదన్నారు. అమ్మాయిలు రోడ్లెక్కి పోరాటం చేస్తుంటే అంతర్జాతీయంగా మన పరువు, మర్యాద పోతుందనే ఆలోచన కూడా మోడీ సర్కారుకు ఎందుకు కలగడం లేదని ప్రశ్నించారు. ఆడబిడ్డల పోరాటం పట్టదా? వారికి న్యాయం చేయాలనే సోయి లేదా? అని నిలదీశారు. ఓట్ల రాజకీయం కోసం వేధించిన వ్యక్తినే కాపాడటానికే యత్నిస్తున్న తీరును తప్పుబట్టారు. న్యాయం అడిగితే.. మెడల్స్ తెచ్చిన ఆడబిడ్డలను జైళ్లలో పెట్టడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. తాత్కాలికంగా తమ పోరాటాన్ని వాయిదా వేస్తున్నామని రెజ్లర్లు స్పష్టంగా ప్రకటిస్తే... బీజేపీ సోషల్ మీడియా వారిపై అసత్య అసభ్యకరంగా ప్రచారాలు చేయడం దుర్మార్గమన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడే శక్తి బ్రిజ్‌భూషణ్‌కు ఉంది కాబట్టే వెంటనే అతన్ని అరెస్టు చేయాలని రెజ్లర్లు కోరుతున్న డిమాండ్‌లో న్యాయం ఉందన్నారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయకపోగా అతను అక్కడ ఉండగానే సీన్ అపెన్స్ చూడటానికి ఒక అమ్మాయిని అక్కడకు తీసుకెళ్లడం దారుణమని విమర్శించారు. వారిని మానసిక వేధించడమేనని నొక్కి చెప్పారు. కేసులు వెనక్కి తీసుకోవాలని రెజ్లర్లకు బెదిరింపులు వస్తున్నాయన్నారు. నిందితులను వదిలేసి బాధితుల్ని వేధించడం దారుణమన్నారు. అధికారం అనుభవించేవాళ్లకు ఒక న్యాయం? సామాన్యులకు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు.

ఊరికి దారేది..

అనేక పల్లెలకు రోడ్లు కరువు | వాగులు వంకలు దాటి గూటికి..

- ప్రాణాలు పణంగా పెట్టి ప్రయాణం
- అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రులకూ వెళ్లలేని స్థితి
- సమయానికి చేరక ప్రాణం కోల్పోతున్న గిరిజనం
- ఏండ్లు గడుస్తున్నా ఏజెన్సీలో కనిపించని పురోగతి





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గాదిగూడ మండలంలోని కొత్తపెల్లి నుంచి మారేగావ్, కునికాసా, కుండి, పిప్రి తదితర గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. ప్రతి ఏటా వర్షాకాలంలో వాగులు దాటేందుకు జనం ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి ఆస్పత్రులకు చేరుకోలేక పలువురు గర్భిణులు మృతిచెందిన సంఘటనలున్నాయి.

ఉట్నూర్ మండలం బీర్సాయిపేట నుంచి అల్లంపల్లి గ్రామాల మధ్యలో అటవీ ప్రాంతంలో ధర్మాజీపేటకు వెళ్లే దారి ఇది. దట్టమైన అడవి గుండా వెళ్లే ఈ మార్గం సక్రమంగా లేకపోవడంతో అటువైపు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఈ మట్టి రోడ్డు బురదమయంగా కావడంతో బయటి ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది.

నేరడిగొండ మండలానికి 20కి.మీ దూరంలో ఉన్న పీచర వరకు సరైన దారి లేదు. ఈ దారి మధ్యలో సుమారు 8గ్రామాల వరకు ఉంటాయి. మొరం రోడ్డు మాత్రమే ఉండటం.. దట్టమైన అడవి గుండా ప్రయాణం చేయాల్సి రావడంతో అటు వైపున వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో పలుచోట్ల మొరం రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు నిలిపోతాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో వివిధ గ్రామాల ప్రజలు దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక పల్లెలు ఇప్పటికీ కనీస రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏండ్లు గడిచినా ఇప్పటికీ మారుమూల ప్రజలు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. అడవుల జిల్లాగా పేరుగాంచిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఇప్పటికీ అనేక గ్రామాలకు సులభతర మార్గాలు లేవు. ఒక ఊరి నుంచి మరో పల్లెకు వెళ్లాలంటే కాలినడకనే దిక్కు. మట్టి రోడ్లు, రాళ్లరప్పల మధ్య కొన్ని కిలోమీటర్ల దూరం వెళితే కానీ వాహన సౌకర్యం లభించని పరిస్థితి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కొన్ని పల్లెలకు రోడ్లువేసి దారి సౌకర్యం కల్పించినప్పటికీ ఇంకా అనేక పల్లెలు దారి సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నాయి. సంక్షేమం మాట చెబుతున్న పాలకులు మౌలిక వసతులపై మాత్రం దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గతంలో 866గ్రామ పంచాయతీలు ఉండగా రాష్ట్ర ఆవిర్భావ అనంతరం పంచాయతీల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 2వేల గ్రామాలకు పైగా ఉండగా ఇందులో అధికంగా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నాయి. ఇప్పటికీ అనేక పల్లెలు అటవీ ప్రాంతంలో ఉండటంతో వాటికి కనీస రోడ్డు సౌకర్యం లేదు. అనేక గ్రామాలు పంచాయతీలుగా రూపాంతరం చెందినా దారి సౌకర్యాలు మాత్రం మెరుగుపడటం లేదు. ఇప్పటికీ ఆ గ్రామాల ప్రజలు మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాలకు నిత్యావసర సరకుల కోసం వెళ్లాలంటే కాలిబాటనే అనుసరిస్తున్నారు. రాళ్లరప్పలు దాటుతూ..కొండలు ఎక్కి..దిగుతూ గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. ఆయా గ్రామాలకు రోడ్డు లేకపోవడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉండటం కారణంగా కాలిబాటతోనే ఆయా ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి రూ.394కోట్లు మంజూరు చేస్తామని ప్రకటన చేసింది. కానీ ఇందులో ఎలాంటి పురోగతీ కనిపించడం లేదు.

వర్షాకాలంలో చాలా దుర్భరం..!

వర్షాకాలం వచ్చిదంటే ఏజెన్సీ ప్రాంతవాసుల్లో భయం మొదలవుతుంది. ఆయా గ్రామాలకు వెళ్లాలంటే కనీసం రోడ్డు సౌకర్యం లేకపోవడం..మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు దాటడం వారికి కత్తిమీది సాములా మారుతుంది. ప్రతి ఏటా వాగుల్లో కొట్టుకుపోయి మృతి చెందుతున్న ఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా మట్టి రోడ్లు, రాళ్లరప్పలు ఉండటంతో అంబులెన్సులు కూడా చాలా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. దీంతో రోడ్డు సౌకర్యం ఉన్న ప్రాంతాల వరకు వచ్చి ఆగిపోతుంటాయి. ఈ క్రమంలో గర్భిణులు, అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రులకు వెళ్లేవారికి అవస్థలు తప్పడం లేదు. సరైన సమయానికి వైద్యం అందక పలువురు ప్రాణం కోల్పోయిన సందర్భాలున్నాయి. వైద్య బృందాలు సైతం అక్కడికి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాగులు పొంగిపొర్లి ప్రవహిస్తున్న సమయంలో గర్భిణులను మంచంపై మోసుకొస్తూ వాగులు దాటించాల్సి ఉంటుంది. వరదలు వస్తే అనేక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడం ఇక్కడ సాధారణం.



ఏజెన్సీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి



అనేక ఆదివాసీ గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఆస్పత్రికి వెళ్లాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఐటీడీఏకు ప్రభుత్వం నుంచి రూ.కోట్లాది నిధులు బడ్జెట్ వస్తున్నా మారుమూల పల్లెలకు సదుపాయాలు కల్పించడం లేదు. ఎలాంటి అభివృద్ధి ఫలాలు ఆదివాసులకు అందడం లేదు. పాలకులు, అధికారులు దృష్టిసారించి దారి లేని పల్లెలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి.

పూసం సచిన్, టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తెలంగాణ వారసత్వం గొప్పది:సీఎం కేసీఆర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ చారిత్రక వారసత్వం మహోన్నతమైనదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు అన్నారు. కోట్లాది సంవత్సరాల చరిత్రకు తెలంగాణ సాక్ష్యంగా నిలవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. దాదాపు 20 కోట్ల సంవత్సరాల క్రితంనాటి చారిత్రక ఆనవాళ్లు తెలంగాణలో లభ్యం కావడం గర్వకారణమని అన్నారు. ఈ దిశగా తెలంగాణ చరిత్ర కారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భారత జాగృతి సంస్థ ప్రచురించిన తెలంగాణ చరిత్ర పుస్తకం 5 సంపుటాలను దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ సాహిత్య దినోత్సవం సందర్భంగా ఆదివారంనాడాయన ప్రగతి భవన్‌లో ఆవిష్కరించారు. భారత జాగృతి చరిత్ర విభాగం గత ఆరేండ్లుగా రాష్ట్రంలోని అనేక చారిత్రక ప్రదేశాలను చరిత్రకారుడు రచయిత శ్రీరామోజు హరగోపాల్ ఆధ్వర్యంలో పలువురు చరిత్రకారులు సందర్శించారు. క్షేత్రస్థాయిలో పరిశోధన చేసి సేకరించిన సమాచారాన్ని, మామిడి హరికృష్ణ, వేముగంటి మురళీకృష్ణ సంపాదకత్వంలో పుస్తకాలకు రూపకల్పన చేశారు. ఆయా ప్రదేశాల లోని శిలాజాలు, కట్టడాలు, శాసనాలు, నాణాలు, గ్రంథాలు సహా అన్ని రకాల చారిత్రక ఆధారాలను అధ్యయనం చేసినట్లు వారు ముఖ్యమంత్రికి తెలిపారు.

స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలి

- రైతులకు పంట నష్టపరిహారం అందించాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్, సాగర్

నవతెలంగాణ-నల్లబెల్లి

కేంద్ర ప్రభుత్వం రైతు పంటలకు 8వ తేదీన ప్రకటించిన మద్దతు ధర కనీసం రైతు ఉత్పత్తి ఖర్చులకు కూడా సరిపోవని, వెంటనే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సాగర్ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా సంఘం రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారం రెండవ రోజు కొనసాగాయి ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ.. వరి, మొక్కజొన్న, పత్తి ఇతర పంటలకు పెట్టుబడి కూడా రావడం లేదని, రైతు పంటకు కావలసిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, వ్యవసాయ యంత్రాల ధరలు ఎక్కువగా ఉండటంతో తెచ్చిన అప్పులు తీరకుండా ఎక్కువవుతున్నాయన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం పంట ఉత్పత్తికి అయ్యే ఖర్చుకి 50శాతం అదనంగా కలిపి మద్దతు ధరను నిర్ణయించాలని, దాన్ని కనీస మద్దతు ధరల చట్టంగా చేస్తామని 2014లో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా హామీని అమలు చేయకుంటే జరిగే ఘటనలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్పొరేట్ వ్యవసాయంగా మార్చేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ సంవత్సరం వ్యవసాయానికి బడ్జెట్లో రెండు లక్షల కోట్ల రూపాయలు ఇవ్వగా ఇప్పుడు 50వేల కోట్ల రూపాయలను తగ్గించారని విమర్శించారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ నాలుగు సంవత్సరాల ఆరు నెలలు పూర్తయినప్పటికీ చేయలేదన్నారు. గత మార్చిలో అకాల వడగళ్ల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10వేలు ఇస్తామని ప్రకటించినప్పటికీ రూపాయి ఇవ్వలేదని అన్నారు. కౌలు రైతుల చట్టం చేయాలని, పోడు రైతులకు పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు.అనంతరం సాగర్ మాట్లాడుతూ... అశ్వరావుపేటలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14,15,16న నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి సరైన మద్దతు ధర ఇవ్వకపోవడం వల్ల పెట్టుబడి కూడా రాక.. ఏడాదికి 10వేల నుంచి 13వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వంలో రుణ విమోచన చట్టం ఉందని, ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని సూచించారు.

అవయవదానంలో తెలంగాణ నెంబర్ వన్ : మంత్రి హరీశ్

- 'లిటిల్ స్టార్స్ అండ్ షీ' ప్రయివేట్ ఆస్పత్రి ప్రారంభం



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిటి ఆయోగ్ నివేదిక ప్రకారం వైద్య రంగంలో అవయవదానంలో దేశంలో తెలంగాణ నెంబర్ వన్ అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. అలాగే హెల్త్ హబ్‌గా తెలంగాణ రాష్ట్రం ఉందని, గ్లోబల్ సిటీగా హైదరాబాద్ ఎదిగిందని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో 'లిటిల్ స్టార్స్ అండ్ షీ' ప్రయివేటు ఆస్పత్రిని ప్రముఖ సినీ దర్శకులు ఎస్-ఎస్ రాజమౌళితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో రాష్ట్రం గణనీయ పురోగతి సాధిస్తోందన్నారు. సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్‌లను గాంధీ, నిమ్స్‌లో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. వచ్చే నెలలో గాంధీ ఆస్పత్రిలో సేవలు ప్రారంభం కానున్నాయన్నారు. అలాగే త్వరలోనే 10 వేల పడకల సామర్థ్యంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు తెలిపారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేశారని సినీ దర్శకులు రాజమౌళిని మంత్రి అభినందించారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో పేషెంట్ కేర్, సెక్యూరిటీ, ఇతర సేవలకు సంబంధించిన వ్యయాలను భరించేందుకు రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సతీష్, స్థానిక కార్పొరేటర్ మన్నే కవిత గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో.. కొడంగల్ ఎమ్మెల్యేపై కేసు నమోదు



నవతెలంగాణ - బంజారాహిల్స్

కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భూ వ్యవహారం విషయంలో ఇంద్రపాల్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కేసును ఫిలింనగర్ పోలీసులకు బదిలీ చేశారు. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. 2018లో ఫిలింనగర్ పరిధిలోని ఉప్పరపల్లిలో ఓ స్థలం కొనుగోలు చేసేందుకు సామ ఇంద్రపాల్ ప్రయత్నించారు. అయితే ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి ఆయనకు మధ్యవర్తులుగా పరిచయమయ్యారు. మరో వ్యక్తితో కలిసి రూ.3.65 కోట్లకు భూమి అమ్ముతామన్నారు. ఇందుకోసం కమీషన్ ఇవ్వాలని కోరగా ఇంద్రపాల్ సైతం అంగీకరించాడు. ఈ మేరకు అదే ఏడాది మేలో రూ.90 లక్షలు చెల్లించాడు. అనంతరం విడతల వారీగా మొత్తం రూ.3.05 కోట్లు ముట్టజెప్పాడు. మిగతా రూ.60 లక్షల కోసం లోన్‌కు అప్లై చేశానని.. అది రాగానే చెల్లిస్తానని చెప్పాడు. అయితే అది ఆలస్యం అవుతోందని ఎమ్మెల్యే తరఫు అనుచరులు ఇంద్రపాల్‌పై బెదిరింపులకు దిగారు. ఓ గదిలో అతన్ని ఉంచి టార్చర్ చేసినట్టు బాధితుడి ఫిర్యాదులో పేర్కొన్నాడు. వారి బారి నుంచి తప్పించుకొని ఇంద్రపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇలా వివిధ మార్గాల్లో తరచూ తనను బెదిరిస్తున్నా పోలీసులు పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు. అనంతరం ఇంద్రపాల్ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకే బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో పట్నం నరేందర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఈ కేసును ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

నేడు తెలంగాణా రన్

విజయవంతం చేయండి : ప్రభుత్వ ప్రకటన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించనున్న తెలంగాణా రన్ విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్‌లో సోమవారం ఉదయం 6 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని డాక్టర్. బీఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలోని మైదానం 2కే, 4 కే రన్ ఉంటుందనీ, అందులో దాదాపు ఐదువేల మంది రన్నర్లు పాల్గొననున్నట్టు తెలిపింది. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర సీనియర్ అధికారులు పాల్గొంటారు. అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులూ పాల్గొంటారు. ప్రారంభానికి ముందు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, బెలూన్స్ ఎగురవేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేను యోగా చేస్తున్నా..మరీ మీరు..?

అందరూ ఆరోగ్యంగా ఉండాలి

గవర్నర్ తమిళి సై సౌందర రాజన్

- కీర్తిరెడ్డి ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

రెండు రాష్ట్రాలకు గవర్నర్‌గా ఉన్న తాను యోగా చేస్తున్నానని.. మరీ మీరెందుకు చేయరని, అందరూ యోగా చేయాలని తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ తెలిపారు. కీర్తిరెడ్డి ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో హొలిస్టిక్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం హైదరాబాద్‌లోని బోరబండలోని నాట్కో ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఏబీవీ ఫౌండేషన్ చైర్ పర్సన్ కావ్యారెడ్డి, హొలిస్టిక్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఆలూరి తుషారా హాజరయ్యారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కీర్తిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పేదలకు ఇలాంటి మెడికల్ క్యాంప్‌లు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. లైఫ్ ఈజ్ ఫుల్ ఆఫ్ ఛాలెంజస్ అని.. వాటిని ఎదుర్కొవాలంటే మనందరం ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. తెలంగాణ ప్రజలు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారన్నారు. తన భద్రతా సిబ్బంది ఇక్కడకు రావొద్దని హెచ్చరించినా ఇక్కడ వీధులు ఇరుకు కానీ ప్రజల కోసం చేపట్టిన కార్యక్రమం గొప్పది అని వచ్చానన్నారు. ప్రతి సంవత్సరం అందరూ విధిగా హెల్త్ చెకప్ చేయించుకో వాలన్నారు. కీర్తిరెడ్డి ఫౌండేషన్ చైర్ పర్సన్ జూటూరి కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని తెలిపారు. అనంతరం కావ్యారెడ్డి మాట్లాడుతూ.. మంచి ఆహారపు అలవాట్లు మాత్రమే మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అందరూ యోగా చేయాలని చెప్పారు. జంక్‌ఫుడ్ తినొద్దని, పిల్లలు ఏం తింటున్నారో పెద్దలు గమనించాలని సూచించారు. అనంతరం ప్రధాని మోడీ చేపట్టిన టీబీ ఎరాడికేషన్ కార్యక్రమంలో భాగంగా వ్యాధిగ్రస్తులకు గవర్నర్ చేతుల మీదుగా న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, 2డీఎకో, కంటి పరీక్షలు, బోన్ డెన్సిటీటెస్ట్, గైనకాలజీ, మాతృ సంరక్షణకు సంబంధించిన వివిధ సేవలను వైద్యులు అందించారు. హెల్త్ క్యాంపునకు 300 మందికిపైగా ప్రజలు హాజరయ్యారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో.. ములుగు జెడ్పీ చైర్మెన్ కుసుమ జగదీష్ మృతి

సంతాపం తెలిపిన సీఎం కేసీఆర్, మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి

- నేడు అంతిమయాత్రలో పాల్గొననున్న మంత్రి కేటీఆర్



నవతెలంగాణ- ములుగు

ములుగు జిల్లా పరిషత్ చైర్మెన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కుసుమ జగదీష్(47) ఆదివారం హఠాన్మరణం చెందారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో అస్వస్థతకు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు హన్మకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే జగదీష్ మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. కాగా, జగదీష్ ఈ ఏడాది ఏప్రిల్ 1న సైతం గుండెపోటుతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆయన భార్య రమాదేవి సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఇప్పుడు అదే తరహాలో మరోసారి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో జగదీష్ మృతి చెందారు. మృతుడు జగదీష్‌కు భార్య రమాదేవి, కుమారుడు వెంకట సత్యదేవ్, కూతురు హర చందన, తల్లిదండ్రులు ఉన్నారు. కాగా, నేడు ఉదయం 9 గంటలకు జరిగే ఆయన అంత్యక్రియల్లో మంత్రి కేటీఆర్ పాల్గొననున్నారు.

జగదీష్ కుటుంబానికి అండగా ఉంటాం: సీఎం కేసీఆర్

ములుగు జెడ్పీ చైర్మెన్, కుసుమ జగదీష్ అకాల మరణం పట్ల సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారుడిగా నాటి ఉద్యమంలో జగదీష్ పోషించిన చురుకైన పాత్రను, ములుగు జిల్లా పార్టీ అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ చైర్మెన్‌గా జగదీష్ చేసిన సేవలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.





హఠాన్మరణం బాధాకరం : మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి

బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మెన్ కుసుమ జగదీష్ హఠాన్మరణం బాధాకరమని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ అన్నారు. ఆదివారం ములుగులోని జగదీష్ స్వగృహంలో జగదీష్ పార్థివ దేహానికి నివాళు లర్పించిన అనంతరం మంత్రులు మాట్లాడారు. నిన్న మొన్నటి వరకు కలివిడిగా తిరిగిన జగదీష్ మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ములుగు ప్రాంత అభివృద్ధికి కావాల్సిన నిధుల గురించే అడిగేవారని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో.. మాజీ ఎంపీ సీతారాం నాయక్, శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్, జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గోవింద్ నాయక్, స్థానిక సర్పంచ్ చంద కుమారస్వామి, తదితరులున్నారు.

తొమ్మిదేండ్లు గడిచినా ఆర్టీసీ కార్మికుల కష్టాలు పోలేదు

- తక్షణమే వారి సమస్యలు పరిష్కరించండి : సీఎం కేసీఆర్‌కు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తొమ్మిదేండ్ల పాలనలో ఆర్టీసీ కార్మికుల కష్టాలు తీరలేదని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. ఈ ఎన్నికల ఏడాదిలో కేవలం హామీల పేరుతో మరొకసారి ఆర్టీసీ ఉద్యోగులను మోసం చేసే ప్రయత్నం చేయకుండా ప్రగతి భవన్ వేదికగా ఇచ్చిన హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాల కోరారు. ఆర్టీసీలో ఖాళీలు వేల సంఖ్యలో ఉన్నప్పటికీ ఎందుకు నియామకాలు చేపట్టలేదో తెలపాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలల్లో ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తానంటూ చెప్పి ఏండ్లు గడిచినా ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు. పీఎఫ్, సీసీఎస్ బకాయిలు పేరుకుపోతున్నప్పటికీ ఈ నిధులను విడుదల చేయడంలో సీఎంతోసహా అధికారులు సైతం శ్రద్ధ చూపడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉచిత బస్సు పాసులు, ఉద్యోగుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య సదుపాయం, ఉద్యోగులకు గృహ నిర్మాణం హామీలు విస్మరించారని తెలిపారు. స్వరాష్ట్ర సాధన కోసం యుద్ధంలో తమ వీరత్వాన్ని చూపిన ఆర్టీసీ కార్మికుల త్యాగాలను గుర్తించి వారిని ఆదుకోవాలనీ, వారి సమస్యలను తీర్చి, డిమాండ్లను నెరవేర్చి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాదర్బార్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు అర్థరహితం
టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్

ప్రజా దర్బార్ ప్రచార ఆర్భాటామంటూ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని టీపీసీసీ ఉపాధ్యక్షులు జి నిరంజన్ చెప్పారు. ఆయన అవివేకానికి, అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేటీఆర్ దుందుడుకు తనంతో మాట్లాడటం మానుకోవాలని హెచ్చరించారు. ప్రజాదర్బార్‌లో ఎంతో మంది మేధావులు, వివిధ రంగాలలోని నిష్ణాతులు తమ సూచనలు, సలహాలు సీఎంకు ఇచ్చే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు.

13న ఆర్టీసీ కార్మికుల డిమాండ్స్ డే

- సమస్యలు తక్షణం పరిష్కరించాలి : టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఈనెల 13వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్లలో డిమాండ్స్ డే నిర్వహించాలని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. కార్మికులపై వేధింపులు నిలుపుదల చేయాలనీ, పనిభారాలు తగ్గించాలనీ, రెండు వేతన సవరణలు అమలు చేయాలనీ, 2021లో విడుదల చేసిన ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను సవరించాలనీ, గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ 13వ తేదీ ఉదయం డ్యూటీ నుంచే కార్మికులకు డిమాండ్ బ్యాడ్జీలు పెట్టాలేని నిర్ణయించారు. ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం కే గంగాధర్ అధ్యక్షతన జరిగింది. దీనిలో ఆర్టీసీ కార్మికుల స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించారు. ఆర్టీసీలో ప్రస్తుతం కార్మికుల పరిస్థితులపై ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు నివేదిక ప్రవేశపెట్టారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బస్‌పాసుల రీయింబర్స్‌మెంట్ రూ.850 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.295 కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.1,500 కోట్లు కేటాయించి, రూ.763 కోట్లు మాత్రమే ఇచ్చారని వివరించారు. కార్మికులపై పనిభారాలు పెరిగాయనీ, అత్యవసరమైనా సెలవులు ఇవ్వట్లేదనీ, ఈపీకే, కేఎంపీఎల్ పేరుతో వేధింపులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రావెల్ యాజ్ యూ లైక్ (టీఏవైఎల్) టిక్కెట్లు తక్కువ అమ్మారంటూ మేడ్చల్, మియాపూర్ డిపోల్లో కండక్టర్ల ఫోటోలతో ఫ్లెక్సీలు కట్టి అవమానించారని తెలిపారు. ఒక్క ఆర్థిక సమస్యా పరిష్కారం కాలేదనీ, 2017, 2021 సంవత్సరాల వేతన సవరణలు ఇప్పటికీ జరగలేదన్నారు. ఆర్టీసీ యాజమాన్యం సీసీఎస్, పీఎఫ్ సంస్థలకు రూ.1,800 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందనీ, ఫలితంగా కార్మికులు తీవ్ర నిరాశ నిస్పృహలకు గురవుతున్నారని చెప్పారు.



ఉద్యోగ భద్రత లేదనీ, 2021 నాటి సర్క్యులర్‌ను సవరించాలని ఎన్నిసార్లు కోరినా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని విమర్శించారు. యూనియన్లకు అతీతంగా డిమాండ్స్ డేలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పీఎఫ్ హయ్యర్ పెన్షన్‌పై కార్మికులకు అవగాహన కల్పించేందుకు ఖమ్మం, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లో సదస్సులు నిర్వహించినట్టు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సుధాకర్(ఖమ్మం), ప్రభాకర్ (మహబూబ్‌నగర్) నర్సింహా (నల్లగొండ), రాజయ్య (కరీంనగర్), పి చంద్రప్రకాశ్, బిక్షపతిగౌడ్ (హైదరాబాద్) తదితరులు పాల్గొన్నారు. మహిళా కార్మికుల సమస్యలను కన్వీనర్ పద్మావతి వివరించారు.

18న 'రంగురంగుల కవిత్వం' ఆవిష్కరణ

'రంగురంగుల కవిత్వం' పుస్తకావిష్కరణ ఈ నెల 18న సాయంత్రం 5 గంటలకు గుంటూరులో బృందావన్ గార్డెన్స్ 5వ లైను అన్నమయ్య గ్రంథాల యంలో నిర్వహించనున్నారు. కాత్ర గడ్డ దయానంద్ సభాధ్యక్షతన లంకా సూర్యనారాయణ పుస్తకావిష్కరణ చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొ న్నారు. వివరాలకు 8179273971 నంబరు నందు సంప్రదించవచ్చు.



సాహితీ వార్తలు

'సాహితీ కిరణం' కవితల పోటీ

సాహితీ కిరణం, కొసరాజు ఆర్తి అండ్ జాహ్నవి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాధ బాలల అవస్థలు అనే అంశంపై కవితల పోటీ నిర్వహిస్తోంది. ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.3000/-, రూ.2000/-లతో పాటు 5 సమాన బహుమతు లుగా ఒక్కొక్క కవితకు రూ.1000 /- అందివ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు జూన్ 30 లోగా ఎడిటర్, సాహితీ కిరణం, ఇంటి నెంబర్ 11-13-154, రోడ్ నెంబర్ 3, అలకాపురి, హైదరాబాద్ 500 102 చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 9490751681 నంబరు నందు సంప్రదించవచ్చు.

'సోమేపల్లి' చిన్న కథల పోటీ విజేతలు

ఇటీవల 'రమ్యభారతి' ఆధ్వర్యంలో నిర్వహించిన సోమేపల్లి సాహితీ పురస్కారాల చిన్న కథల పోటీల విజేతలను వెలువరించారు. బి.కళాగోపాల్ 'ఆకుపచ్చని పొద్దు', బి.వి.రమణమూర్తి 'విత్తు', మల్లారెడ్డి మురళీమోహన్ 'వైకుంఠపాళి'లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి. శింగరాజు శ్రీనివాసరావు 'ఎగిరే ముద్దు', బి.వి.శివ ప్రసాద్ 'వెన్నెల దీపం', కె.వి. లక్ష్మణరావు 'బాధ నుండి బాధ్యత వైపు' (మానేపల్లి), కె.వి. సుమలత 'ఏది దానం-ఎవరు దాతలకు ప్రోత్సాహక పురస్కారాలు లభించాయి.

'చింతలతొవ్వ'కు వెన్నెలసాహితీ పురస్కారం

తుల శ్రీనివాస్ కవితా సంపుటి "చింతల తొవ్వ" వెన్నెల సాహితీ పురస్కారం -2022 కు ఎంపికయ్యింది. త్వరలో సిద్దిపేటలో నిర్వహించబోయే సాహిత్య కార్యక్రమంలో పురస్కార ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

సాహిత్య రంగంలో ఈ తొమ్మిదేండ్ల కాలంలో జరిగిన అభివృద్ధి ఏమిటి? ఇంకా జరగాల్సినది ఏమున్నది? విస్మరిస్తున్న విషయాలేమిటి? ప్రజా సాహిత్యానికి, ప్రజా కళలకు ఆదరణ పెరిగిందా.. ఏ దారిలో పయనిస్తున్నాము. భవిష్యత్తుకు ప్రణాళిక వేసుకో గలుగుతున్నామా? కొత్తగా రాస్తున్న వారికి ఎలాంటి ప్రోత్సాహం అవసరం!.. వాటిని అందించగలుగుతున్నామా? మొదలైన ప్రశ్నలు, సంశయాలపై ప్రముఖ సాహితీ వేత్తలు, సాహిత్య సంస్థల నిర్వాహకుల అభిప్రాయాలు ఒక సారి పరికిద్దాము..

సేకరణ :ఫీచర్స్ డెస్క్



స్వరాష్ట్రంలో సాహిత్య రంగ తీరుతెన్నులు



33 జిల్లాల సాహిత్య చరిత్రలు రాబోతున్నాయి

తెలంగాణ అవతరించి విస్తృత సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చింది. అట్లాగే సాంస్కృతిక సామాజిక స్వేచ్ఛకోసం పోరాడిన రచయితల, సామాజిక, సాంస్కృతిక యోధుల చరిత్ర పాఠాల్లోకి వచ్చింది. ఉద్యమకాలం ఎగిసిన ప్రశ్నలకు రాష్ట్ర అవతరణ తర్వాత సమాధానాలు దొరికాయి. మొత్తం సినీ రంగంలో తెలంగాణ భాష ఫిదా అవుతున్నది. తెలంగాణపాట అస్కార్ అందుకుంది. సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో వందకు పైగా పుస్తకాలు ముద్రించబడ్డాయి. తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర వెలుగు చూసింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాలల్లో "మన ఊరు మన చెట్టు" అనే కార్యక్రమం నిర్వహించాము. ఇందులో ఐదు నుండి పది తరగతి విద్యార్థులు లక్షల మంది పాల్గొన్నారు. వెయ్యి కథలతో, 33 జిల్లాలకు సంబంధించి పుస్తకాలు రూపొందుతున్నాయి. 'మెకంజీ కైఫీయత్తులు రాయించెను' అన్నట్టుగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తమ ఊరు చరిత్రను తామే రాసి ఆధునిక మెకంజీలుగా మారబోతున్నారు. ఈ ప్రాంత చరిత్రను ప్రపంచానికి చెప్పబోతున్నారు. గిరిజనులపై రాసిన కథల సంకలనం 'కేసులా' సంపుటి వెలువరించాం. మహాత్మా జ్యోతిబా, సావిత్రీ బాయిపై దీర్ఘ కవితా సంకలనాలు రాబోతున్నాయి. 33 జిల్లాల సాహిత్య చరిత్రలు రాబోతున్నాయి. అలాగే 125 అడుగులతో స్థాపించబడిన చారిత్రాత్మకమైన అంబేద్కర్ విగ్రహంపై కవితలు సంకనంగా విడుదల కాబోతున్నది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాహిత్య ఉత్సవంగా 11వ తేదీన తెలంగాణ కవులతో పెద్దఎత్తున కార్యక్రమం జరుపుకున్నాము. ప్రతి ఏడాది కాళోజి, దాశరథి అవార్డులను ఇస్తున్నాము. అలాగే అకాడమి ఆధ్వర్యంలో 'పునాస' సాహిత్య పత్రిక నడుస్తున్నది. ఇది పాఠశాలల వరకు వెళ్తుంది. మనకున్న సాహిత్యం, సమస్త కళలు ప్రజల కోసం సృజించబడాలనే నేపథ్యం నుంచి తెలంగాణలో వున్న సబ్బండ వర్గాల సాహిత్యాన్ని రికార్డు చేసే పనిని అకాడమీ భుజాలపై వేసుకుంటున్నది.

- జూలూరి గౌరి శంకర్, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు



ఫలాలు - విఫలాలు

ఉమ్మడి రాష్ట్రంలో అవహేళనకు గురైన తెలంగాణ భాషకు స్వరాష్ట్రంలో సముచితమైన గుర్తింపు లభిస్తున్నది. పత్రికల్లో, చానళ్లలో, సాంఘిక మాధ్యమాల్లో స్థానిక పదజాలం వాడుక పెరిగింది. రచయితలు ఆత్మగౌరవ భావనతో స్వేచ్ఛగా తెలంగాణ భాషలో రచనలు చేస్తున్నారు. విలన్లకు, కమెడియన్లకు పరిమితం చేసిన సినీరంగం ఇవాళ హీరోలకు, హీరోయిన్లకు తెలంగాణ భాష వినియోగించడం గొప్పమార్పు. విస్మరణకు గురయిన తెలంగాణ రచయితలకు, కవులకు సమప్రాధాన్యం లభిస్తున్నది. తెలుగు పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ రచయితల కృషి విశేషంగా, రచనలు పాఠాలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం దాశరథి, కాళోజీ పురస్కారాలు నెలకొల్పి ప్రతియేటా నిర్వహిస్తున్నది. ఆవిర్భావ దినోత్సవాల్లో రచయితలకు, పండితులకు విశేష పురస్కారాలు అందజేస్తున్నది. కాళోజి పేరిట వరంగల్‌లో వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటు ఒక పులకింత. తెలంగాణ సాహిత్య అకాడమీ ఏర్పడింది. ప్రపంచ తెలుగు మహాసభలు అంతకు ముందుకంటె భిన్నంగా రచయితలకు కేంద్రంగా నిర్వహించటం ప్రత్యేకం. తెలంగాణ భాషా సాహిత్య సృజనాత్మక రచనా, అవధాన ప్రక్రియలు, ప్రపంచ వ్యాప్తమయ్యాయి. కవి సమ్మేళనాలు, పుస్తక ప్రచురణలు, సత్కారాలు సరికొత్త వాతావరణాన్ని సృష్టించాయి. పదోవత్సర ఉత్సవాల సందర్భంగా చూస్తే పూర్తి చేయవలసిన పనులెన్నో మిగిలి ఉన్నాయి. తెలంగాణ జానపద అకాడమీ ఏర్పాటయినా దాని ఏ అడుగూ ముందు పడలేదు. అధికార భాషా సంఘం తొమ్మిదేళ్ల నుంచి ఏ పనీ ప్రారంభించలేదు. అధికార భాషా చట్టం, తప్పనిసరి తెలుగు చట్టం పని చేయలేకపోతున్నాయి. ముఖ్యమంత్రి ప్రకటించిన బమ్మెర, పాలకుర్తి సాహిత్య కారిడార్ ముందుకు జరుగలేదు. వట్టికోట విగ్రహం, సినారె స్మారక కేంద్రం, తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ రచయితల పేరు, యేటా తెలంగాణ సాహిత్య సభలు, ఐదేండ్లకోసారి ప్రపంచ తెలుగు మహాసభలు ప్రకటనలుగానే ఉండిపోయాయి. అధికార భాషా సంఘం తెలుగు పనులు చేపట్టాలి. తెలంగాణ రచయితల జయంతులు, వర్ధంతుల సందర్భంగా ప్రత్యేక సంచికలు ప్రచురించాలి. అమరుల స్మారక కేంద్రం మాదిరిగా రచయితల స్మారక కేంద్రం, తెలంగాణ సాహిత్య సూచీ గ్రంథాలయం, ప్రకటించిన మల్లినాథసూరి సంస్కృత విశ్వవిద్యాలయం సత్వరం నిర్మించాలి. తెలంగాణ నిఘంటు నిర్మాణం, తెలంగాణ జానపదవృత్తి కళాసాహిత్యాల సేకరణ, ప్రచురణ, పరిరక్షణ పనులు చేపట్టాలి. అకాడమీలకు, విశ్వవిద్యాలయాలకు, గ్రంథాలయాలకు తగినన్ని నిధులు కెటాయించి పనులకు పూనుకోవాలి. తెలంగాణ రచయితల పుస్తకాలు కొనుగోలు చేసి రచయితల్ని, ప్రచురణ సంస్థల్ని ప్రోత్సహించాలి. ముఖ్యమంత్రి ప్రకటించిన భాషా సాహిత్య హామీలు, నిర్మాణాలు, వాటి అమలుకోసం పనులు ప్రారంభించాలి.

- నందిని సిధారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు



యువతకు ప్రోత్సాహం ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు. తెలంగాణ సాహిత్య అకాడెమీ ఆరంభంలో ఈ నేల సాహితీ వేత్తల చరిత్రను, సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చారు. సాహితీసభలు, సమావేశాల నిర్వహణ, రవీంద్ర భారతి కేంద్రంగా కొంత పెరిగింది. అయితే కొత్తగా రాస్తున్న యువతకు సరయిన ప్రోత్సాహం, పుస్తకాలు వేయటం జరుగలేదు. కాళోజీ, దాశరథి అవార్డులు ఇస్తున్నారు. కానీ సాహితీకారుల సాహిత్యంపై, జీవితంపై చర్చలు, సెమినార్లు జరపటం లేదు. యువతను ఉత్సాహపరిచే కార్యశాలలూ నిర్వహించటం లేదు. వ్యక్తులుగా, బృందాలుగా, వివిధ సంస్థలూ సాహిత్య కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నారు. తెలంగాణ పారిభాషిక పదకోశం ఇంకా నిర్మించుకోవాల్సే ఉంది. ముఖ్యంగా తెలంగాణ నేల పాటకు పెట్టింది పేరు. పాటకు సంబంధించిన సాహిత్య కళా కార్యక్రమాలుగానీ, ఈ నేలపై పాటల నమోదు కానీ ఇంకా జరగలేదు. పాటలు రాసిన రచయితలను, పాడే వారిని ఉత్సాహపరిచే కార్యక్రమాలు ఏవీ జరుగలేదు. జానపద సాహిత్య సేకరణ, ఆయా కళారూపాలను రికార్డు చేయడం జరగాలి. తెలంగాణ ప్రజాస్వామీకరణ జరగాలంటే పరిపాలనలో తెలుగును తీసుకురావలసి ఉంది. గ్రంథాలయ సంస్థలు రచయితల పుస్తకాలు తీసుకుని ప్రోత్సహించాలి. తెలంగాణ సాహిత్యకారులు వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి, సురవరం ప్రతాపరెడ్డి, సదాశివ, పోతన, రామదాసు, సినారె మొదలైన వారి జన్మ స్థలాలను సాహిత్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. కేంద్ర సాహిత్య అకాడమీలాగా సదస్సులు నిర్వహించాలి. కవులను, రచయితలను అందులో భాగస్వామ్యం చేయాలి. ఈ రాష్ట్ర సాంస్కృతిక, సాహిత్య విధానాన్ని ప్రభుత్వం ప్రకటించాలి. ప్రజా సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావాలి.

- కె.ఆనందాచారి, తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వ తీరు మారాలి

సబ్బండ వర్గాలు, సకల జనులు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేండ్లు కావస్తున్నది. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉత్సవాలు జరుపుకుంటుంది, సంతోషం. అయితే ఈ పదేండ్ల కాలంలో తెలంగాణ నడిచొచ్చిన తొవ్వ, చేరాల్సిన గమ్యం గురించి ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరమున్నది. సాహిత్య, సాంస్కృతిక రంగాలలో తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పుల గురించి కూడా చర్చించుకోవాలి. తెలంగాణ ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేసిన కాళోజీ, దాశరథి పేరిట రాష్ట్రస్థాయి అవార్డులను ఇస్తున్నది. ఇది తెలంగాణ ప్రతిభను గుర్తించడంలో ఒక మైలురాయి. అట్లాగే 2017లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి మన ఖ్యాతిని, గౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేసినాము. అట్లాగే ప్రతి యేటా బుక్‌ఫెయిర్ నిర్వహించుకోవడానికి జాగాను ఫ్రీగా ఇస్తోంది. ఇదంతా సాహిత్యానికి ఇస్తున్న ప్రోత్సాహంగానే చూడాలి. దీనిని ఆహ్వానించాల్సిందే. ఇదే సందర్భంలో తెలంగాణ నుంచి కేవలం ఇద్దరు, అదీ కేవలం బ్రాహ్మణ సామాజిక వర్గం వారే గొప్ప వారు అన్నట్టుగా పై ఇద్దరి పేరిట మాత్రమే అవార్డు ఇవ్వడం తప్పు. తెలంగాణ సమాజం గుర్తించాల్సిన మరో గొప్ప వ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి. ఆయన పేరిట ఒక్క అవార్డు కూడా లేదు. అట్లాగే గతంలో తెలుగు యూనివర్సిటీకి ఆయన పేరు పెడతామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. దేశం గర్వించే ఉద్యమకారుడు, పత్రికా సంపాదకుడు, సాహితీవేత్త భాగ్యరెడ్డి వర్మ. సామల సదాశివ లాంటి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీతలకు తెలంగాణ ప్రభుత్వంలో ఏ మాత్రం గుర్తింపు లేదు. అట్లాగే తెలంగాణ ప్రభుత్వం ఉర్దూ సాహిత్యానికి కూడా గుర్తింపు తీసుకు రావాలి. ఆళ్వారుస్వామి, సురవరం ప్రతాపరెడ్డి, సుద్దాల హనుమంతు, మఖ్దూమ్, భాగ్యరెడ్డి వర్మ, అరిగె రామస్వామి, కపిలవాయి లింగమూర్తి, అలిశెట్టి ప్రభాకర్, బోయ జంగయ్య ఇంకా ఎనుకటి నుంచి తెలంగాణ సాహిత్యాన్ని సుసంపన్నం చేసినవారి సమగ్ర రచనలు సంపుటాలుగా వెలువడాల్సిన అవసరమున్నది. కవులు, రచయితలకు రాష్ట్రం ఏర్పాటైన కొత్తలో ఇచ్చిన అవార్డులు సైతం ఇప్పుడు ఆపేసింద్రు. యువ సాహితీవేత్తలను గుర్తించి, ప్రోత్సహించాలి. అట్లాగే కళలు, సాంస్కృతిక రంగంలో పనిచేసేవారికి ప్రభుత్వమే స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ప్రోత్సహించాలి. అంతిమంగా మన సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి గ్రంథాలయాలను, మ్యూజియంలను, చారిత్రక ప్రదేశాలను కాపాడు కోవాలి. సాహిత్యం ఉద్యమాలనే కాదు, విలువలను కూడా ప్రోది చేస్తుంది. దీనిని ఆర్థిక దృక్కోణంలో చూడరాదు. ఈ తోడ్పాటు మన సమాజం సరైన దిశలో పయనించడానికి తోడ్పడతుంది. ఈ ప్రయాణానికి ప్రభుత్వం ఇకనైనా మరింతగా తోడ్పాటునందించాలి.

- డా. సంగిశెట్టి శ్రీనివాస్, సాహితీవేత్త



కవుల పాత్ర కీలకం

సమాజ నిర్మితిలో ప్రముఖపాత్ర పోషించింది కళాకారులు, కార్మికులు, రైతులే. అందునా మన రాష్ట్ర ఆవిర్భావంలో ప్రముఖ పాత్ర పోషించింది కవులే. తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రతి నేత నోట పలికింది తెలంగాణ ప్రజలని చైతన్య పరిచి ఉత్తేజితం చేసిన తెలుగు కవితలే. ఉద్యమాన్ని చల్లారనీకుండా ఎప్పటికప్పుడు గజ్జగట్టిన ప్రజాకవులు చేసిన ధూమ్ ధామ్ మర్చిపోలేనిది. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్న దాశరథి, 'పల్లె కన్నీరు పెడుతుందో' అన్న గోరటి వెంకన్న, రావెల పాటలు కవులని నిత్య చైతన్య పరిచాయి. ఇక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కవుల పాత్ర మరింత పెరిగింది. పునర్నిర్మాణంలోనూ తమదైన గణనీయ పాత్ర పోషించారు. దాన్ని అంది పుచ్చుకుంది అక్షరయాన్. మహిళా సాహిత్యవేత్తలకు అ,ఆ లు చూపిస్తూ (అంటే అవకాశాల కల్పనా, ఆర్థిక స్వావలంబన) 4 ఏడాదుల్లోనే దూసుకు వెళ్ళిపోయింది. సమాజానికి అవసరమైన ప్రతి అంశాన్ని అంది పుచ్చుకుని తమదైన ముందు చూపుతో సమాజానికి కొత్త మార్గాన్ని చూపించారు. తెలంగాణ ప్రపంచ విత్తన భాండాగారంగా మారిన నేపథ్యంలో సీడ్ సర్టిఫికేషన్ వారికి రైతుల ఆర్థిక ప్రయోజనాల కోసం విత్తన ఉత్పత్తి మీద అవగానే కల్పిస్తూ రాసిన విత్తనం చెప్పిన కథలు, భీజస్వరాలు రెండు పుస్తకాలూ అక్షరయాన్ సౌజన్యంతో ప్రచురింపబడ్డవే. తెలుగు భాషాభివృద్ధి కోసం చేసిన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం కార్యక్రమాలు, సరళ శతకాలు అలా వచ్చినవే. రానున్న కాలంలో ఇవ్వబోతున్న బండారు అచ్చమాంబ, తరిగొండ వెంగమాంబ, కుప్పాంబిక, రంగాజమ్మ పురస్కారాలు మహిళా సాహిత్యకారుల్లో చైతన్యం నింపేవే.

- అయినంపూడి శ్రీలక్ష్మి, అక్షరయాన్ వ్యవస్థాపకురాలు



జరిగిన కృషి కంటే జరగాల్సిందే ఎక్కువ

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక ఎంతో సాహిత్య కృషి జరిగింది. 'తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ' వృక్షం ఉద్భవించి కవి సమ్మేళనాలు నిర్వహించింది. ఈ కవితలతో తొలిపొద్దు, మట్టి ముద్ర, కొత్తసాలు మొదలైన బృహత్ కవితా సంకలనాలురూపుదిద్దుకున్నాయి. భాషా, సాహిత్య, సంస్కృతుల ప్రదర్శన, పుస్తకాల రూపంలో నిక్షిప్తం చేయడమూ జరుగుతున్నది. తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆవిర్భావంతో తెలంగాణ ప్రాధాన్యతను తెలిపే గ్రంథాలతో పాటు ప్రముఖ సాహితీవేత్తల రచనలు పునర్ముద్రణకు నోచుకున్నై. తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ తెలంగాణ సాహిత్యంపై విశేష కార్యక్రమాల్ని, ప్రత్యేక సంచికల్ని రూపొందించాయి. తెలంగాణ సారస్వత పరిషత్తు, జాగృతి, తెలంగాణ అరసం, తెలంగాణ సాహితీ వంటి పలు సంస్థలు సాహిత్యాన్ని, సాహిత్యకారుల్ని గుర్తుచేసుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాల్ని నిరంతరం నిర్వస్తున్నవి. తెలంగాణ యాసలో తెలంగాణ ప్రముఖులు, యాత్రా స్థలాలను, సంస్కృతిని తెలిపే పాఠాలను పొందుపరచడంతో ఈ ప్రాంతం గురించి మరింత తెలుసుకుంటున్నాం. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వల్ల మాత్రమే తెలుగులో 'ఆదికవి' సహేతుకంగా నిరూపితమైంది. అనేక ప్రక్రియలు తెలంగాణా నుంచే ఆరంభమైనట్లు రుజువైనై. పోతన జన్మ స్థలం నిర్ధారణ అయ్యింది. ఇంకా జరగాల్సింది ముఖ్యంగా బాల్యం నుంచే సాహిత్య పఠనాసక్తి పెంపొందించాలి. తెలంగాణ సాహిత్యంపై పోటీలను నిర్వహించి, ఎంపికైన వాటిని ముద్రించాలి. తెలంగాణ భాషా, సాహిత్యాలపై విశ్వ విద్యాలయాల్లో జరిగిన పరిశోధనలను ప్రభుత్వమే ముద్రించాలి. తెలుగులోనే పోటీ పరీక్షలన్నిటిని నిర్వహిస్తే, ఉద్యోగార్థులు ఏ మాధ్యమంలో చదివినా, తెలుగును అనివార్యంగా నేరుస్తారు ఆంగ్లంలాగా. కాబట్టి ఏ ప్రభుత్వాలు పాలనలోకి వచ్చినా చిత్తశుద్ధితో కృషిచేస్తే తెలుగు మరింత వెలుగుతుంది.

- డా. రాపోలు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అరసం.



బహుజన స్ఫూర్తిదాతలను గుర్తించాలి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డంలో తెలంగాణ సాహిత్యం, కళలు, సాంస్కృతిక రంగాల పాత్ర ప్రముఖమైంది. రాష్ట్రం వచ్చాక ఈ రంగాలు స్థానికతను సంతరించుకున్నాయి అనేది చెప్పుకోదగిన అభివృద్ధి. తెలంగాణ సాహిత్యం, కళలు, సంస్కృతి రంగాలు విశిష్టమైనవి, ప్రత్యేకమైనవి. తెలంగాణ ప్రభుత్వం ఈ రంగాలకు సంబంధించిన అభివృద్ధి, ప్రాధాన్యతల్లో సామాజిక స్పష్టత కొరవడింది. ఆధిపత్య కులాల సాహిత్య కళా సాంస్కృతిక పాలసీ విధానంగా వున్నది. తెలంగాణ ప్రభుత్వం జరుపుతున్న జయంతులు, వర్ధంతులు, అవార్డులకు సంబంధించిన తేజోమూర్తుల, వైతాళికుల జాబితా చూసినట్లయితే ఇది మనకు స్పష్టంగా తెలుస్తుంది. తెలంగాణ సాహిత్యం కళా సంస్కృతులు అంటేనే బహుజన శ్రమ కులాల కళలు, సాహిత్య, సాంస్కృతిక రంగాల సంపద. జానపద కళా సంపదలకు జీవజలం తెలంగాణ. ఇట్లాంటి తెలంగాణ అస్తిత్వానికి అణగారిన జన సమూహాలకు చెందిన కళా సాహిత్య సాంస్కృతిక విధాన కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వానికి వుండాలి. తెలంగాణలో ఎంతోమంది బహుజన స్ఫూర్తిదాతలు సామాజిక కళా, సాహిత్య సాంస్కృతిక రంగాలను ప్రభావితం చేసిన మహోన్నతులు ఉన్నారు. హంస అవార్డ్ గ్రహీత చిందు ఎల్లమ్మ, డక్కలి రాయక్క, డక్కలి బాలయ్య, గడ్డం సమ్మయ్య, దున్న ఇద్దాసు, డాక్టర్ బోయ జంగయ్య, మహేంద్ర నాథ్, సదాలక్ష్మి, పద్మశ్రీ టివి నారాయణ, మిద్దెరాములు, సర్వాయి పాపన్నలాంటి వాళ్ళు ఎంతోమంది ఉన్నారు. వీరిని, వీరి సామాజిక స్పృహని, సామాజిక కళా సేవను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాల్సిన అవసరం, బాధ్యత ఉంది

- జూపాక సుభద్ర, సాహితీవేత్త



మరింత శ్రమించాలి

తెలంగాణ సాహిత్య అకాడమీ ఏర్పడటమంటేనే తెలంగాణ అస్తిత్వాన్ని పరిరక్షించడం. సాహిత్యాన్నీ, భాషనూ విస్తరించడంలో శ్రమిస్తున్నందుకు ఆనందంగా ఉంది. అకాడమీ రావడం రావడమే ప్రపంచ తెలుగు మహాసభల్ని నిర్వహించింది. ప్రత్యేకతతో కూడిన సాహిత్య సభల్ని నెలనెలా నిర్వహించింది. పుస్తక ప్రచురణల వల్ల అందుబాటులో లేని కొన్ని పుస్తకాలను ప్రచురించి మెప్పు పొందింది. తెలంగాణ సాహిత్య అకాడమీ మరిన్ని పనులు చేయాలని మనవి. సంస్కృతం నుండి నన్నయ భారతాన్ని అనువాదం చేసిన విషయం నిరక్షరాస్యులు కూడా చెప్పగలరు. తెలంగాణ నుండి పంపడు నన్నయకు ముందే కన్నడంలో పంప భారతం రచించాడు. అది మనకు మొదటి గ్రంథం. దాన్ని తెలుగులోకి అనువాదం చేయించాలి. ఇప్పటి వరకు మనవైన పురాణ, ఇతిహాస, కావ్య ప్రబంధాలకు అర్థతాత్పర్యాలు లేవు. కొన్నిటికి ఉన్నాయి. ఉన్న వాటిని వదిలేసి లేని వాటికి సి.పి.బ్రౌన్‌లాగా కొందరిని నియమించి అర్థ తాత్పర్యాలు రాయించటం చేయాలి. సూర్య రాయాంధ్ర నిఘంటువులాగా ఒక ప్రత్యేక నిఘంటువు రావాలి. తెలంగాణ భాషలోని నుడికారాలను, నానార్థాలను, ప్రకృతి వికృతులను తయారు చేయిచడం మంచిది. తెలంగాణ సాహిత్య చరిత్రకు ఉదాహరణగా ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర లాగా రావాలి. ఇది వరకు సాహిత్య అకాడమీ అవార్డులు ఇచ్చేది. ప్రస్తుతం తెలుగు విశ్వవిద్యాలయానికి ఇది అకాడమీనే వల్ల ప్రతి యేటా వస్తుంది. పూర్వంలాగా ఇవ్వాలి. వివిధ సాహిత్య ప్రక్రియలలో ప్రతియేటా అవార్డులిచ్చి సాహిత్య అకాడమీ ప్రోత్సహించాలి. అనువాదం విషయంలో తెలంగాణ వెనుకబడి ఉంది. ఇతర భాషల నుండి అనువదించుకున్నంతగా మన భాషా సాహిత్యం వివిధ భాషల్లోకి పోయేట్లు చూడాలి. కేంద్ర సాహిత్య అకాడమీలాగా మన సాహితీ వేత్తలపైన ప్రొఫైల్స్ రాయించి అచ్చువేయాలి.

- డా. నాళేశ్వరం శంకరం, రాష్ట్ర అధ్యక్షులు, తెరసం



శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలి

తెలంగాణ ఉద్యమాలను, సాహిత్యాన్ని వేరు చేసి చూడలేము. తెలంగాణ గుండెధ్వని సమాజ చలనానికి దారిదీపంగా నిలిచింది సాహిత్యం. రాష్ట్రం సాధించే వరకు ఉద్యమంతో పెనవేసుకోవడంలో తన వంతు పాత్ర పోషించింది. రాష్ట్రం సిద్ధించి తొమ్మిది వసంతాలు పూర్తై, దశాబ్ది సంబురాలు చేసుకుంటున్నాము. భాషా సాహిత్యాల పట్ల జరగాల్సిన గుణాత్మకమైన మార్పును సమీక్షించుకో వాల్సిన సమయమిది. తెలంగాణ భాష - సాహిత్యాల పునర్వికాసానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పాఠ్య పుస్తకాల్లో మన భాష, సాహితీవేత్తలకు చోటు దక్కినా అది పాక్షికమైన సంతోషాన్నిచ్చేదే. ఇంకా చాలా జరగాలి. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, తాండాల గడపల వరకూ సాహిత్యాన్ని చేర్చుతామనడం, గ్రామ చరిత్రలు రాయించడం అభినందనీయం. ప్రతి జిల్లా కేంద్రంలోనూ ప్రాత: స్మరణీయ సాహితీవేత్త పేరున ఒక స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. అన్ని జిల్లాల ప్రజల పలుకుబడులతో సమగ్ర నిఘంటు నిర్మాణం జరగాలి. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రామసింహ కవికి ప్రజలు కట్టిన గుడిని ధ్వంసం చేశారు. దాన్ని తిరిగి నిర్మించాలి. ప్రతి ఏటా లైబ్రరీల కోసం అందరు కవుల పుస్తకాలు కొనాలి. సాహిత్య అకాడమీ, అధికార భాషా సంఘాలకు పూర్తి స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి, నిధులు కేటాయించాలి. అతి ముఖ్యమైనది, ఈ మధ్య ఇద్దరు కవులు జంగ వీరయ్య, సంద బాబుల మరణం సాహితీ వేత్తలను కలచి వేసింది. కవుల సంక్షేమం గురించి ప్రభుత్వం పట్టించు కోవాలి. చివరి దశలో మందులు కూడా కొనుక్కోలేని దీనస్థితిని మిగిల్చినపుడు తెరవే, మరికొన్ని సాహితీ సంస్థలే ఆదుకున్నాయి. కావున సాహితీ వేత్తల కోసం ఒక శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలి. వారు చనిపోయి కుటుంబం వీధిన పడకుండా వారి కుటుంబానికి ఉపాధి కల్పించాలి.

- గాజోజు నాగభూషణం, అధ్యక్షులు, తెరవే



మరింత శ్రద్ధ పెట్టాలి

తెలంగాణ వచ్చి పదేండ్లు అవుతున్న సందర్భంగా అభినందనలు. ఈ పదేండ్లలో అనేక రంగాలలో తన సత్తాను చాటుకుంది. ఇంకా అనేక రంగాలలో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉంది. అనేక మంది ఔత్సాహికులు తెలంగాణ గురించి పరిశోధనలు చేస్తున్నారు. అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తెలంగాణ వచ్చిన తర్వాత నియామకాల విషయంలో తమకు న్యాయం జరుగుతుందని భావించిన విద్యార్థులకు కొంత నిరుత్సాహం వుంది. సాహిత్య పరంగా చూస్తే కవిత్వం, కథలు, కళలు ఇలా అనేక సాహిత్య ప్రక్రియల్లోకి ఉత్సాహంగా ఎంతో మంది కొత్త వారు ప్రవేశించారు. అయితే వారు ముద్రించుకుంటున్న పుస్తకాలను గ్రంథాలయాలు ప్రోత్సహించకపోవడం బాధాకరం. తెలంగాణ వస్తే పుస్తక పఠనం పెరుగుతుందని, మిగతా రాష్ట్రాల మాదిరిగా మన దగ్గర కూడా గ్రంథాలయాలు మెరుగుపడతాయని, లైబ్రరీలకు ఒక పరిమితి పెట్టి ఎంపిక చేసిన పుస్తకాలు కొంటారని ఆశించారు. కానీ ఇవేవీ జరగలేదు. ఈ విషయంలో కూడా సాహిత్యకారుల్లో చాలా అసంతృప్తి ఉన్న మాట వాస్తవం. తెలంగాణ సాధించి అనేక మంది త్యాగాలతో సాధించిన నీటి పారుదల, ప్రాజెక్టులు, ఊరూర భగీరథ... ఇవన్నీ చాలా మెరుగైన కార్యక్రమాలు. కానీ సాహిత్య రంగానికి మాత్రం ఆశించినంతగా ప్రోత్సహకాలు లభించడం లేదు. ఈ సందర్భంగానైనా ప్రభుత్వాలు దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

- యాకుబ్, కవిసంగమం వ్యవస్థాపకులు



మహిళా సాహితీ కారుల చరిత్ర రికార్డు చేయాలి

తెలంగాణ రాష్ట్రా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అందరికీ అభినందనలు. ప్రతి ఏడాది జిల్లాల వారి సంకలనాలు అంటే కథ, కవిత, వ్యాసం, సాహిత్య విమర్శ సంకలనాలు వెలువరించాలి. అందుకు గ్రామాల వారీగా మరుగున పడిన సాహితీవేత్తలు, వారి రచనల గురించి ప్రతి ఏటా రికార్డు చేయాలి. సాహితీకారులు నిర్భయంగా ప్రజల పక్షం నిలిచి రచనలు చేసే స్వేచ్ఛను కలిగించాలి. ముఖ్యంగా తెలంగాణ గడ్డపై పుట్టిన మహిళా సాహితీకారుల గురించి చరిత్రను పరిశోధించి అచ్చు వేయాలి. చిత్తశుద్ధితో తెలంగాణ సాహిత్య విమర్శనా గ్రంథాలను వెలువరించాలి. అందుకు భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ ద్వారా ప్రభుత్వం పూనుకోవాలి. సాహితీకారులు తమ రచనలను అచ్చు వేసుకునేందుకు తెలుగు విశ్వవిద్యాలయం లాగా ఇతర విశ్వవిద్యాలయాల నుండి కూడా ఆర్థిక సహాయం అందించాలి. ఆర్థికంగా స్థిరత్వం లేని సాహితీకారులను ప్రత్యేకంగా గుర్తించి వారికి భృతి కల్పించాలి. సాహితీకారులు ప్రశాంతంగా రచనలు చేసేందుకు వీలుగా వారికి ఇళ్ళు కట్టించి ఇవ్వాలి. రచయితలకు హెల్త్ కార్డులు, ఆరోగ్యబీమా వంటివి వారికి అందించాలి. (సి.హెచ్.మధు - నిజామాబాద్, సంద బాబు వంటి వారు క్యాన్సర్ బారినపడి సరైన వైద్యం అందక మరణించారు). రేపటి తరానికి సాహిత్యం పట్ల ఆసక్తిని పెంచేందుకు పాఠశాల స్థాయి నుండే ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలి. తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రతి ఏడాది కొన్ని రచనలు ఎంపిక చేసి వివిధ భాషల్లోకి అనువాదాలను చేయించాలి. తెలంగాణ పాఠకుల కోసం ప్రభుత్వం స్వయంగా కొన్ని రచనలను కొనుగోలు చేసి గ్రంథాలయాలకు చేర్చాలి. తెలంగాణ రచయితలు ఇతర భాషల నుండి ఐచ్ఛికంగా అనువాదం చేసిన ఉత్తమ రచనలను ప్రభుత్వం ప్రచురించాలి. ప్రత్యేక అస్తిత్వ సంకలనాలకు ప్రోత్సాహం అందించాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాహిత్య పరంగా తెలంగాణ చరిత్రను జిల్లాల వారీగా పరిశోధించి ప్రచురించే కార్యక్రమాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ చేపట్టింది. కొన్ని జిల్లాల చరిత్ర పుస్తక రూపంలో వెలువరించారు కూడా. వినూత్నంగా విద్యార్థులను భాగస్వామ్యులను చేస్తూ 'మా ఊరు - మా బడి' కార్యక్రమంతో విద్యార్థులకు సాహితి పాఠాలను అందించి రచన పద్ధతులను నేర్పిస్తున్నారు.

- జ్వలిత, బహుళ సంపాదకులు



దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@ gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020



మూడు దశాబ్దాలకు పైగా బుల్లితెరపై చెరగని ముద్ర వేసిన ప్రముఖ న్యూస్‌రీడర్... దూరదర్శన్‌లో మొదటి తరం మహిళా ఆంగ్ల వార్తా వ్యాఖ్యాతలలో ఒకరిగా కీర్తి గడించారు... అంతేకాదు థియేటర్ ఆర్టిస్టుగా కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు... ఆమే గీతాంజలి అయ్యర్. అలాంటి ఆమె జూన్ 7వ తేదీన 76 ఏండ్ల వయసులో అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా ఆమె జీవితంలోని కొన్ని విశేషాలు...

బుల్లితెరపై చెరగని ముద్ర

గీతాంజలి అయ్యర్ 29 జనవరి 1947 జన్మించారు. ఢిల్లీలో పెరిగారు. కేథడ్రల్ అండ్ జాన్ కానన్ స్కూల్లో చదువుకున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, కోల్‌కతాలోని లోరెటో కాలేజీ నుండి పట్టభద్రురాలయ్యారు. అలాగే న్యూఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (NSD) నుండి డిప్లొమా పొందారు. భారతీయ ఆర్థికవేత్త, పాత్రికేయుడు, కాలమిస్ట్ అయిన స్వామినాథన్ ఎస్. అంక్లేసరియా అయ్యర్‌ను ఆమె వివాహం చేసుకున్నారు. తర్వాత కాలంలో వీరు విడిపోయారు. గీతాంజలికి కూతురు పల్లవి, శేఖర్ అయ్యర్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వార్తలు చదవాలని కోరిక

చిన్నతనం నుండి గీతాంజలి సురోజిత్ సేన్, పమేలా సింగ్ వంటి వారు రేడియోలో వార్తలు చదవడాన్ని గమనిస్తూ పెరిగిన ఆమె వారిచే బాగా ప్రభావితమ య్యారు. వాళ్ళు చదువుతున్న వార్త లను తన సొంత శైలిలో అనుకరణ చేస్తుండేవారు. అలా ఆరేండ్ల వయసు నుండే ఆమెకు న్యూస్ యాంకర్ కావాలని కోరిక. ఆ కోరికతోనే 1971లో దూరదర్శన్‌లో చేరారు. పదేండ్లకు పైగా వారానికి కొన్ని రోజులు రాత్రి 9:00 గంటలకు ఆంగ్లంలో ప్రైమ్-టైమ్ వార్తలను చదివారు. వార్తలతో పాటు ప్రతి శుక్రవారం రాత్రి ఆల్ ఇండియా రేడియోలో ఇంగ్లీష్ పాటల కార్యక్రమం 'ఏ డేట్ విత్ యు'తో సహా పలు ప్రముఖ షోలను హోస్ట్ చేశారు. 1978లో ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్ వేర్వేరు సంస్థలుగా మారినప్పుడు గీతాంజలి దూరదర్శన్‌తో కలిసి పని చేశారు.

అనేక పదవుల్లో...

2002లో దూరదర్శన్ నుండి వచ్చేశారు. దూరదర్శన్‌లో పనిచేయడమే కాకుండా గీతాంజలి వివిధ ప్రఖ్యాత సంస్థలలో కొన్ని ముఖ్యమైన పదవులను నిర్వహించారు. 1982 నుండి 1983 వరకు ఢిల్లీలోని తాజ్ హోటల్స్ రిసార్ట్స్ అండ్ ప్యాలెస్‌లలో సేల్స్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్‌గా చేశారు. 1994 నుండి 1998 వరకు డాల్మియా గ్రూప్ అండ్ కార్పొరేట్ వాయిస్ షాండ్‌విక్ PR కార్పొరేట్ కమ్యూనికేషన్స్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ డిపార్ట్‌మెంట్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 1998లో న్యూ ఢిల్లీలోని బ్రిటీష్ హైకమిషన్‌లో ప్రెస్ అండ్ పబ్లిక్ అఫైర్స్ విభాగానికి డిప్యూటీ హెడ్‌గా నియమితులై 2001 వరకు ఈ పదవిలో ఉన్నారు.

కార్పొరేట్ అండ్ మార్కెటింగ్

దూరదర్శన్‌లో తర్వాత గీతాంజలి కార్పొరేట్ కమ్యూనికేషన్స్, ప్రభుత్వ అనుసంధానమై మార్కెటింగ్‌లో పని చేశారు. 2001 నుండి 2005 వరకు న్యూఢిల్లీలోని యష్ బిర్లా గ్రూప్ పబ్లిక్ ఎఫైర్స్ విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 2005 నుండి 2007 వరకు న్యూఢిల్లీలోని ది ఒబెరాయ్ గ్రూప్‌లో అంతర్జాతీయ సేల్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్నారు. 2007లో కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీలో కన్స ల్టెంట్‌గా చేరి అందులో 2010 వరకు కొన సాగారు. 2011లో వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (WWF) అధిపతిగా మారారు. అంతేకాదు కొడుకు అమెరికాలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్‌లో కూడా పనిచేశారు.

ప్రకటన, థియేటర్, టెలివిజన్

గీతాంజలికి నాటక రంగంపై మక్కువ ఎక్కువ. అనేక నాటకాలలో కూడా నటించారు. 1985లో శ్రీధర్ క్షీరసాగర్ దర్శకత్వం వహించిన దూరదర్శన్ టెలివిజన్ ధారావాహిక 'ఖందాన్'లో కూడా నటించారు. అలాగే వివిధ ప్రింట్ ప్రకటనలలో కూడా కనిపించారు. అందులో ఒకటి మార్మైట్ బ్రాండ్ కోసం చేశారు. ఇది తన ఇంటిలోనే డైనింగ్ టేబుల్ మీద తీసిన చిత్రం. 1989లో గీతాంజలి అత్యుత్తమ మహిళగా ఇందిరా గాంధీ ప్రియదర్శిని అవార్డును గెలుచుకున్నారు. దూరదర్శన్‌లో తన పదవీకాలంలో నాలుగు సార్లు ఉత్తమ యాంకర్‌గా అవార్డు పొందారు.



బ్రెయిన్ హెమరేజ్‌తో...

మొదటితరం న్యూస్ రీడర్‌గా ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసుకున్న ఆమె కొన్ని రోజులుగా పార్కిన్సన్స్ వ్యాధితో పోరాడుతున్నారు. ప్రతి రోజు వాకింగ్‌కి వెళ్ళి వచ్చే ఆమె జూన్ 7వ తేదీ కూడా వాకింగ్ పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలారు. సహాయకులు వెంటనే న్యూఢిల్లీలో సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఆమె అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు. ఆమె మరణానికి బ్రెయిన్ హెమరేజ్ కారణమని వైద్యులు నిర్ధారించారు.

ప్రతి క్షణం అప్రమత్తంగా...



గీతాంజలి టెలిప్రాంప్టర్‌ల వంటి సాంకేతిక సహాయాలు అందుబాటులో లేని సమయంలో యాంకర్‌గా పని చేశారు. యాంకర్‌లుగా ఎంతో ప్రశాంతంగా కనిపించాలి. అలాగే కెమెరాపై ఫోకస్ చేస్తూ, చేతిలో ఉన్న పేపర్లను చూస్తూ సమతుల్యం చేసుకోవాలి. అప్పట్లో న్యూస్ రీడర్లుగా తాము ఎదుర్కొన సవాళ్ల గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "మాకు టెలిప్రాంప్టర్‌లు లేవు. మా కోసం స్క్రిప్ట్‌ను మాన్యువల్‌గా ఒక వ్యక్తి రోల్ చేస్తుంటారు. కెమెరా వైపు, చదవాల్సిన వార్తల వైపు ఒకే సమయంలో చూడటం చాలా కష్టం. కెమెరా దగ్గర నిలబడి ఉన్న వ్యక్తి అకస్మాత్తుగా సైగ చేసి, అవసరాన్ని బట్టి వేగంగా లేదా నెమ్మదిగా చదవమని అడుగుతాడు. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ వార్తలు చదవాల్సి వస్తుంది. కాబట్టి ప్రతి క్షణం మేము ఎంతో అప్రమత్తంగా ఉండాలి" అన్నారు.

అభిమానులు ఆపేసేవారు



ఒక ఇంటర్వ్యూలో యాంకర్‌గా ఉన్న సమయంలో అభిమానుల నుండి తనకు వచ్చిన మెయిల్స్, లేఖల గురించి మాట్లాడారు. వాటిలో కేవలం ఆమె యాంకరింగ్ గురించే కాకుండా, విలక్షణమైన ఆమె కేశాలంకరణ, వస్త్రధారణ గురించి కూడా ఎన్నో ప్రశంసలను పొందారు. వార్తలు చదివే ఆమె తీరు ఎందరినో ప్రభావితం చేసింది. ఆమె ఎప్పుడైనా బయట కనిపించినపుడు అభిమానులు ఆపి మరీ పలకరించే వారిని ఆ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. అభిమానులు తన హెయిర్ డ్రెస్సర్, టైలర్ గురించి వివరాలు అడిగేవారంట.

ఉల్లితో మేలు



మనం వంటల్లో ఉల్లిగడ్డలను, ఉల్లికాడలను ఉపయోగిస్తూనే ఉంటాం. ఉల్లి వేస్తే కూర రుచిగా ఉంటుంది. ఇక వేసవికాలంలోనైతే దీని విలువ చెప్పనవసరం లేదు. వంటల్లోనే కాక విడిగా పచ్చి ఉల్లిగడ్డ ముక్కలను కూడా ఎక్కువగానే తీసుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో మండే ఎండల్లో వడదెబ్బ నుండి రక్షణకు పిల్లల మెడలో ఉల్లిగడ్డలను మాలగా గుచ్చి వేస్తారు. పెద్దవారైతే ఎండలో బయటికి వెళ్ళాల్సివచ్చినప్పుడు ఉల్లిగడ్డను తలపై ఉంచుకుని టోపీ పెట్టుకుంటారు. అలాగే చిన్నపిల్లల్లో, పెద్దవారిలో నిద్రలేమిని ఇట్టేమాయం చేసే ఉల్లి ఆరోగ్యానికే కాదు సౌందర్య సాధనంగా కూడా ఉపయోగపడుతుంది.

- ముక్కులో నుండి రక్తం కారుతుంటే తెల్ల ఉల్లిగడ్డను మధ్యలోకి కోసి కాసేపు వాసన చూస్తే సరి.
- మొటిమలు, వాటి తాలూకు మచ్చలకు ఉల్లిగడ్డ రసం, ఆలివ్ ఆయిల్ సమపాళ్లలో కలుపుకున్న మిశ్రమం చక్కని ఔషధం.
- చుండ్రు సమస్య వేధిస్తుంటే ఉల్లి రసం తలకు బాగా పట్టించాలి. ఇది చుండ్రును మాయం చేయడంతో పాటు జుట్టు పెరగడానికి దోహదం చేస్తుంది.
- మూర్ఛతో బాధపడుతున్నప్పుడు ఉల్లి రసాన్ని రెండు మూడు చుక్కలు ముక్కులో వేస్తే వెంటనే తేరుకుంటారు.
- విషకీటకాలు, కుక్కకాటుకు ఉల్లి రసం తీసుకోవడం లేదా ఉల్లిగడ్డను దంచి గాయంపై పూసినా వెంటనే మంట తగ్గుతుంది. విషాన్ని హరిస్తుంది.
- ఎంతగా బాధించే నొప్పులకైనా ఉల్లిరసం, ఆవనూనె సమంగా కలిపి మర్దనచేస్తే చాలు వెంటనే ఉపశమనం దొరుకుతుంది.

అల్పాహారంలో ఇవి చేర్చండి...

ఉదయం పని ఒత్తిడిలో పడి చాలా మంది మహిళలు అల్పాహారం సంగతే మర్చిపోతారు. కానీ అల్పాహారాన్ని అస్సలు నిర్లక్ష్యం చేయొద్దంటున్నారు ఆరోగ్య నిపుణులు. అప్పుడే ఒబేసిటీ ఇబ్బంది వుండదు. ఉదయం పూట కడుపు నిండా తినడం ద్వారా మధ్యాహ్నం పూట మితంగా ఆహారం తీసుకోగలుగుతారు. ఇక రాత్రి పూట అంతగా ఆకలి వేయదు. ఇలా తీసుకుంటే ఆరోగ్యం మీ సొంతం అవుతుంది. అల్పాహారంలో మరికొన్నింటిని జత చేసుకుంటే ఆరోగ్యంగా వుండగలుగుతారని వైద్యులు చెప్తున్నారు. అవేంటో చూద్దాం..



- ఉదయాన్నే టిఫిన్‌లో భాగంగా రాగి జావ తీసుకోవడం ఉత్తమం. ఓట్స్ ఉప్మా లేదా పాలల్లో ఓట్స్ వేసుకుని తీసుకోవచ్చు. పాలతో కార్న్‌ఫ్లేక్స్ తీసుకుంటే శరీరానికి అవసరమైన ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది.
- అల్పాహారంలో తాజా పండ్లు, డ్రై ఫ్రూట్స్ తప్పని సరిగా ఉండేలా చూసుకోండి. ఉడికించిన కోడి గుడ్డు రోజుకు ఒకటి అల్పాహారంలో తీసుకోవాలి.
- సోయాపాలు ఆరోగ్యానికి చాలా మంచివి. మనం తీసుకునే పాల స్థానంలో వారంలో రెండు మూడు రోజులైనా సోయా పాలు తీసుకోవాలి.
- వారంలో ఒక రోజయినా పూరీని అల్పాహారంగా తీసుకోండి. ముఖ్యంగా చిన్న పిల్లలకు పూరీలు, వెజిటబుల్ కర్రీ మంచి ఆహారం.
- ఉదయం పుల్కాలు తినే వారు అందులోకి తాజా కూరగాయలతో పాటు చిరుధాన్యాలతో ఒక కూర చేసుకుంటే శరీరానికి తగిన శక్తి వస్తుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

అమిత్ షా గో బ్యాక్

(మొదటిపేజి తరువాయి)

అన్యాయం చేసిందని, పైగా, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని ఏపీలోని వామపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని విధాలా రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందిగాక విజయోత్సవ సభల పేరుతో మరోమారు మోసం చేయాలని చూస్తున్న బీజేపీకి రాష్ట్ర ప్రజలు పాడెకట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ తొమ్మిదేండ్ల విద్రోహ పాలనపై సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఏపీశాఖల ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలో రైల్వే డీఆర్ఎం కార్యాలయం జంక్షన్ నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ సమీపాన ఉన్న గురజాడ విగ్రహం వరకు నల్లజెండాలు, నల్లదుస్తులతో నిరసన ర్యాలీ జరిగింది. గురజాడ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. 'అమిత్ షా గో బ్యాక్' స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన వారికి విశాఖలో అడుగుపెట్టే అర్హత లేదు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు, దేశంలో యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు అంటూ అధికారంలోకి ఇచ్చిన బీజేపీ తొమ్మిదేండ్ల పాలనంతా విద్వేష, విద్రోహపూరితంగా సాగిందని విమర్శించారు. సుజల స్రవంతికి, వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతానికి నిధులు, రైల్వే జోన్ వంటి హామీలన్నింటినీ తుంగలో తొక్కిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను విక్రయిస్తున్న బీజేపీ చెందిన నేత అమిత్ షాకు విశాఖలో అడుగుపెట్టే నైతిక అర్హత లేదని తెలిపారు. పోలవరం నిర్వాసితులను గోదాట్లో ముంచేయాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించుకుందని విమర్శించారు. సీపీఐ ఏపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయన్నారు. అటవీ చట్టాలను తుంగలో తొక్కి గిరిజనులకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సీపీఐ (ఎంఎల్)ఏపీ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మి, ఆప్ రాష్ట్ర నాయకులు డాక్టర్ సీతల్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ లెనిన్ సెంటర్‌లో జరిగిన ధర్నాలో సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోడీ తొమ్మిదేండ్ల పాలనలో దేశానికి, దేశానికి చేసిన మేలు ఏమీ లేదని అన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని తెలిపారు.

బీజేపీని బలహీనపర్చేలా కేసీఆర్ కుట్ర

- మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీలో రాష్ట్ర అధ్యక్షుడి మార్పు ఉంటుందనీ, ప్రచార కమిటీ చైర్మెన్‌గా ఈటల రాజేందర్ నియమితులు కాబోతున్నారనే వార్తల వెనుక కేసీఆర్ కుట్ర ఉందని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. పార్టీలో విభేదాలుంటే తామే పద్ధతి ప్రకారం పరిష్కరించుకుంటామని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో సీనియర్ నేతలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీలో ఇప్పటివరకూ ప్రచార కమిటీ అనే వ్యవస్థనే లేదని చెప్పారు. ఎన్నికల్లో బీజేపీ నుంచి ప్రమాదం పొంచి ఉన్నందుకే కేసీఆర్ ఇలాంటి ప్రచారాలు చేయిస్తున్నారని విమర్శించారు. గ్రామ, మండల, జిల్లా కమిటీలు వేసిన తర్వాతనే అధ్యక్ష ఎన్నిక ఉంటుందనీ, ఇప్పటికిప్పుడు ఎలా మారుస్తారని ప్రశ్నించారు. మీడియాలో బీజేపీ నాయకత్వ మార్పు, కొత్త పదవులపై వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు.

అధ్యక్ష పదవి మార్పుపై లీకేజీలు సరిగాదు : విజయశాంతి

రాష్ట్రంలో తమ పార్టీ అధ్యక్షుడుగా బండి సంజయ్‌ని మారుస్తున్నారని మీడియా లీకేజీలు సరిగాదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీ విజయశాంతి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకూ బండి సంజయ్‌నే కొనసాగుతారని తరుణ్‌చుగ్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. నేతల భేటీలపై వస్తున్న ఊహాగానాలు అధికారిక ప్రకటనలు కావని తెలిపారు. తమ పార్టీ అధికార ప్రతినిధులు మాత్రమే కచ్చితమైన సమాచారం ఇస్తారని పేర్కొన్నారు. ఊహాగానాల వార్తల ప్రభావం తమ పార్టీపై ఉండబోవని పేర్కొన్నారు.

ఒత్తిడిలో రెజ్లర్లు

(మొదటిపేజి తరువాయి)

సాక్షి మాలిక్ తెలిపారు. రాజీ చేసుకోవాల్సిందిగా పెద్ద ఎత్తున ఒత్తిడి వస్తోందని ఆమె ఓ టెలివిజన్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. బ్రిజ్ భూషణ్ సన్నిహితులు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఫిర్యాదును వెనక్కి తీసుకోవాల్సిందిగా మైనర్ రెజ్లర్ తండ్రిపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారని, దీంతో ఆయన మానసిక ఒత్తిడికి లోనయ్యారని సాక్షి మాలిక్ తెలిపారు. సమస్యను పూర్తిగా పరిష్కరించని పక్షంలో ఆసియా క్రీడలలో పాల్గొనబోమని స్పష్టం చేశారు. హర్యానాలోని సోనేపట్‌లో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రెజ్లర్లు రోజురోజుకూ మానసికంగా ఎంతగా కుంగిపోతున్నారో ఎవరికీ అర్థం కావడం లేదని వాపోయారు. భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించడానికి రెజ్లర్లు ఏర్పాటు చేసిన మహాపంచాయత్‌లో పాల్గొనేందుకు ఆమె సోనేపట్ వచ్చారు. ఆసియా క్రీడల కోసం ఈ నెలలో ట్రయల్స్ నిర్వహిస్తున్న నేపథ్యంలో సాక్షి మాలిక్ చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. నిరసనలో పాల్గొంటున్న రెజ్లర్లు ఆందోళన విరమించి, ఈ ట్రయల్స్‌కు హాజరై ఆసియా క్రీడల జట్టులో స్థానం సంపాదించాల్సి ఉంటుంది. చైనాలో సెప్టెంబర్ 23 నుండి అక్టోబర్ 8 వరకూ ఆసియా క్రీడలు జరగనున్న విషయం తెలిసిందే. కాగా ఈ వ్యవహారంలో పోలీసుల విచారణ పూర్తి కావడానికి ఈ నెల 15 వరకూ సమయం ఇవ్వాలని కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తమను కోరినట్లు రెజ్లర్లు నాలుగు రోజుల క్రితం తెలిపారు.

బీజేపీ అవకాశాలపై ప్రభావం

రెజ్లర్లలో ఎక్కువ మంది జాట్ కులానికి చెందిన వారు ఉండడంతో వారి ప్రభావం నాలుగు రాష్ట్రాలపై ఉండబోతోంది. జాట్ల మద్దతుతోనే ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ అధికారంలోకి రాగలిగింది. అయితే ఇప్పుడు ఆ రాష్ట్రంలో పరిస్థితి మారుతోంది. 2022 అసెంబ్లీ ఎన్నికలలో ఆర్ఎల్‌డీ ఎనిమిది స్థానాలు గెలిచింది. ఇవన్నీ జాట్ల ప్రాబల్యం అధికంగా ఉన్న స్థానాలే. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలోనూ జాట్ల ప్రభావం ఎక్కువగా ఉన్న చోట ఆర్ఎల్‌డీ, దాని మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ గణనీయమైన విజయాలు సాధించింది. మరోవైపు ఆయా ప్రాంతాలలో బీజేపీ చతికిలపడింది. జాట్ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న జిల్లాలలో ఆ పార్టీ 20 నగరపాలిక ఛైర్మన్ స్థానాలను (మొత్తం 56 స్థానాలు), 34 నగర పంచాయత్ ఛైర్మన్ స్థానాలను (మొత్తం 124 స్థానాలు) మాత్రమే పొందగలిగింది. పశ్చిమ యూపీలోని 12 లోక్‌సభ స్థానాలు, 40 అసెంబ్లీ స్థానాలలో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించే శక్తి జాట్లకు ఉంది.

మొత్తంగా చూస్తే యూపీ, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలలోని 40 లోక్‌సభ స్థానాలు, 160 అసెంబ్లీ స్థానాలలో జాట్లు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. యూపీలో 2022 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే జాట్ల ఓట్లు పార్టీలవారీగా చీలిపోయాయి. బీజేపీ తరఫున 10 మంది జాట్ ఎమ్మెల్యేలు విజయం సాధించగా ఆర్ఎల్‌డీ నుండి నలుగురు, సమాజ్‌వాదీ పార్టీ నుండి ముగ్గురు జాట్ ఎమ్మెల్యేలు గెలుపొందారు.

ఆధారాలు ఇవ్వండి

ప్రకారం ఆరోపణలు చేసినదాని ప్రకారం వీడియోలు, ఆడియోలు, వాట్సాప్ చాటింగ్‌లు, ఫోటోలు, బెదిరింపు సందేశాలు వంటి సాక్ష్యాధారాలు ఏమైనా ఉంటే స్టేషన్‌లో పొందుపరచాలని కోరింది.

ఏప్రిల్ 21న భారత మహిళా రెజ్లర్లు ఇద్దరు భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తమను లైంగికంగా వేధిస్తున్నారని, ఊపిరి చెక్ చేస్తానంటూ ఇష్టానుసారంగా మీద చేతులు వేస్తున్నారని, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తాజాగా కన్నాట్ ప్లేస్ పోలీసులు ఫిర్యాదులో వారు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడికి సంబంధించిన వివరాలు ఉంటే తమకివ్వాలంటూ సీఆర్పీసీ సెక్షన్ 91 చేతులు వేసినట్టుగా కానీ, తమను ముట్టుకుంటున్నట్టుగా కానీ ఫోటోలు, వీడియోలు, వాట్సాప్ సందేశాలు ఏమైనా తమకి ఇవ్వాలంటూ సిఆర్పీసి సెక్షన్ 91 ప్రకారం ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సంతకాలు చేసిన నోటీసులను పంపించారు.

టార్గెట్ ఈటల?

(మొదటిపేజి తరువాయి)

పెట్టుకోవడం, ఎవరికి తోచినది వారు మాట్లాడుతుండటం..బయట జరుగుతున్న ప్రచారానికి మరింత బలం చేకూరుస్తున్నది.

కొద్దిరోజులుగా ఈటల రాజేందర్ బీజేపీ అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. తనకు మొదటి నుంచి అనుకూలంగా ఉంటూ వచ్చిన కొండా కూడా అధ్యక్ష మార్పుపై బహిరంగంగానే మాట్లాడారు. పొంగులేటి చేరికపై ఈటలనైతే ఒకడుగు ముందుకేసి ఖమ్మం జిల్లాలో బీజేపీ లేనేలేదని చెప్పారు. దీంతో ఆయన అసంతృప్తిని చల్లబర్చేందుకు అధిష్టానం అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయించింది.

ఈ నేపథ్యంలోనే తెలంగాణలో ఎన్నికల ప్రచార సారథి బాధ్యతలు ఈటల రాజేందర్‌కు, అధ్యక్ష బాధ్యతలు డీకే అరుణకు, బండి సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవిని అధిష్టానం ఇవ్వనున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఇదే విషయంపై బండి మాట్లాడుతూ..రాష్ట్రంలో అధ్యక్షుడి మార్పే ఉండదు..ఎన్నికలు తన సారథ్యంలోనే జరుగుతాయని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. ఇదే అంశంపై గతంలో..బీజేపీలో కార్యకర్త స్థాయి నుంచి ఎదిగినవాడ్ని నన్ను అణచాలని చూస్తే ఊరుకునే వ్యక్తిని కాదంటూ బండి వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచీ ఈటలను డౌన్‌ఫాల్ చేయడాన్ని బండి గ్రూపు తీవ్రం చేసింది. బండి సారథ్యంలో ఉప ఎన్నికల్లో రెండు ఎమ్మెల్యే స్థానాలు గెలిచాం..జీహెచ్ఎంసీలో 48 స్థానాలు గెలిచాం...చేరికల కమిటీ చైర్మెన్‌గా ఈటల ఏం చేసారనే ప్రచారాన్ని ఉధృతం చేసింది. అదే సమయంలో ఈటల అసలు పార్టీనే లేదని చెప్పిన ఖమ్మంలో అమిత్‌షా సభను జయప్రదం చేసి ఈటలకు, అధిష్టానానికి తన సత్తా ఏంటో చూపాలని బండి స్వయంగా సభ ఏర్పాట్లు, జనసమీకరణ అంశాలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

ఇదిలా నడుస్తుండగానే బీసీ సామాజిక తరగతిలో బలమైన నేతగా ఉన్న ఈటల రాజేందర్‌ను రాజకీయంగా వాడుకుని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు పెంచుకోవాలనే భావనలో బీజేపీ అధిష్టానం ఓ అంచనాకు వచ్చి త్వరలో ఎన్నికల ప్రచార సారథ్య బాధ్యతలు అప్పగించనున్నదనే ప్రచారం ఊపందుకున్నది. దీంతో టికెట్లు ఆశిస్తున్న కీలక నేతలు ఈటలను కలిసేందుకు ఆదివారం నాడు ఆయన నివాసానికి వెళ్లడంతో అక్కడ సందడి నెలకొంది. మరోవైపు ఈటల వెనుక ఉన్నవారంతా ఒక్కసారిగా వేరుకుంపటి పెట్టేశారు. 'నేను అణగదొక్కితే అణిగి ఉండేవాన్ని కాదు..నేనేంటో చూపిస్తా' అని బండి వ్యాఖ్యలు చేసినట్టుగానే జరుగుతున్నది. ఓపక్క బండి సంజయ్...కేంద్ర మాజీ మాజీ మంత్రి ప్రకాశ్ జవదేవకర్‌తో వేములవాడ పర్యటనలో ఉండి తెరవెనుక నుంచి రాజకీయం నడిపిస్తున్నట్టు, ఇన్నాళ్లు ఈటలకు అనుకూలంగా ఉన్న కొందరిని వ్యతిరేకంగా మార్చి ఎగదోసినట్టు ప్రచారం జరుగుతున్నది. సీనియర్ నేతల భేటీలో పార్టీలో ఈటలకు ప్రమోషన్‌పైనే ప్రధానంగా చర్చ జరిగిందని తెలిసింది.

ఈటల రాజేందర్ తమని అడ్డుపెట్టుకుని రాజకీయంగా ఢిల్లీ నుంచి చక్రం తిప్పాలని చూస్తున్నారని ఆ నేతలు ప్రధానంగా ఆరోపణలు చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. రాష్ట్ర అధ్యక్షులు ఇక్కడ ఉండగా..ఢిల్లీకి వెళ్లి మరీ పదవుల మార్పుపై లీకులు ఇవ్వడాన్ని ఖండించినట్టు తెలిసింది. ఎంకి పెండ్లి సుబ్బి చావుకొచ్చినట్టు ప్రచార సారథ్య బాధ్యతల పదవి అప్పగింత చర్చ ఈటల మెడకు చుట్టుకుంటున్నది. బీజేపీలో ఏకాకిని చేస్తున్నది. మరోవైపు మొన్నటిదాకా బండికి వ్యతిరేకంగా ఉండి సడన్‌గా ప్లేటు ఫిరాయించిన ఈ నేతలు రానున్నకాలంలో ఆ పార్టీలో ఎంత మంది ఉంటారనేదీ ప్రశ్నార్థకమే. పార్టీలో ఒకదాని వెనుక ఒకటిగా జరుగుతున్న పరిణామాలు బీజేపీ జాతీయ నాయకత్వానికి పెద్ద తలనొప్పిగా మారాయి.

నాలుగో క్లాస్ పాస్..నకిలీ డిగ్రీ

(మొదటిపేజి తరువాయి)

అంటున్నారు. అతనికి అహం ఎక్కువ. దేశంలో ప్రజాస్వామ్యం అంతరించిపోతోంది. దీన్ని నియంతృత్వం, హిట్లర్‌షాహి అంటారు,.అని వివరించారు.

ఈ ఐదు అంశాలే కేజ్రీవాల్ టార్గెట్.

ద్రవ్యోల్బణంపై..

కేజ్రీవాల్ తన ప్రసంగంలో ద్రవ్యోల్బణం గురించి ప్రస్తావించారు. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. పెట్రోలు, పాలు, కూరగాయలు ఖరీదైపోయాయి. ఎల్పీజీ సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,000 దాటింది. దీన్ని ఎలా నియంత్రించాలో వారికి అర్థం కావడం లేదు. నాలుగో క్లాస్ పాస్ రాజుకి దేశాన్ని ఎలా నడిపించాలో కూడా తెలియదు.

ఏదో ఒకరోజు రూ.2000 నోటు వస్తుందని అంటున్నారని, ఐదేండ్ల తర్వాత అది పోతుందని చెప్పారు.

రాజుకు మిత్రుడైన నాయకుడు రైతులపై బండి నడిపినా, పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యమంలో 700 మంది రైతులు చనిపోయారు. రాజు ఏమాత్రం పశ్చాత్తాపమూ లేకుండా తన అహంభావంలో జీవిస్తున్నారని విమర్శించారు.

రాజుకు మరొక స్నేహితుడు ఉన్నాడు, అతను దేశంలోని అంతర్జాతీయ మహిళా మల్లయోధులతో అనుచితంగా ప్రవర్తిస్తాడు, కానీ రాజు దాని గురించి ఏమీ మాట్లాడరు. రాజుకు అతనితో ఉన్న స్నేహం విడదీయలేనిదని చురకలు అంటించారు.మరో స్నేహితుడికి

విమానాశ్రయం, భూమి, గనులు అన్నీ రాసి ఇచ్చారని విమర్శించారు..

పంజాబ్ సీఎం భగవంత్ మాన్, సౌరభ్ భరద్వాజ్, అతిషి, సంజయ్ సింగ్ సహా పలువురు ఆప్ నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

కండ్లల్లో పొడిచి..కత్తితో దాడి చేసి..

(మొదటిపేజి తరువాయి)

వండటం లేదని చెప్పాడు. అనిల్ వీరి ఇంటికి వచ్చి శిరీషను మందలించడంతో పాటు కొట్టడంతో వారి మధ్య గొడవ జరిగింది. దాంతో తవ్ర మనస్తాపానికి గురైన శిరీష రాత్రి 10:30గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఆదివారం ఉదయం గ్రామ శివారులోని గోనె మైసమ్మ గుడి సమీపంలోని చెరువు కుంటలో రక్తపు మరకలతో శిరీష మృతదేహం కనిపించింది. దాంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, శిరీష మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె రెండు కండ్లపై పొడిచిన గాయాలు ఉండగా, పెదవికి కూడా గాయమైనట్టు గుర్తించారు. ఎడమ కాలుకు, ఎడమ మణికట్టుకు గాయాలై రక్తం కారింది. మృతురాలి శరీరంపై గాయాలను బట్టి శిరీషను చంపి కుంటలో పడేశారని పోలీసులు తెలిపారు. మృతురాలి అన్న జుట్టు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ చెప్పారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష

(మొదటిపేజి తరువాయి)

తెలిపారు. ఇన్విజిలేటర్ ఫోన్లను కూడా లోపలికి అనిమతించ లేదని అభ్యర్థులు తెలిపారు. ఈ సారి గ్రూప్ 1 లో ఎక్కువ మంది మంచి మార్కులు సాధించే అవకాశం ఉందని అభ్యర్థులు వెల్లడించారు. పేపర్ లీకేజీ నేపథ్యంలో గత ఏడాది జరిగిన గ్రూప్ 1 ప్రిలిమ్స్‌ను టీఎస్‌పీఎస్సీ రద్దు చేసింది. ఈసారి ఆఫ్‌లైన్ పద్ధతిలో, ఓఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గత ఏడాది ఏప్రిల్ 26న నోటిఫికేషన్ జారీ చేశారు. అక్టోబర్ 16న గ్రూప్ 1 పరీక్ష జరిగింది. 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా 2,85,916 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మెయిన్స్ పరీక్షలకు 25,050 మంది అభ్యర్థులను కమిషన్ ఎంపిక చేసింది. ఆదివారం జరిగిన పరీక్షకు అభ్యర్థులు షూలు ధరించి రావొద్దని.. చెప్పులను ధరించే ఎగ్జామ్ సెంటర్లకు రావాలని కమిషన్ ముందుగానే సూచించింది. గోరింటాకు, టాటూలతో రావొవద్దని, వాచీలు కూడా అనుమతించమని కమిషన్ స్పష్టం చేసింది.

నిరుపేద అమ్మాయి పెండ్లికి అండగా ఉప్పల ఫౌండేషన్



నవతెలంగాణ- నాగోలు

ఉప్పల ఫౌండేషన్ తండ్రి లేని పేదింటి అమ్మాయి పెండ్లికి అండగా నిలిచింది. హైదరాబాద్‌లోని బండ్లగూడ, జైపూర్‌కాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన హేమలత వివాహం కోసం ఆమె కుటుంబ సభ్యులు సహాయం కోసం ఆదివారం హైదరాబాద్ ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోల్ డివిజన్‌లో ఉన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా వారికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పుస్తె, మెట్టెలు, చీర, గాజులను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పెండ్లి కూతురు, వారి కుటుంబ సభ్యులు, ఎన్. సాల్వా చారి, కే. సంతోష్ కుమార్, వి. ప్రవీణ్ కుమార్, ప్రశాంత్, పాష, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ గ్రామంలోని 15వ డివిజన్‌లో నివసించే కొమ్ము అర్జున్ తండ్రి మల్లయ్య ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బాబు జగ్జీవన్ రామ్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుడు డీఆర్‌డీఎల్‌లో కాంట్రాక్టు లేబర్‌గా పనిచేసేవారని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల రాజు, తిమ్మన గిరిష్, నీరుడు శ్రీరాములు, అధ్యక్షులు నర్సింగరావు, వీరుడు నాగేష్, కిన్నెర ప్రవీణ్, గురువును జంగయ్య గడ్డం మహేందర్ పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలో సుపరిపాలన : మేయర్ వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణలో తలెత్తుకుని స్వరాష్ట్రంలో సుపరిపాలన సాగించడం ఆనందంగా ఉందని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమిషనర్ వంశీ కృష్ణ ఆధ్వర్యంలో 'తెలంగాణ సుపరిపాలన దినోత్సవం' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన పరిపాలన సంస్కరణల ద్వారా ప్రభుత్వ వ్యవస్థలను ప్రజలకు మరింత చేరువ చేయడం ద్వారా కలిగిన మేలును ప్రజలకు వివరించారు. ప్రజలే కేంద్ర బిందువుగా, ప్రజా సమస్యల పరిష్కారమే ఇతివృత్తంగా పనిచేస్తే.. ఏ ప్రభుత్వమైనా ప్రజల ప్రశంసలు పొందుతుందని సీఎం కేసీఆర్ భావిస్తారన్నారు. దేశంలో మూడు శాతం కంటే తక్కువ జనాభా ఉన్న తెలంగాణ రాష్ట్రం 30% జాతీయ అవార్డులను గెలుచుకుంటుందన్నారు. ప్రజల కనీస అవసరాలు తీర్చి తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం టీఎస్-బీపాస్ విధానాన్ని ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిందని.. ఈ విధానం ద్వారా భవన నిర్మాణ అనుమతులకు 21 రోజుల్లో సింగిల్ విండో అనుమతి అందజేయబడుతుందన్నారు. దీనిద్వారా ప్రజలు కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే అనుమతులు సాధించుకోవచ్చు అని వివరించారు. సుపరిపాలనలో ఇదొక గొప్ప సంస్కరణ అని కొనియాడారు. భూ కబ్జాలను అరికట్టెందుకు 'ధరణి' వంటి ఆధునిక పద్ధతులను అవలంబించి భూ హక్కులను కల్పించడం జరిగిందని అన్నారు, ఇంకా ఇలాంటి ఎన్నో పరిపాలన సంస్కరణలతో స్వపరిపాలనో రాష్ట్రం అన్ని రంగాలలో దేశానికి ఆదర్శంగా నిలిచిందని అనడంలో అతియోశక్తి లేదన్నారు. అనంతరం వివిధ శాఖల విద్యుత్, పోలీస్, జలమండలి, రెవిన్యూ, మున్సిపల్ అధికారులతో పాటు పాలకమండలి సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సు.. ఫిట్ లెస్!



- నేటి నుంచి పాఠశాలల ప్రారంభం..
- ఫిట్‌నెస్ లేకుండానే బస్సులు రోడ్డెక్కే ప్రమాదం
- తనిఖీలు చేయాలని అధికారులకు పేరెంట్స్ విజ్ఞప్తి

నవతెలంగాణ -సిటీబ్యూరో

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపైకి బస్సులు ఎక్కితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది. ప్రతియేటా మే 15న స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ ముగుస్తోంది. ఈ నేపథ్యంలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను నిర్ణీత సమయంలోపు ఫిట్‌నెస్ చెక్ చేయించుకోవాలని ఆర్టీఏ అధికారులు సూచిస్తున్నారు. కానీ బడి బస్సుల సామర్థ్య పరీక్షలకు పాఠశాలల యజమానులు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో జూన్ 15 తర్వాత ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆర్టీఏ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఎవరైనా ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు లేకుండా బస్సులను నడిపితే భారీ పెనాల్టీలు విధించి సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే అధికారులను హెచ్చరికలను విద్యాసంస్థలు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఎందుకంటే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20వేలకుపైగా స్కూళ్ల బస్సులుండగా.. ఇందులో 30-40శాతం బస్సులకు ఇప్పటి వరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ జారీ కాలేదని సమాచారం. శని ఆదివారాలు సెలవులు కావడంతో సోమవారం నాటికి అవి పూర్తయ్యే పరిస్థితి లేదు. దీంతో పెద్దఎత్తున ఫిట్‌నెస్ లేని బడి బస్సులు రోడ్డు ఎక్కే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయివేటు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రంలో దాదాపు 20వేలకుపైగా విద్యాసంస్థల బస్సులుండగా.. వీటిలో గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో 12034 పాఠశాలలు, కళాశాలల బస్సులున్నాయి. ఇందులో కాలం చెల్లిన బస్సులు మినహా అన్ని బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించుకోవాలి. కానీ రాష్ట్రవ్యాప్తంగా సగానికిపైగా బస్సులకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ జారీ అయ్యాయి. ఇందులో గ్రేటర్‌లోని 12వేలకుపైగా బస్సులకుగాను సుమారు 8వేల స్కూల్, కళాశాల బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు జారీ అయినట్టు సమాచారం. ఇంకా సుమారు 3వేలకుపైగా బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉన్నట్టు సమాచారం. ఇందులో హైదరాబాద్ జిల్లాకు సంబంధించి 920 బస్సులకు ఫిట్‌నెస్ పూర్తికాగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు కలిపి సుమారు 6-7వేల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ అయినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఫిట్‌నెస్‌కు రాని బస్సులపై అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

త్వరలో ప్రత్యేక బృందాల ఏర్పాటు..

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై స్పెషల్ డ్రైవ్‌ను త్వరలోనే చేపడుతామని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) జె.పాండురంగ నాయక్ తెలిపారు. నగరంలోని మొత్తం అయిదు జోన్లకు 5 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే రంగారెడ్డి, మేడ్చల్‌లోనూ ఇదే తరహా బృందాలను ఏర్పాటు చేయనున్నారు. జేటీసీ, డీటీవోల పర్యవేక్షణలో ఆర్టీవో, ఎంవీఐ, ఏఎంవీఐతో కూడిన బృందాలను రంగంలోకి దింపనున్నట్టు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి నడిచే విద్యాసంస్థల వాహనాలను గుర్తించి సీజ్ చేస్తామని తెలిపారు. ఇప్పటికే నెల రోజుల పాటు సమయం ఇచ్చాం. మరో వారం రోజుల్లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందని వాహనాలను గుర్తించి, చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆటోలపై కూడా ప్రత్యేక నిఘా

చాలా మంది తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలలకు ఆటోల్లో పంపిస్తున్నారు. అయితే కొందరు ఆటో డ్రైవర్‌లు ఆటోల్లో దాదాపు 10 మందికి పైగా పిల్లలను ఎక్కించుకుంటున్నారు. దీంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. అందువల్ల ఆర్టీఏ అధికారులు పిల్లల తల్లిదండ్రులకు, ఆటో డ్రైవర్లకు ఆరుగురు మించి ఎక్కువ మందిని పంపించకూడదని, ఎక్కించుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆటో డ్రైవర్లు ఆరుగురికి మించి ఎక్కువ మందిని తీసుకెళ్లితే డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోనున్నారు.

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు హైదరాబాద్ ప్రాంతం ఎట్లుండెనో..ఇపుడు ఎట్లా మారిందో చూడాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి అన్నారు. సరూర్ నగర్ డివిజన్‌లోని లక్ష్మి నగర్ కాలనీలో రూ.32 లక్షలతో చేపట్టిన పార్కు నిర్మాణ పనులకు ఆదివారం విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండు నెలల్లో ఈ పార్కు పనులు పూర్తి చేస్తామని హామీఇచ్చారు. లక్ష్మి నగర్ రోడ్ల అభివృద్ధి కోసం రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ ఆలోచనలతో గ్రేటర్ హైదరాబాద్ ప్రపం చ స్థాయి నగరంగా మారుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఈ ప్రాంతం ఎట్లుండెనో..ఇపుడు ఎట్లా మారిందో చూడాలన్నారు. ఎల్బీనగర్ నగర్ చౌరస్తా లో నూతనంగా నిర్మితమైన ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ లతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోయాయని హర్షం వ్యక్తం చేశారు. గడ్డి అన్నారం మార్కెట్ లో నూతనంగా నిర్మిస్తున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు.

కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నగరంలో పార్కులతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. స్వచ్ఛమైన గాలి, కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం కృషి చేస్తుందని, విరివిగా మొక్కలు నాటాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయనంద్ గుప్తా, మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షులు మహేందర్ యాదవ్, సీనియర్ నాయకులు బేర బాలక్రిష్ణ, అరవింద్ శర్మ, నాగేష్, కొండల్ రెడ్డి, ముద్ద పవన్, సాజిద్ ఋషి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



- కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి

నవతెలంగాణ- సంతోష్ నగర్

ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలల్లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. ఇటీవల డివిజన్ పరిధిలోని కృష్ణానగర్‌లో కార్పొరేటర్ పర్యటించినప్పుడు స్థానికులు కాలనీలో ఉన్న సమస్యను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కార్పొరేటర్ వాటర్ వర్క్స్ అధికారులతో చర్చించారు. ఈ మేరకు ఆదివారం బకెట్ వాహనం, సిబ్బందిని రప్పించి కృష్ణానగర్‌లోని డ్రైనేజీ పూడిక తీయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాలనీలు, బస్తీలల్లో మౌలిక వసుతులు కల్పించడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ పరిధిలో ఎక్కడైనా ఏదేని సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులను కోరారు. వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి దానిని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

సాహెబ్ నగర్ కలాన్‌లో అక్రమ నిర్మాణాల పరిశీలన



నవతెలంగాణ-హయత్ నగర్

హయత్ నగర్ రెవెన్యూ పరిధిలోని సాహెబ్ నగర్ కలాన్ సర్వేనెంబర్ 71/1లో ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఆదివారం తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రారంద స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భూమి మొత్తం 149-32 ఎకరాలు, ప్రస్తుతం 35 ఎకరాలలో ఆర్డిఓ, ఎమ్మార్వో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కలిసి సర్వేనెంబర్ 71/2, 71/3 ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మించుకొని, జీవో 118 కింద రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఈ భూమిలో ఆర్డిఓ తో సహా ఒక్క ఫ్లాట్ దారుని దగ్గర రెండు లక్షల నుండి 5 లక్షల వరకు తీసుకొని రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, డబ్బులు ఇయ్యని వారి నిర్మాణాలను కూలగొట్టి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇదే భూమిలో ఆర్డీవో, ఎమ్మార్వో, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్‌తో సహా ఇల్లు నిర్మించుకున్నారని, ఆర్ఐ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కూడా దొరికిందని తెలిపారు. ఆర్డీవో, తహసీల్దార్ ఇండ్లు బినామీ పేర్లతో ఉండడం వలన ఎవరికి దొరకకుండా ప్రయత్నం చేస్తున్నారన్నారు. కావున ఈ భూమిని సర్వే చేసేంత వరకు ఇందులో జరుగుతున్న 118 జీవో రిజిస్ట్రేషన్‌లను నిలిపివేయాలని ప్రారంద స్వామి డిమాండ్ చేశారు. హయత్‌నగర్ మండలంలో ప్రభుత్వ భూములు దాదాపుగా 70 ఎకరాలు కబ్జాలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాహెబ్ నగర్ కలాన్ సర్వేనెంబర్ 71/1లో 35 ఎకరాలు అనుమగల్ హయత్ నగర్ సర్వేనెంబర్ 255లో15 ఎకరాలు బాగ్ హయత్ నగర్ సర్వేనెంబర్ 25 లో 10 ఎకరాలు రెవెన్యూ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల దగ్గర రూ.కోట్లు బేరం ఆడుకొని మరి దగ్గరుండి ఇల్లు కట్టిస్తున్నారని ఆరోపించారు. మండల అధికారులు ఆర్డిఓ వెంకటాచారి ధైర్యం చూసుకొని ఇష్టం వచ్చినట్లుగా కబ్జాలకు పాల్పడుతూ దండిగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించి..ప్రభుత్వ భూమిని రక్షించకపోతే దళిత సంఘాలు, అఖిలపక్ష పార్టీలతో పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఐ. భాస్కర్, కాంగ్రెస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఎస్సీ సెల్ చైర్మన్ బోడ రాజశేఖర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ బీఎస్‌రెడ్డి అధ్యక్షులు కొంగర నరసింహ, రవి, రాజు, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మైనార్టీ సీనియర్ నాయకుడి జన్మదిన వేడుకలు



నవ తెలంగాణ- చైతన్యపురి

రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ సీనియర్ మైనార్టీ నాయకులు ఎస్కే మహమ్మద్ జన్మదిన వేడుకలను ఆదివారం కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, యువ నాయకులు పటోళ్ల కార్తీక్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత మంత్రి మహమ్మద్‌కు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం కార్తీక్ రెడ్డి గజమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామాచారి, డివిజన్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యామ్ గుప్తా, సోమేశ్వరరావు, రఫీక్ బాబ, శంకర్ మహరాజ్, సంతోష్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

'మౌలిక సదుపాయాలు కల్పిస్తా'



నవతెలంగాణ-హయత్ నగర్

హయత్ నగర్ డివిజన్‌లో దఫాలుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తానని ఆ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీ వాసులకు భరోస కల్పించారు. డివిజన్ పరిధిలోని శంకర్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తైన సందర్భంగా ఆదివారం కాలనీ వాసులు కార్పొరేటర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి.. కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పలు సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

'సుప్రజ' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



తెలంగాణ- నాగోలు

నాగోల్ డివిజన్ శ్రీనివాస నగర్‌లోని విశాలాంధ్ర కమ్యూనిటీ హాల్లో సుప్రజ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ప్రారంభించి మాట్లాడారు. ఈ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేసి, మందులను వైద్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుప్రజ ఆసుపత్రి మేనేజర్ సతీష్, ఇంచార్జి వినయ్ కుమార్, వినోద్ రెడ్డి, తమాస్ చౌదరి, వైద్యులు, ఇతర సిబ్బంది, శ్రీనివాస కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నాయకులకు సన్మానం



నవతెలంగాణ -నాగోల్

హైదరాబాద్ కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని జియాగూడ డివిజన్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం, తెలంగాణ సాహిత్య దినోత్సవం సందర్భంగా ఉద్యమ నాయకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం పలువురు ఉద్యమ నాయకులకు షీల్డ్ బహూకరించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాద శ్రీనివాస్ గుప్తా, డివిజన్ అధ్యక్షుడు నరహరి, డివిజన్ ఇంచార్జి టి.జీవన్ సింగ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి బాబు, యూత్ అధ్యక్షులు కిషోర్ కుమార్, మహిళా అధ్యక్షురాలు నర్మద, రాష్ట్ర కమిటీ సభ్యులు కావూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్తగా మహమ్మద్ అలీ



నవతెలంగాణ -సంతోష్ నగర్

అంతర్జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయం సంస్థ హైదరాబాద్ జిల్లా సామాజిక కార్యకర్తగా మహమ్మద్ అలీ ఎన్నికయ్యారు. యాకత్‌పురా నియోజకవర్గం మొగల్‌పురా డివిజన్ పరిధిలోని అంతర్జాతీయ ఫౌండర్ అధ్యక్షులు నిరాజ్ సింగ్ ఆదేశం మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ బషారత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ మాట్లాడుతూ.. సమాజ సేవలో ముందుంటానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు. అనంతరం అధ్యక్షులకు, అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర సంఘం ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

- కిమ్స్ కడల్స్ మహిళా ఆరోగ్య సదస్సులో గవర్నర్ డాక్టర్ తమిళిసై



నవతెలంగాణ -సిటీబ్యూరో

కుటుంబంతో పాటు సమాజంలోనూ మహిళల పాత్ర ఎంతో కీలకమని, వారు బాగుంటేనే సమాజం ముందడుగు వేస్తుందని తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. కిమ్స్ కడల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో హెచ్ఐసీసీలోని నోవోటెల్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన మహిళా ఆరోగ్య సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏ చిన్న అనారోగ్యం వచ్చినా ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా మహిళలు తమ ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవాలని చెప్పారు. ఆలస్యం చేసేకొద్దీ చిన్నది అనుకునే సమస్య చాలా పెద్దదైపోతుందని, అందువల్ల అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. మన శరీరంలోని ప్రతి ఒక్క అవయవమూ ఎంతో ముఖ్యమైనదేనని, అన్నింటి పనితీరు విషయంలో మనం సరైన అవగాహన కలిగి ఉండాలని వివరించారు. భర్త, పిల్లలు, లేదా తల్లిదండ్రులు పట్టించుకుంటారులే అని వదిలేయడం సరికాదని మహిళలకు సూచించారు. ముఖ్యంగా ఉద్యోగాలు, వ్యాపారాలు, రాజకీయాలు.. ఇలా ఏ రంగంలోనైనా దూసుకుపోతున్న మహిళలు తమ ఆరోగ్యాన్ని లెక్కచేయడం లేదన్నారు. తర్వాత మహిళల ఆరోగ్యం కోసం ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినందుకు డాక్టర్ కె. శిల్పిరెడ్డిని గవర్నర్ అభినందించారు. భవిష్యత్‌లోనూ ఇలాంటివి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అభిలాషించారు.

మహిళలను ఏకతాటిపైకి తీసుకురావడం, తమ ఆరోగ్యం గురించి నిపుణులను సంప్రదించే, ధైర్యంగా చర్చించే అవకాశాన్ని కల్పించడం ఉమెన్స్ హెల్త్ కాన్ క్లేవ్ లక్ష్యమని డాక్టర్ శిల్పిరెడ్డి అన్నారు. గర్భం, మెనోపాజ్, మానసిక ఆరోగ్యం, క్యాన్సర్ నివారణ లాంటి అనేక అంశాలపై నిపుణులు వివరించడంతో పాటు విభిన్న వర్గాల నుంచి హాజరైన మహిళలు ఆయా అంశాలపై చర్చించి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నట్లు తెలిపారు. అనంరతం ఈ కార్యక్రమానికి హాజరైన గవర్నర్ డాక్టర్ తమిళిసైకి డాక్టర్ వి.సుధీర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదస్సులో కిమ్స్ గ్రూప్స్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. భాస్కర్ రావు, కిమ్స్ ఆపరేషన్స్ హెడ్ అనిత, కిమ్స్ కడల్స్ ఆస్పత్రి నియోనాటాలజిస్టు, క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ సి. అపర్ణ, ఒయాసిస్ ఫెర్టిలిటీ సహ వ్యవస్థాపకురాలు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి.రావు, కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ డెర్మటాలజిస్టు డాక్టర్ జానకి, కిమ్స్ ఆస్పత్రుల గ్రూప్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



నవ తెలంగాణ -చైతన్యపురి

పేదలకు చేయూతనిచ్చేందుకు రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ సంస్థ చైర్మన్ పెద్ది శంకర్ గౌడ్ అన్నారు. నిలోఫర్ ఆసుపత్రి వద్ద ఆదివారం రోగులకు, రోగుల బంధువులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ద్వారా పదేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో ఉన్న రోగులకు, వారి బంధువులకు నిత్యాన్నదానం చేయాలని సంకల్పించినట్లు తెలిపారు. దాదాపు 500 మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు. డాక్టర్ మధురెడ్డి ఆర్థోపెటిక్స్ మాట్లాడుతూ నిలోఫర్ ఆసుపత్రికి వచ్చే వారికి ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఫుడ్ పంచడం చాలా సంతోషంగా ఉందన్నారు. డా. రాజేష్, సినీ హీరో విజయ భాస్కర్, జూనియర్ పవన్ కళ్యాణ్, సీఈఓ ఆఫ్ ట్యూషన్ పుసీన్ భాగ్యరాజ్, ప్రకాష్, శివ నేత, నితిన్ ప్రవీణ్ గుప్త, బీటీ నాయుడు, మోహంతు, నితిన్, లక్ష్మణ్ పీఆర్వో నరేంద్ర, మహేష్ పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం రూ. కోట్ల నిధులు మంజూరు చేయడంతో వాటిని వివిధ అభివృద్ధి పనుల కోసం ఎలా ఉపయోగించాలో మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రహీం, శేఖర్, కార్పొరేటర్లతో కలిసి మంత్రి ఆదివారం చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణ ప్రగతిలో భాగంగా సమీకృతా మార్కెట్, వైకుంఠ దామాల నిర్మాణం, స్వచ్ఛతకు చిరునామాలుగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు తీర్చిదిదేందుకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. రూ.1200కోట్లతో నాళాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో రూ.110కోట్లతో మహేశ్వరం నియోజకవర్గంలో పనులు జరుగుతున్నాయని చెప్పారు. తాగునీటి సమస్య లేకుండా రూ.210కోట్లతో మిషన్ భగీరథ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గుర్రంగూడ, కుర్మల్ గూడ, జిల్లెల గూడ, బడంగ్‌పేట్‌లలో రిజర్వాయర్ల పనులు జరుగుతున్నాయన్నారు. బడంగ్‌పేట్, మీర్‌పేట్, జల్‌పల్లిల పరిధిలోని 10 చెరువులలో రూ.40కోట్లలతో అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.12లక్షలతో సాయి బాలాజీ టౌన్ షిప్-2లో పైప్ లైన్ పనులకు, రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులకు, మరో రూ.15లక్షలతో ఎస్‌డబ్ల్యూ పైప్ లైన్, సీసీ రోడ్ల, అదేవిధంగా 3వ డివిజన్‌లో ఆర్ఎంఆర్ కాలనీలో రూ.64లక్షలతో నిర్మించే స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్ పనులకు, రూ.2కోట్లలతో 1, 2, 3, 20వ డివిజన్ల పరిధిలో అయ్యంగార్ బేకరీ నుండి అల్మాస్ గూడ వరకు బీటీ రోడ్డు పనులకు, 23, 28, 25, 24, 3, 2వ డివిజన్ల పరిధిలోని మారతీనగర్ నుండి అల్మాస్‌గూడ వరకు రూ.2 కోట్లలతో చేపట్టే బీటీ, సీసీ రోడ్డు పనులకు, 2వ డివిజన్‌లో రూ.30లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు, మరమ్మత్తు పనులకు, రూ.11లక్షలతో ఎస్ఎస్ఆర్ కాలనిలో బీటీ, సీసీ రోడ్డు పనులకు, రూ.2కోట్లా 50 లక్షలతో కోమటికుంట చెరువు సుందరీకరణ పనులకు, 4వ డివిజన్‌లో బీఆర్ఆర్ కాలనీలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు పనులకు, రామిడిహిల్స్‌లో రూ.10లక్షలతో సీసీ రోడ్డుకు, రూ.కోటీ 30లక్షలతో 4, 5, 26వ డివిజన్ల పరిధిలో సబ్ స్టేషన్ నుండి శ్రీహిల్స్ కాలనీ వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు, రూ.1 కోటి నిధులతో మాత గుడి నుండి స్వేచ్ఛ నివాస్ వరకు 4,5 డివిజన్ల పరిధిలో నిర్మించిన రోడ్డును, డివిజన్ నంబర్ 4 లో రూ.12 లక్షలతో వెంకటేశ్వర కాలనీలో చేపట్టిన పైప్ లైన్ పనులకు, సౌభాగ్య నగర్‌లో రూ.22 లక్షలతో ఎస్ డబ్ల్యూ పైప్ లైన్ పనులకు, మధుర పూరిలో రూ. 60 లక్షలతో వేసిన పైప్ లైన్ పనుల ప్రారంభం, డివిజన్ 4లో రూ. 2 కోట్లతో పోచమ్మ కుంట చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి అదృశ్యం..



నవతెలంగాణ-జవహర్‌నగర్

కుటుంబ కలహాలతో వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈసంఘటన జవహర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయి గూడలోని కొత్త భవానీనగర్ కాలనీలో ఆలకుంట్ల చంద్రయ్య కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. అతని కుమారుడు ఆలకుంట్ల శ్రీకాంత్ భార్య పూజ మధ్య తరచూ గొడవలు చోటుచేసుకునేవి. గతంలో కూడా శ్రీకాంత్ ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో భార్య పూజ పుట్టింటికి వెళ్ళగా, ఈ నెల 9న ఇంట్లో చెప్పకుండా శ్రీకాంత్ బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. దీంతో అతని ఆచూకి కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మల్లికార్జున గౌడ్ జన్మదిన వేడుక



నవతెలంగాణ-నేరేడ్ మెట్

బీజేపీ అల్వాల్ సర్కిల్ సీనియర్ నాయకుడు మల్లికార్జున గౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బీజేపీ నాయకులు, కార్యకర్తలు , శ్రేయోభిలాషుల ఆనందోత్సాహాల నడుమ కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ మల్కాజిగిరి నియోజకవర్గం కన్వీనర్ సదానంద గౌడ్, కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, సీనియర్ నాయకులు మల్లికార్జున్, దండగుల వెంకటేష్, శ్రీనివాస్, అజిత్ సాయి తదితరులు హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్ రెడ్డి, శ్రీశైలం, భాను, సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

దివ్యాంగులకు అత్యధిక పెన్షన్ అందిస్తున్న ప్రభుత్వం

- వచ్చే నెల గృహ లక్ష్మి పథకం ప్రారంభం
- బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

దేశంలోనే అత్యధిక పెన్షన్‌ను అందిస్తూ దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని మరింత పెంచిన గొప్ప మనసున్న మహారాజు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దివ్యాంగులకు మరో వెయ్యి రూపాయల పెన్షన్‌ను పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం జలవిహార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 4 వేల మంది వరకు దివ్యాంగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం దివ్యాంగులతో కలిసి బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో రూ. 500 ఉన్న పెన్షన్‌ను తెలంగాణ వచ్చిన తర్వాత రూ. 1500కు పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రెండోసారి అధికారం రూ. 3016కు పెంచారని, ఇప్పుడు మరో వెయ్యి రూపాయలను పెంచారని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో దివ్యాంగులకు అవసరమైన వాహనాలు, పరికరాలను సబ్సిడీ పై ఇచ్చేవారని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఉచితంగానే అందజేస్తున్నారని అన్నారు. ఇంకా మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు కావాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, దానం నాగేందర్, ముఠా గోపాల్, కార్పొరేషన్ చైర్మన్‌లు వాసుదేవ రెడ్డి, గజ్జెల నగేష్, నగర గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ప్రసన్న, బీసీ కమిషన్ సభ్యులు కిషోర్ గౌడ్, దివ్యాంగుల సంఘం ప్రతినిధులు యాదగిరి, బాస్కర్, దివ్యాంగుల ఇండియన్ క్రికెట్ కెప్టెన్ మహేష్, కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ నాయకులు లాస్య నందిత, మహేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లు నిర్మించుకోని వారికి గృహలక్ష్మి పథకం

అభివృద్ధిలో సనత్ నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి చేశామని, ఇంకా చేపట్టవలసిన అభివృద్ధి పనులు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే అవసరమైన చర్యలు చేపడతామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసం వద్ద బీఆర్ఎస్ సనత్ నగర్ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాల పాటు ఈ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహించి ముఖ్యమంత్రి, మంత్రిగా పని చేసిన వారు కూడా చేయని అభివద్దిని 9 సంవత్సరాలలో ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో చేసినట్టు వివరించారు. గతంలో నియోజకవర్గ పరిధిలో రోడ్లపై మురుగునీరు ప్రవహించి, అధ్వానంగా ఉండేదని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత లీకేజీ సమస్యలు అత్యధిక శాతం నివారించడం జరిగిందని, ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులను కూడా ఎంతో అభివద్ధి చేసినట్టు వివరించారు. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు మీ మీ ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. త్వరలోనే మున్సిపల్ వార్డు ఆఫీసులను ప్రారంభించడం జరుగుతుందని, జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ విభాగాల కు చెందిన సమస్యల పరిష్కారం కోసం ఎక్కడికో వెళ్ళాల్సిన అవసరం లేకుండా వార్డు ఆఫీసులోనే పిర్యాదు చేయవచ్చని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న అనేక దేవాలయాలకు నూతనంగా కమిటీలను



నియమించడం జరిగిందని, మిగిలిన దేవాలయలకు కూడా కమిటీల నియామకం త్వరలోనే జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకొనే వారి కోసం ప్రభుత్వం గృహలక్ష్మి పథకం వచ్చే నెలలో ప్రారంభించనున్నదని చెప్పారు. ఈ కార్యక్రమం కింద రూ. 3 లక్షల ఆర్థిక సహాయాన్ని ఇంటి నిర్మాణ పనులను బట్టి ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి, హేమలత, మహేశ్వరి, పీఎల్ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, అత్తిలి అరుణ గౌడ్, ఆకుల రూప, ఉప్పల తరుణి, డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఇనుప విద్యుత్ స్తంభం

- ఏదైనా ప్రమాదం జరిగితే గాని పట్టించుకోరా..?
- చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి



నవతెలంగాణ -నేరేడ్ మెట్

అల్వాల్ సర్కిల్ వెంకటాపురం డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. రోడ్డు సమీపంలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం త్రీఫేస్ లైన్ కరెంట్ సరఫరా జరుగుతుంది. అయితే ఈ ఇనుప స్తంభం కింద భాగం మొత్తం జంగు వచ్చి హోల్స్ పడ్డాయి. ఎప్పుడు విరిగి పడుతుందోనని ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తు న్నారు. అసలే వచ్చేది వర్షాకాలం. వర్షాకాలంలో ఇనుప స్తంభం షాక్ కొడుతుందని , ఇది ఎప్పుడు విరిగి పడిపోతుందోనని సమీప ఇంటి యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు చెప్పిన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే గాని, ఎవరైనా ప్రాణాలు పోతే గాని అధికారులు పట్టించుకోరా అని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఇనుప స్తంభం తొలగించి దాని స్థానంలో కొత్త సిమెంట్ విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి ,ఎటువంటి ప్రమాదం సంభవించకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రంథాలయాలు జ్ఞాన సంపదను అందించే కేంద్రాలు

- ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ కాలనీలో గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు ప్రతీ ఒక్కరికి జ్ఞాన సంపదను అందించే కేంద్రాలని అన్నారు. ఆధునిక కాలంలో పుస్తక పఠనం కొంత దూరమై విషయ పరిజ్ఞానం తగ్గుతుందన్న భావన ప్రజల్లో తలెత్తుతున్న నేపథ్యంలో ప్రతి కాలనీలో ఓ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి సమయం కేటాయించి ఓ గంట పుస్తక పఠనం చేయడం వల్ల సమాజ పరిజ్ఞానం, సామాజిక పరిస్థితుల పట్ల మనిషికి సంపూర్ణ అవగాహన వస్తుందన్నారు. ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ పైన అదనపు అంతస్తు నిర్మించి ప్రజలకు ఉపయోగపడే విధంగా కృషి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. గోకుల్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు టీ మల్కయ్య, ఉపాధ్యక్షులు శివరాం ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ శేరి రాజు, కోశాధికారి శేఖర్ రావు, కార్యవర్గ సభ్యులు వీఎస్ ఎం రెడ్డి, వీరబాబు, వెంకట్ రెడ్డి, విజయ్, వెంకటేష్, దేవకుమార్, తిరుపతి, శ్రీనివాస్, కాశీం, నాను నాయక్, లావణ్య, కిషన్ పాల్గొన్నారు.

నేడు తెలంగాణ రన్ విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలలో భాగంగా ఈనెల 12వ తేదీన(నేడు) నిర్వహించే తెలంగాణా రన్‌లో యువతీ యువ కులు ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. తెలంగాణ రన్ కార్యక్రమంపై జిల్లా అధికారులతో ఆదివారం కలెక్టరేట్‌లో అధికారులతో ముం దస్తు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రన్ కార్యక్రమాన్ని చెంగిచర్ల చౌరస్తా నుంచి డీ కేథలాన్ పీర్జాది గూడ గ్రౌండ్ వరకు ఉదయం 6.00 గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ రన్‌లో పట్టణంలోని యువత, కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ సంస్థల ప్రతినిధులు, పోలీసులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర అవతరణ స్ఫూర్తిని ప్రతిబిం బించేలా ఈ రన్‌లో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి మల్లా రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.



ఏఎస్ రావు నగర్ డివిజన్‌లోని జై జవాన్ నగర్ కాలనీ శ్రీ విజయ దుర్గ మల్లేశ్వర ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆషాఢ మాసం బోనాల పండుగ వైభవంగా జరుపుకునేం దుకు నిధులు మంజూరు చేయించగలరని వినతిపత్రం అందజేశారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేశారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రంగస్వామి, శ్రీహరి ,ఉపేందర్ రెడ్డి, పుల్లారెడ్డి , రామలింగేశ్వర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డలో 54 వ వారం జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

బి.జె.ఆర్ కాలనీ అధ్యక్షులు రహీం ఆధ్వర్యంలో ఆదివారం జ్ఞానమాల సందర్భంగా బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, సంఘ సభ్యులు దయానంద్ పూలమాలవేసి నివాళులు అర్పించారు, ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధి తాడూరి గగన్ కుమార్, నరసింహ చారి, శేఖర్, చారి, వెంకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేశాం

- కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి
- రాంగోపాల్ పేట్ డివిజన్‌లో పర్యటన



నవతెలంగాణ-బేగంపేట్

రాంగోపాల్ పేట్ డివిజన్ పరిధిలో రైల్వే సంబంధిత సమస్యలు ఉన్న ప్రాంతాలతో పాటు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ మేరకు రాంగోపాల్ పేట పరిధిలో ఉన్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే జీహెచ్ ఎంసీ అధికారుల సమన్వయంతో వాటి పరిష్కారానికి కషి చేయాలని తెలిపారు. రైల్వే ట్రాక్, రైల్వే బ్రిడ్జ్‌ల కింద ఉన్న సమస్యలకు సంబంధించి పనులను వేగవంతం చేశామన్నారు. స్థానికంగా ఉండే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైల్వే, మున్సిపల్ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో తన దృష్టికి తెచ్చిన పలు రైల్వే సంబంధిత సమస్యలను, జరుగుతున్న పనులను అధికారులతో కలిసి పరిశీలించామని, అధికారులకు దిశా నిర్దేశం చేశామని తెలిపారు. హైదరాబాద్ నగరం విశ్వ నగరంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసు కోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం కూడా కొన్ని కఠినమైన చట్టాలు తీసుకరావాలని కోరారు.ప్రభుత్వం కొత్త లేఅవుట్‌లు చేసేటప్పుడు పిల్లలకు ఆటస్థలాలు తప్పనిసరి ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. జంట నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయిన వేళ పచ్చదనం పరిశుభ్రత బాధ్యత ప్రభుత్వాలదే అని వదిలేయకుండా సామజిక బాధ్యతతో ప్రజలు వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీర సుచిత్ర శ్రీకాంత్, కొంతం దీపిక నరేష్, రైల్వే అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు, బీజేపీ స్థానిక నాయకులు ఆకుల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



స్టిల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ ఎలక్షన్స్ తెలుగు టెలివిజన్ అండ్ డిజిటల్ మీడియా టెక్నీషియన్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పర్యవేక్షణలో లీగల్ అడ్వైజరు, ఎలక్షన్ ఆఫీసర్ కె. వి. ఎల్. నరసింహారావుచే విజయవంతముగా, ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగినవి. 25 సంవత్సరాల నుండి ఏకగ్రీవంగా కె. వై. గిరిరాజ్ ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీ గా బి. కాంతారెడ్డి, కోశాధికారి గా ఇరిగి నర్సింగ్ రావు , వైస్ ప్రెసిడెంట్స్ గా నాగభూషణం, జగన్ మోహన్, జాయింట్ సెక్రటరీ ఉమేష్ గౌడ్, ఆర్గనైసింగ్ సెక్రటరీ సహదేవ్, 9 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కొత్తగా ఎన్నికయిన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు. నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫోన్ మాట్లాడొద్దన్నందుకు.. యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-జవహర్‌నగర్

ఫోన్ తరచుగా మాట్లాడొద్దన్నందుకు యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం జమ్మిగడ్డలోని శివసాయి నగర్ కాలనీలో అద్దె ఇంట్లో జరు మేనకా నాయక్, భర్త మున్నా నాయక్, కుమారుడు అనిల్(18)తో కలిసి నివసిస్తున్నారు. ఒరిస్సా రాష్ట్రం నుంచి ఉపాధి కోసం వచ్చి సెంట్రింగ్ పనులు చేసుకుంటూ మున్నానాయక్ జీవనం సాగించేవాడు. కొంత కాలంగా కుమారుడు అనిల్ ఫోన్‌లో తరచుగా మాట్లాడుతుంటే తల్లి మేనకానాయక్ వద్దని వారించింది. ఆదివారం తల్లిదండ్రులు పనుల కోసం వెళ్ళగా, అనిల్ ఇంట్లోనే ఉండి సీలింగ్ రాడ్డుకు నైలాన్ వైర్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి తల్లి తలుపులు తీయమని పలుమార్లు ఫోన్ చేసిన స్పందించలేదు. దాంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు తెరచి చూడగా అనిల్ అప్పటికే విగతజీవిగా కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ దవాఖానాకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ ప్రజా గర్జనకు తరలివెళ్లిన సీపీఐ నేతలు



నవతెలంగాణ-కాప్రా

ప్రజా సమస్యల పరిష్కారానికై సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభకు సీపీఐ ఉప్పల్ మండల సమితి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు మాట్లాడుతూ గత నెలలో చేపట్టిన ఇంటింటికీ సీపీఐ కార్యక్రమ ముగింపులో భాగంగా లక్ష మంది ఎర్ర దండుతో కొత్తగూడెంలో సభ జరిగినట్టు వారు తెలిపారు. ఓట్లు,సీట్లు ప్రామాణికం కాకుండా కేవలం ప్రజా సమస్యల పరిష్కారమే ధేయంగా సీపీఐ అహర్నిశలు ప్రజల పక్షాన రాజీలేని పోరు కొనసాగిస్తున్నదనిస్పష్టంచేశారు. ఈ సభకు వెళ్లిన వారిలో ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి జయచంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి పి. రామ్ నారాయణ, సీపీఐ ఘట్కేసర్ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, సీపీఐ కాప్రా పట్టణ కార్యదర్శి లక్ష్మీ నారాయణ, మండల కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి కష్ణ, భిక్షపతి, స్వామి దాస్,మిరియాల సాయిలు, నర్సింగ్ రావు, శివ,ఉష, నాగమణి, ఏఐఎస్ ఎఫ్ మండల అధ్యక్షుడు అజీమ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

దేశం అబ్బురపడేలా తెలంగాణలోనే సంక్షేమం

- మంత్రి చామకూర మల్లారెడ్డి
- జవహర్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-జవహర్‌నగర్

దేశం అబ్బురపడేలా తెలంగాణలోనే సంక్షేమ సంబురం జయకేతనం ఎగురవేస్తోందని, పోరాడి సాధించుకున్న తెలంగాణలో 9 ఏండ్లలోనే 100ఏండ్ల నాటి అభివృద్ధి కనిపిస్తోందంటే ఈ ఘనత సీఎం కేసీఆర్ దక్కుతుందని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. చిన్న రాష్ట్రం తెలంగాణ అభివృద్ధి చెందదు అనే మాటలను అనతి కాలంలో తుడిచివేసి... అభివృద్ధి అంటే తెలంగాణే అనే పదం దేశమంతటా వినిపిస్తుందంటే సీఎం కేసీఆర్ విజన్... కృషి, పట్టుదలే అభివృద్ధికి కారణమన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్ లోని 15, 28, 27, 25, 23, 24, 22, 28, 3, 19, 18, 16 డివిజన్లలో రూ. 9కోట్లతో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులకు మేయర్ మేకల కావ్యతో కలిసి ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశమంతా బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, సీఎం కేసీఆర్ తోనే దేశం బాగుపడుతుందని అన్నారు. తెలంగాణలో సబ్బండ వర్గాలు సంతోషంగా ఉన్నాయని, అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని చెప్పారు. జవహర్ నగర్‌కు ఇప్పటికే సుమారు రూ.120 కోట్ల వరకు అభివృద్ధి పనులు చేశామని, మంత్రి కేటీఆర్ మరో రూ. 30కోట్లు మంజూరు చేస్తామని చెప్పాడని తెలిపారు. కార్పొరేషన్‌లోని ప్రతీ డివిజన్ సుందరంగా ముస్తాబు కావాలని, సమస్యలు లేని జవహర్‌నగర్ తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. పేద ప్రజలు నివసించే జవహర్ నగర్ నా గుండెకాయ లాంటిదన్నారు. జవహర్‌నగర్‌లో గతంలో పాదయాత్ర చేసినప్పుడు సమస్యలను స్వయంగా చూసి చలించిపోయానని, ప్రతీ కాలనీకి డ్రయినేజీ, సీసీ రోడ్లు వేస్తానని మాట ఇచ్చాను.. ఇచ్చిన మాట ప్రకారమే అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నానని తెలిపారు. జవహర్ నగర్ పై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరే టర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ స్థానిక అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, ఉద్యమకారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాకు శంకుస్థాపన...

గత ప్రభుత్వాలలో సర్కారు దవాఖానాలకు వెళ్ళాలంటే... ప్రజలు నేను పోను బిడ్డానంటూ భయపడేవారని... రాష్ట్రం ఏర్పాటు తర్వాతనే వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతున్నదని మంత్రి అన్నారు. ప్రతీ పల్లెకు, పట్టణానికి వైద్యానికి దగ్గర చేసిన సీఎం కేసీఆర్ గొప్ప మనసున్న మహారాజు అన్నారు. జవహర్ నగర్ 5వ డివిజన్ కార్పొరేటర్ ఏకే మురుగేష్ ఆధ్వర్యంలో బస్తీ దవాఖానాకు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ మురుగేష్ మంత్రి మల్లారెడ్డికి కేరళ డోలు వాయిద్యాలు, డీజేలతో ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. బస్తీ దవాఖానాను ఏర్పాటు చేస్తున్నందుకు మంత్రికి కార్పొరేటర్, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు సత్వరమే పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు 5వ వార్డులోని సమస్యలు సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ హామీ ఇచ్చారు. శనివారం రాత్రి గాంధీ నగర్‌లో 12వ బస్తీ నిద్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 300 మంది స్థానికులు పాల్గొని వారి సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ బస్తీ సమస్యలు పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. బోర్డు ఎన్నికలు జరగకపోవడం, మరో వైపు కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు 5వ వార్డుకు చెందినప్పటికీ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఏ బస్తీలో చూసినా స్థానికులు అనేక సమస్యలు చెబుతున్నారని, ఐదో వార్డు సమస్యలను కూడా బోర్డు సీఈఓ దష్టికి తీసుకుపోతామని, తక్షణమే పరిష్కార దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు. స్థానికంగా నిర్మిస్తున్న శ్రీ నల్ల పోచమ్మ ఆలయ గోపురం కోసం ఆర్థిక సహాయం అందించాలని స్థానికులు క్రిశాంక్‌ను కోరగా క్రిశాంక్ తక్షణమే సొంత నిధుల నుంచి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం స్థానికులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గంటా రాజు, యాదగిరి, మల్లప్ప, భీమప్ప, గడ్డం రాజు, మోని, రఘు, సాయి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గణేష్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కంటోన్మెంట్

బీఆర్ఎస్ కంటోన్మెంట్ సీనియర్ నాయకులు, శ్రీ గణేష్ ఫౌండేషన్ చైర్మెన్ ఎన్ శ్రీ గణేష్ "సిక్ విలేజ్ శ్రీరామ్ నగర్‌లో గాంధీనగర్ డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు ఈ శిబిరంలో కేర్ ఆస్పత్రికి సంబంధించిన నిష్ణాతులైన వైద్యులు పాల్గొని కంటి, దంత, బీపీ, షుగర్, వినికిడి పరీక్షలను నిర్వహించారు. స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కాగా శిబిరం ఏర్పాటు చేసిన శ్రీ గణేష్ మాట్లాడుతూ పేద ప్రజలు అధికంగా ఉండే ఈ ప్రాం తంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించేందుకు తాను ఈ మెగా వైద శిబిరాన్ని నిర్వహించినట్టు చెప్పారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన చేస్తున్నామని తెలిపారు. కంటి అద్దాలు, ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్, శ్రీరామ్ నగర్ ప్రాంతాలలో ఎక్కువగా పేద ప్రజలు ఉన్నారని వారి కోసం కార్పొరేట్ ఆస్పత్రులలో పనిచేసే వైద్యులనే బస్తీలోకి రప్పించి పరీక్షలు చేయిస్తున్నానని తెలిపారు. అలాగే అవసరమైన వారికి మందులు ఇస్తున్నారని పేర్కొన్నారు.

గొల్ల రామవ్వ నాటి తెలంగాణ జీవన నాటక ప్రదర్శన

నవతెలంగాణ-కల్చరల్



తెలంగాణ ప్రాంతంలో సామాజిక పరిస్థితులు, ప్రజల జీవన గతులు 1947 సంవత్సరానికి ముందు ఎలా ఉండేవో వాస్తవాలకు దృశ్య రూపంలో గొల్ల రామవ్వ నాటకం ప్రదర్శితమైంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా భాష సాంస్కృతిక శాఖ నిర్వహణలో రవీంద్రభారతి ప్రధాన వేదికపై పూర్వ ప్రధాని పీ.వీ.నరసింహరావు రచించిన గొల్ల రామవ్వ కథను అజయ్ మంకెనపల్లి నాటకీకరించి దర్శకత్వంలో ప్రదర్శించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పరిపూర్ణంగా వాడుకుని రెండుగంటల పైగా సాగిన నాటకంలో పాత్రల ఎంపికలో దర్శకత్వ నైపుణ్యం ద్యోతకమైంది. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరి కృష్ణ నాటకం చూసి స్పందించి మాట్లాడుతూ తెలంగాణ జీవన చిత్రం మట్టి వాసనలు ఈ గొల్ల రామవ్వలో ఉన్నాయన్నారు. తెలంగాణ వచ్చిన తరువాతనే ఇక్కడి వారి ప్రతిభ వెలుగు చూస్తోందని అన్నారు.

15 రోజులలో రోడ్డు పనులు ప్రారంభిస్తాం : మంత్రి హామీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



మల్కాజిగిరి, సికింద్రాబాద్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశానికి సంబంధించి సభ్యులు క్లాసిక్ గార్డెన్స్‌లో కేంద్ర మంత్రులు ప్రల్హాద్ జోషి, కిషన్‌రెడ్డిలను కలిశారు. గత 10 సంవత్సరాల నుంచి రోడ్డు ప్రారంభించలేదని సంబంధిత మంత్రికి తెలిపారు. అయితే 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నర్సింగ్ రావు, కల్నల్ కృష్ణ (రిటైర్డ్), (మల్కాజిగిరి కాలనీల సంక్షేమ సంఘం ప్రతి:ధి) బీబీ ధనంజయ చారి, సీనియర్ నాయకుడు, జగన్, శ్రీనివాస్, బీసీ రాష్ట్ర కార్యవర్గం, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ, సుష్మిత, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

'దేశ సమాఖ్య నిర్మాణానికి తూట్లు పొడుస్తున్న బీజేపీ'

- ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్
- ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ ప్రదర్శన, నిరసన



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి రాజ్యాంగం కల్పించిన అధికారాలను లాక్కునేందుకు వినాశకరమైన ఆర్డినెన్స్‌లు తెచ్చి దేశ సమాఖ్య నిర్మాణానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మండిపడ్డారు. ఆర్టికల్ 239ఎఎ(3) (ఎ) పబ్లిక్ ఆర్డర్, పోలీసు, భూమి మినహా, ఢిల్లీ శాసన సభకు రాష్ట్రం, ఉమ్మడి జాబితాలోని విషయాలపై చట్టాలు చేసే అధికారం ఉంటుందని, దేశ రాజధానిలో సివిల్ సర్వెంట్లపై అధికారాన్ని ఢిల్లీ ప్రభుత్వానికి అప్పగిస్తూ మే 11న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తుంగలోతొక్కి, రాజ్యాంగ విరుద్ధ ఆర్డినెన్స్‌లను తెచ్చి మోడీ ప్రభుత్వం కఠోరమైన అధికార దుర్వినియోగం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఢిల్లీ ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెచ్చిన ఆర్డినెన్స్‌ను వెనక్కి తీసుకుని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట భారీ ప్రదర్శన, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ..కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశత్వానికి, అరాచకవాదానికి అడ్డు అదుపు లేకుండా పోతుందని, ప్రజల ప్రజాస్వామిక హక్కులను అణచివేస్తోందని ఆరోపించారు. సొంత రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడితే ప్రజాగ్రహం తప్పదని, ఢిల్లీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెచ్చిన రాజ్యాంగ విరుద్ధమైన ఆర్డినెన్స్ ను మోడీ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని లేకుంటే ఢిల్లీ ప్రజలకు అండగా ఉండి ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.ఈ నిరసన ప్రదర్శనలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డా.ఎస్.కె.ఆర్.అన్సారీ, ఎండి.మజీద్, డా.పుట్ట పాండు రంగయ్య, డా.సోలోమన్ రాజు, ఎన్.తిరుమలరావు, ప్రొఫెషనల్ కమిటీ కన్వీనర్ డా.జి.హరిచరణ్, నేతలు టి.రాకేష్ సింగ్, జావేద్ షరీఫ్, సలావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

దివ్యాంగులకు పెన్షన్ రూ.3000 నుండిరూ.4 వేలకు పెంచడం గొప్ప నిర్ణయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ బోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరా భిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగులకు మరింత ఆర్థిక భరోసా కల్పించారని కొనియాడారు. ప్రతి పక్ష పార్టీలు విమర్శలు చేయడం కాదు అభివృద్ధిలో పోటీ పడాలన్నారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకులు ముఠా జై సింహ, బోలక్ పూర్ డివిజన్ ఉపాధ్యక్షులు శంకర్ గౌడ్, మైనారిటీ విభాగం అధ్యక్షులు మక్బూల్, ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, డివిజన్ మాజీ అధ్య క్షులు సయ్యద్ అహ్మద్ భక్తేర్, సీనియర్ నాయకులు మీడియా ఇన్చార్జి ముచ్చపర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర ఆత్మగౌరవ భవనానికి ఎకరం స్థలం కేటాయింపు

ట్రస్ట్ చైర్మెన్ సత్యనారాయణ రాజు



నవతెలంగాణ-ముషీరాబాద్

వడ్డెరల ఆత్మగౌరవ భవన నిర్మణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉప్పల్ భగయాత్‌లో ఎకరం స్థలంతో పాటు భవన నిర్మాణా నికి రూ.1 కోటి నిధులు కేటాయించినట్టు వడ్డెర ఆత్మగౌరవ భవన్ ట్రస్టు చైర్మెన్ జెరిపేటి సత్యనారాయణ రాజు తెలి పారు. వడ్డెరల ఆత్మగౌరవ భవన నిర్మాణం, భవిష్యత్తు కార్యచరణ, ఆత్మగౌరవ భవనంలో ఎలాంటి వసతులను ఏర్పాటు చేసుకోవాలనే అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజ కవర్గాల వారీగా విస్తృత స్థాయి ముఖ్య నాయకుల సమావేశం డాక్టర్ ఓర్సు కృష్ణయ్య అధ్యక్షతన బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మెన్ సత్య నారాయణ రాజు మాట్లాడుతూ త్వరలో ఉప్పల్ భగయాత్‌లో నిర్మాణం కానున్న వడ్డెర ఆత్మగౌరవ భవనాన్ని 5 అంతస్తుల్లో నిర్మాణం చేయనున్నట్టు చెప్పారు. ఈ భవనంలో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు ప్రత్యేక వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. గ్రంథాలయం, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి విశ్రాంతి గదులు, ఫంక్షన్ హాల్ తదితర వస తులు ఉండేలా ప్లానింగ్ చేస్తున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ ఎత్తరి అంతయ్య, డైరెక్టర్లు డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, బండారు శ్రీరాములు, తన్నీరు వెంకటకృష్ణ, మక్కల పెంటేష్, ముద్దంగుల నరసింహ్మ, గుంజ సాయికృష్ణ, వరికుప్పల లింగయ్య, డి. అనంత రావు, ఎత్తరి మోహన్ కుమార్, వల్లెపు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

స్కూలుకు వేళాయరా!!!



తెలంగాణ ప్రభుత్వం నేటి నుండి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల పునః ప్రారంభానికి బడిగంటలు అధికారికంగా మోగిం చిన సందర్భంగా తల్లిదండ్రులకు అవసరమైన కొన్ని ముఖ్య సూచనలను గురించి చర్చిద్దాం. ఈ సూచ నలను పిల్లలతో పాటింపజేయడం ద్వారా వారిలో క్రమశిక్షణ, స్కూల్ పట్ల ఆసక్తి, విద్యాభ్యాసం పట్ల అనురక్తి కలిగి విద్యా సంవత్సరాన్ని పూర్తిగా ప్రయో జనకారిగా మార్చుకోగలమని ఆశిద్దాం.

1) సమయపాలన (టైం మేనేజ్మెంట్)

స్కూల్ షెడ్యూల్, టైం- టేబుల్‌కు అనుగుణంగా పిల్లలు నిద్రపోవడం, మేలుకోవడం జరిగితే ఉత్సాహంగా స్కూలుకు హాజరై అన్ని క్లాసులు శ్రద్ధగా వింటారు. సగం సక్సెస్ ఇక్కడే ఉంది. అది మరవద్దు. టీవీ, మొబైల్, ఐపాడ్, ట్యాబ్, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్‌ల వాడకం తల్లిదండ్రుల నియంత్రణలో ఉండటం ఎంతైనా అవసరం.

2) క్రమశిక్షణ (డిసిప్లెయిన్)

స్కూల్లో టీచర్ల పట్ల, తోటి విద్యార్థుల పట్ల, ప్రతి ఒక్కరి పట్ల గౌరవభావంతో విద్యార్థులు మెలగాలి అంటే ముం దుగా తల్లిదండ్రుల పట్ల గౌరవం, భయం, భక్తి ఉండటం అత్యంత ఆవశ్యకం. స్కూల్లో విరామ సమయాల్లో క్రమశిక్షణ పాటిం చాలి. తల్లిదండ్రులు పంపిన లంచ్‌ను పూర్తిగా తిని సకాలంలో తిరిగి పాఠ్యాంశాలను అభ్యసించడాకి సిద్ధమ వ్వాలి..ఇంటి వాతావరణంలో ఉపయోగించే భాషనే పిల్లలు నేర్చుకుంటారు, ప్రయోగిస్తారు. తల్లిదండ్రులు ఈ విషయంలో కొంత సమయమనం పాటించాలి..తస్మాత్ జాగ్రత్త !!! ముందు రోజు రాత్రి పిల్లలు తమ బ్యాగులను, లంచ్ బాక్స్‌లను.,వాటర్ బాటిల్స్‌ను ముఖ్యమైన పుస్తకాలను సిద్ధం చేసుకుని నిద్రకు ఉపక్రమించాలి. సమయం దొరికిన ప్పుడల్లా తల్లిదండ్రులు తమ పిల్లల బ్యాగులను పూర్తిగా పరిశీలించాలి. భవిష్యత్ పరిణామాలు తీవ్రంగా ఉండకుండా ఈ చిన్నవి పరిశీలన ఉపకరిస్తుంది.

3)క్రమం తప్పక అభ్యాసం (రెగ్యులర్ ప్రాక్టీస్)

స్కూల్లో బోధింపబడిన అన్ని సబ్జెక్టులకు పాఠ్యాంశాలలో ఇవ్వబడిన రైటింగ్ వర్క్‌ను, రీడింగ్ వర్క్‌ను క్రమం తప్ప కుండా ఇంటి వద్ద పిల్లలు అభ్యాసం చేసే విధంగా అలవాటు చేయాలి చదవడం, రాయడం ప్రతిరోజూ కొంతసేపైనా చేయాలి. ఎప్పటికప్పుడు ఖచ్చితంగా పూర్తి చేయటం పిల్లల బాధ్యత అని తెలియజేయాలి. ఈ విష యంలో స్కూల్ అథారిటీస్ సహకారం తప్పకుండా తీసుకోవడం ఆవశ్యం.

4) టీచర్లతో రెగ్యులర్ డిస్కషన్

ప్రతి చిన్న విషయాన్నీ పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను, వారి బలాలను, బలహీనతలను, చదువుకు సంబంధించిన విషయాలతో పాటుగా వారి మానసిక పరివర్తన గురించి, శారీరక మార్పులు గురించి నిర్మొహమాటంగా టీచర్లతో రెగ్యులర్‌గా డిస్కస్ చేసి వారి సహకారంతో పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దుకోవాలి. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చక్కటి అర్థవంతమైన సహకారంతో ఉన్నప్పుడే పిల్లలలో భయం,భక్తి కలిగి చదువు పట్ల ,సమాజం పట్ల క్రమ శిక్షణ అలవర్చుకోవటం సాధ్యమవుతుందని గుర్తించాలి.. ఉపాధ్యాయులకు , స్కూల్ యాజమాన్యాలకు పిల్లలను నియం త్రణలో ఉంచేందుకు అవసరమైతే పనిష్మెంట్ ఇచ్చేందుకు పూర్తి స్వేచ్ఛను తల్లిదండ్రులు కల్పించాలి.

5) మంచి అలవాట్లు- వ్యాపకాలు

మంచి పోషకాహారం, మితమైన శారీరక వ్యాయామం, ఆటలు- పాటలు మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయి. పిల్లలకు ఇష్టమైన వ్యాపకాలను ప్రోత్సహించాలి. పుస్తక పఠనం, జనరల్ నాలెడ్జ్, ఇన్ఫర్మేషన్ షేరింగ్, ఆలోచనల మార్పిడి పట్ల ఎంకరేజ్ చేయాలి. టీవీలు ,మొబైల్ ఫోన్ల నుండి వీలైనంత ఎక్కువగా పిల్లలను దూరంగా ఉంచాలి. ప్రకృతిని పరిశీలించడం, సమాజాన్ని అర్థం చేసుకోవడం, పెద్దల విలువ తెలియజేయడం, మానవ సంబంధాలు, నైతిక విలువలు, దేశ సభ్యత, సంస్కృతి గురించిన విషయాలు కథల రూపంలో పిల్లలు నేర్చుకునే వాతావరణం కల్పించగలిగి నప్పుడు విద్యార్థులను భావితరాలకు ఉత్తమ పౌరులుగా అందించినవారమవుతాం.

సయ్యద్ ఖాసీం అలీ, ప్రిన్సిపల్

శ్రీ చైతన్య టెక్నోస్కూల్, కర్మన్ ఘాట్
హైదరాబాద్- 9059022889

కళాకారులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

ఎడ్ల సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట



కవులకు కళాకారులకు రచయితలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని అంబర్‌పేట బీఆర్ ఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సాహిత్య దినోత్సవం కవి సమ్మేళనం కవితల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబర్పేట్ రోడ్‌నెం.6లో శ్రీరామ్ మంధీర్‌లో వాహిద్య కళాకా రులూ, సాహితి కళామనులకు, సంగీత కళాకారులకు, మైనారిటీ కళాకారులకు అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్‌రెడ్డి వారిని ఘనంగా శాలువా కప్పి పూలహారం వేసి ఘనంగా సత్కా రించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, మాజీ కార్పొరేటర్ పులి జగన్, యువ నాయకులు నాగేష్ గౌడ్ రాష్ట్ర మహిళా నాయకులు దేవి రెడ్డి విజత రెడ్డి ,ఉద్యమ నాయకులు జీవన్ గౌడ్,బీవీ రమణ,కోట్ల రాము, అనిల్ యాదవ్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి శ్రీకాంత్ ముదిరాజ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ చెందిన టీడీపీ సీనియర్ నాయకులు తలారి శ్రీకాంత్ ముదిరాజ్ టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియ మితులైన సందర్భంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుని కలిసి ఘనంగా సన్మానించారు. ఆదివారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ సారధ్యంలో తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వచ్చేలా అంకిత భావం తో పనిచేస్తానని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో "తమ పార్టీ అధినేత గతంలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని అన్నారు.

ముదిరాజు కులస్తుల సంక్షేమానికి కృషి

ముదిరాజ్ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మహేష్ ముదిరాజ్

నవతెలంగాణ-అంబర్‌పేట



ముదిరాజు కులస్తుల సంక్షేమానికి కృషి ప్రభుత్వపరంగా వ్యక్తిగతంగా నిరం తర కృషి చేస్తానని ముదిరాజ్ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మహేష్ ముదిరాజ్ తెలిపారు. ఆదివారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని తన కార్యాలయంలో ముదిరాజ్ కులస్తురాలికి కుల ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాలలో సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా ముందుండాలని, వారి అభివృద్ధికి ముదిరాజ్ సంక్షేమ సంఘం తరపున తోడ్పాటును అందిస్తామని, ప్రభుత్వపరంగా వారికి రావాల్సిన సంక్షేమ పథకాలని ఇప్పించే ప్రయత్నం చేస్తానని తెలియజేశారు.

రాజగోపాల్‌నాయుడుకు ఘనసన్మానం



నవతెలంగాణ-అంబర్‌పేట

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ సాహిత్య దినోత్సవ సందర్భంగా హైదరాబాద్ కలెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళన కార్యక్రమం సంజీవ రెడ్డినగర్‌లోని సీనియర్ సిటిజన్ కౌన్సిల్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో అంబర్‌పేటకు చెందిన ప్రముఖ కవి, రచయిత, వక్త, సంఘసంస్కర్త, అన్న ఫౌండేషన్ అధ్యక్షుడు కొడవలి రాజ గోపాల్ నాయుడు తన కవితను చదివి వినిపించారు. అనంతరం నవభారత్ నిర్మాణ్ జనరల్ సెక్రటరీ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కవి సమ్మేళనంలో భాను ప్రసాద్ డిస్టిక్ పబ్లిక్ రిలేషన్ అధికారి చేతుల మీదుగా రాజగోపాల్ నాయు డుకి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందించి మెమెంటోను బహుకరించి పారితోష కాన్ని ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన తెలుగు, హిందీ, ఉర్దూ కవులు పాల్గొన్నారు.

రహమత్ నగర్ డివిజన్‌లో బూత్ కమిటీ సమావేశం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



రహమత్‌నగర్ డివిజన్ బూత్ కమిటీ సమావేశాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ సిఎన్ రెడ్డితో కలిసి ఎస్‌పీఆర్‌హిల్స్ కమ్యూని టీహాల్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో రహమత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్‌కి ఎంతో బలమైన డివిజన్ అని, ఈ డివిజన్‌లో ఇతర పార్టీలకు నాయకుల కూడా లేరని అన్నారు. అదేవిధంగా ప్రతి బూత్ కు 40 ఇండ్లు కేటాయించుకొని వారికి ఉన్న సమస్యలను తీసుకొని కార్పొరేటర్‌కు, నాకు తెలియపరచాలని ఎవరైనా డబల్ బెడ్ రూమ్‌కు అర్హులైన వారు ఉన్న, దళిత బంధు, బీసీబంధుకు అర్హులైన అర్జీలు చేస్తుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరానగర్ ఫేస్ వన్ ప్రెసిడెంట్ అబ్దుల్‌సమద్, ఆర్.గాలి అన్న, ఫయాజ్ బీఆర్ఎస్ సీనియర్ లీడర్, వేముల యాదయ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంపు హర్షనీయం

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులకు ఇస్తున్న ఆసరా పింఛన్ పెంపు నిర్ణయం హర్షనీయమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఉద్యమకా రుడు ఆర్‌వీ మహేందర్‌కుమార్ అన్నారు. ఆదివారం కోఠిలోనీ బ్యాంక్ స్ట్రీట్ కార్యాలయంలో ఆయన మాట్లాడు తూ సీఎం కేసీఆర్ దివ్యాంగులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.3116కు అదనంగా వెయ్యి రూపాయలు కలిపి మొత్తంగా రూ.4,116 ఆసరా పింఛన్ అందించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల దివ్యాంగులంతా ముక్త కంఠంతో స్వాగతిస్తున్నామన్నారు.

మేరు సంఘం అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులుగా భాస్కర్



నవతెలంగాణ-అడిక్‌మెట్

తెలంగాణ రాష్ట్రం మేరు సంఘం అడిక్‌మెట్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మేరు సంఘం డివిజన్ అధ్యక్షులుగా భాస్కర్, కార్యదర్శులుగా కొత్తపల్లి రామును ఏకగ్రీవం ఎన్నుకున్నారు. అనంతరం నియామక పత్రాన్ని అందజేశారు. ఎన్నికల అధికారి మాణిక్ ప్రభు, పరిశీలకులు ఎం.శ్రీనివాస్, కాటారం దినేష్, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అడక్ కమిటీ సభ్యులు సంగేవారు, లక్ష్మీనారాయణ, టైలర్ శ్రీను హాజరయ్యారు

అజ్మీర్ దర్గా వద్ద త్వరలో తెలంగాణ భవన నిర్మాణం

- రాష్ట్ర హెూంశాఖ మంత్రి మహమూద్ అలీ

నవతెలంగాణ-ముషీరాబాద్



రాజస్థాన్‌లో ప్రసిద్ధిగాంచిన అజ్మీర్‌దర్గా వద్ద తెలంగాణ ప్రజల ఉపయోగార్థం మరో రెండు నెలల్లో తెలంగాణ భవన నిర్మాణ పనులు సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని రాష్ట్ర హెూంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల.హరిబాబు యాదవ్ ఆధ్వర్యంలో ఏక్ మినార్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాజస్థాన్ అజ్మీర్ "దర్గాకు చాదర్ సమర్పించే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహమూద్ అలీ, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే ముఠాగోపాల్ తో కలిసి చాదరను అజ్మీర్ దర్గాకు తంపించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం హెూంశాఖ మంత్రి మాట్లాడుతూ... గంగా జమున తహజీబ్ వలే తెలంగాణ ప్రజలు కలిసి మెలిసి జీవిస్తున్నాం అన్నారు. కాంగ్రెస్, బిజేపీ పార్టీ నేతలు ప్రజల్లో చిచ్చుపెట్టి ఎన్నికల్లో ఓట్లు దండుకు నేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆ రెండుపార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ ను మూడవసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎంపి బీబీ పాటిల్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్‌లో హిందూ ముస్లింలు ఐక్యంగా పండుగలను జరుపుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా అజ్మీర్ దర్గాకు చాదర్‌ను సమర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ సీని యర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్ రావు, యువజన విభా గం నగర నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ బిఆర్ఎస్ బోలక్ పూర్ వై శ్రీనివాసరావు, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ ప్రసాద్, వై శ్రీనివాసరావు. గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మెన్ శ్రీదరాచారి, డి.శివముదిరాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను తాను ఒక్కడే తెచ్చాననడం ఉద్యమ ద్రోహానికి నిదర్శనం

- మాజీమంత్రి విజయ రామారావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ



నవతెలంగాణ-అడిక్‌మెట్

అమరవీరుల త్యాగాలు, ఆత్మ బలిదానాలతో ఏర్పడిన తెలంగాణను తాను ఒక్కడే తెచ్చాననడం ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ ద్రోహానికి నిదర్శనమని మాజీ మంత్రి ఉద్యమ నాయకుడు విజయరామారావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై యావత్ ఉద్యమ నాయకుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యానగర్ బీసీ భవన్‌లో ఉద్యమ నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నాటి ఉద్యమ నాయకులు, విద్యార్థి, న్యాయవాద జేఏసీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ చరిత్రలో కేసీఆర్ పాత్ర నామ మాత్రమేనని, ఎంతోమంది అమరవీరుల త్యాగాలు రైతుల విద్యార్థుల పోరాటాలు ఆత్మార్పణలతో సకల జనుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణను తాను ఒక్కడే తెచ్చాను అనడం, తెలంగాణ చరిత్ర కూడా తాను ఒక్కడిదే అని చెప్పుకునే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2001 నుండి 2009 వరకు రాజకీయ ప్రక్రియ ద్వారానే తెలంగాణ అనే స్వప్రయోజక వైఖరిని అవలంబించి, తన రాజకీయ ఉన్నతికై ఉపయోగించుకున్నాడని దుయ్యబట్టారు. వేలాదిమంది త్యాగాల త్యాగాన్ని, కొండా లక్ష్మణ్ బాపూజీ,ప్రొఫెసర్ జయశంకర్ త్యాగాలను తన ఖాతాలో వేసు కొనే దుర్మార్గపు ఆలోచనలను యావత్ తెలంగాణ సమాజం వివిధ వర్గాలుగా ముక్తకంఠంతో ఖండిస్తున్నాయన్నారు. సిఎం తాను చేసిన అహంకారపు వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. 24న ఏర్పాటు చేసిన సమావేశాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశా రు.ఈ సమావేశంలో ప్రముఖ ఉద్యమకారులు మురళీధర్ దేశ్పాండే, కోలా జనార్ధన్, అడ్వకేట్ చేసిన నాయకులు శ్రీనివాస్ యాదవ్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, రామ్ రెడ్డి, జేఏసీ ఓయూ జై శివ శంకర్, మోడీ రాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించాలి



- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్ కృష్ణయ్య
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం

నవతెలంగాణ-అడిక్‌మెట్

పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ కుల గణన చేపట్టా లని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.ఈ దేశంలో కేంద్ర ప్రభుత్వాలు గత 75 సంవత్సరాలుగా బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదని, విద్యా ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో కనీస ప్రాతినిధ్యం లభించలేదన్నారు. పార్లమెంటులో బి.సి. బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని. బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లను రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. బీసీల న్యాయమైన డిమాండ్ త్వరలో పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. కేంద్రంలో ప్రత్యే క బీసీ మంత్రిత్వ శాఖ బీసీల బడ్జెట్ పెంచడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, డా. నంద కిశోర్, నీల వెంకటేష్, భూపేష్ సాగర్, నందగోపాల్, రామ కృష్ణ, సి. రాజేందర్, రాజ్ కుమార్, మోడీ రాందేవ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లాలి



అంబర్‌పేట :

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజలకు తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం అంబర్‌పేట నియోజకవర్గం మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్ లో వివిధ మోర్చాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో అంబర్ పేట నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడంలో మోర్చాలు ప్రముఖ పాత్రను పోషించబోతున్నాయని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య మంత్రి కిషన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో గెలుపు కోసం అన్ని మోర్చాలు త్వరితగతిన కమిటీలను పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధం కావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంబర్‌పేట అసెంబ్లీ కన్వీనర్ శ్యామ్‌రాజ్, గద్వాల జిల్లా ఇంచార్జ్ వెంకట్ రెడ్డి, ఓబీసీ రాష్ట్ర నేత ఆనంద్‌గౌడ్, కార్పోరేటర్లు అమృత, పద్మ వెంకట్ రెడ్డి, ఉమా రమేష్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

- క్యాబ్ డ్రైవర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా కార్డులు అందజేత
- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

కార్మికులకు అండగా ప్రభుత్వం ఉంటుందని వారికి అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ క్యాంపు క్యాబ్ డ్రైవర్లకు గుర్తింపుతో కూడిన రూ. 5 లక్షల ప్రమాద బీమా కార్డులను అం దజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్ పేట నియోజకవర్గంలో నివసించే డ్రైవర్ల అందరికీ ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేస్తూ రూ.5 లక్షల కవరేజీతో ఉచిత ప్రమాద బీమా ఆరు రకాల ప్రమా దాలకు వర్తి స్తుందని తెలిపారు. రోడ్డు యాక్సిడెంట్, నీటి ప్రమాదం, ఫైర్ ఆక్సిడెంట్, రైలు ప్రమాదం, పాము కాటు తేలుకాటు తది తర ప్రమాదాలకు వర్తిస్తుందన్నారు. అంబ ర్‌పేట నియోజకవర్గంలో నివసించే డ్రైవర్ల అందరూ విధి గా ప్రమాద బీమా కార్డులు పొందాలని, భవిష్యత్తులో డ్రైవ ర్ల సహజ మరణం పొందినా కూడా వర్తించే విధంగా లబ్ధి అందించాలని ముఖ్య మంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్టీయు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పోలే నిరంజన్ క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్ము వీరస్వామి క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్ పాలక మండలి కరు ణాకర్ నాయకులు, సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-అడిక్‌మెట్



స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్డు పక్కన ఫుట్ పాత్ పై జీవిస్తున్న అనాథలకు అభాగ్యులకు నిరాశకు 230 అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సభ్యులు అఖిల్, ఇర్ఫాన్, సుచిత్ర, చందన తదితరులు పాల్గొన్నారు.



బీసీ ఆత్మగౌరవ నినాదంతో ఆదివారం ఖైరతాబాద్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జస్టిస్ ఎం ఎస్.రావు, జస్టిస్ ఈశ్వరయ్య, జస్టిస్ చంద్రకుమార్, తీరు పుష్పనత్‌విల్సన్, సూరజ్ యాదవ్ మండల్, మురళి మనోహర్,దేవళ్ళ సమ్మయ్య, చౌదరివికాస్ పటేల్ (ఓబిసిమోర్చా) సతీష్ కొట్టె,రుంజాల శ్రీనివాస్ డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

యోగాలో మెడల్స్ సాధించిన చిన్నారులకు అభినందనాలు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



నవతెలంగాణ-దుండిగల్

షాపూర్ నగర్ కు చెందిన శివ శక్తి ధ్యాన యోగ కేంద్రం చిన్నారులు జాశ్విన్, సాహితీ, మానస లు తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కేపీ హెచ్బీ కాలనీలో జరిగిన యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధిం చారు. ఆదివారం ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షు లు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కలిశారు. ఈ సందర్బంగా జాశ్విన్‌కు గోల్డ్, సాహితి, మానసకు సిల్వర్ మెడల్స్ ను ఎమ్మెల్సీ అందజేసి అభినందించారు. భవిష్యత్‌లోనూ జాతీయ స్థాయిలో చక్కని ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. అదే విధంగా పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్సీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్లు మల్లేష్, విజయ్ కుమార్, సంపత్ గౌడ్, హరికృష్ణ, సింధు, సంతోష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మోగనున్న బడిగంటలు

- నేటి నుంచి పాఠశాలలు పున:ప్రారంభం
- హైదరాబాద్‌లో 2వేలకుపైగా స్కూళ్లు..7.50లక్షల మంది విద్యార్థులు
- అరకొరగానే పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ పంపిణీ!
- సమస్యల నడుమే విద్యా సంవత్సరం ఆరంభం..



నవతెలంగాణ-సిటీబ్యూరో

రెండు నెలల పాటు వెలవెలబోయిన పాఠశాలలు సోమవారం నుంచి విద్యార్థులతో కళకళలాడనున్నాయి. వేసవి సెలవుల్లో వివిధ ప్రాంతాల్లో గడిపిన విద్యార్థులు నేటి నుంచి మళ్లీ బడిబాట పట్టనున్నారు. అయితే ప్రభుత్వ బడుల్లో మరోసారి సమస్యల లోగిల్లుగానే దర్శనమివ్వనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఏడాది క్రితం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన మనబస్తీ-మన బడి పథకం ద్వారా ప్రభుత్వ బడుల్లో మౌలిక సౌకర్యాల అభివృద్ధి పనులు వివిధ కారణాలతో ఆశించిన స్థాయిలో పూర్తికాలేదు. ఫలితంగా సర్కారు స్కూళ్లలో మౌలికవసతులు వెక్కిరింత, పాత గోడలు, ఇరిగిన బల్లల నడుమే కొత్త విద్యాసంవత్సరంలో విద్యార్థులు చదువు కొనసాగించనున్నారు. మరోవైపు టీచర్ల కోరతతో మళ్లీ ఇబ్బందులు తప్పేలా లేవు. ఏటా విద్యార్థులకు సమస్యల సవాళ్లు విసరడమే తప్ప.. సజావుగా విద్యనేర్పే పరిస్థితి ఈసారి కూడా కనిపించడంలేదు. అంతిమంగా ఇది ప్రయివేటు పాఠశాలలకు మేలు చేయడంతో పాటు సర్కార్ బడులను నిర్లక్ష్యమే చేయడమే అవుతుందని ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

హైదరాబాద్ జిల్లాలో మొత్తం 2200వేలకుపైగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలలుండగా.. వీటిలో సుమారు 7.80లక్షలకుపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. 690 ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలకు 1.17 లక్షల మంది విద్యార్థులు, 245 ఎయిడెడ్ స్కూళ్లకు 36వేల మంది, 1222 ప్రయివేటు పాఠశాలలకు 6.59లక్షల మంది వెళ్తున్నారు. పదో తరగతి పరీక్షల్లో ఈ సంవత్సరం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలు 80.29శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తేనే.. సర్కార్ బడులు ఈ ఏడాది మరిన్ని ఉన్నతమైన ఫలితాలు సాధించే అవ కాశముందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.

ఈసారైనా ప్రమోషన్లు, బదిలీలు అయ్యేనా?


జిల్లాలోని సర్కార్ బడుల్లో ఉపాధ్యాయులు కొరత తీవ్రంగా ఉంది. టీచర్ల కొరత కారణంగా విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందడం లేదని విమర్శలున్నాయి. మరోవైపు జిల్లావ్యాప్తంగా వెయ్యికిపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ లున్నాయి. గతంలో ఈ ఖాళీల స్థానంలో విద్యావాలంటీర్లను నియమించుకుని కాలం వెళ్లదీసినా.. రెండేండ్లుగా వీవీల నియమాకంపై ఊసే లేదు. ఉన్నవారితో విద్యాసంవత్సరం నెట్టుకొస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇక గత జనవరిలో ప్రభుత్వం ఉపాధ్యాయులు ప్రమోషన్లు, బదిలీలంటూ కాస్త హడావుడి చేసినా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉంది. కనీసం ఈ విద్యాసంవ్సతరం ప్రారంభంలోనైనా ఉపాధ్యాయులు బదిలీలు, ప్రమోషన్లు ప్రక్రియ పూర్తి చేసి.. తద్వారా ఏర్పడే ఖాళీలను భర్తీ చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటే విద్యార్థులకు ఎంతో మేలు జరగనుంది.

స్కూల్ గ్రాంట్స్ ఎప్పుడో..?

జూన్ నెలలోనే పాఠశాలల గ్రాంట్స్ విడుదల చేయడం ద్వారా స్కూళ్లకు కావాల్సిన మరమ్మతులు చేసుకునే వీలుంటుంది. కానీ సకాలంలో గ్రాంట్స్ విడుదల కాక.. చిన్న చిన్న మరమ్మత్తులు జరగడం లేదు. అలాగే ఉపాధ్యాయులు కనీసం చాక్‌పీస్, డస్టర్, చోటామోటా మరమ్మతులు, రిజిష్టర్లు కొనుగోలు చేసేందుకు తమ సొంత డబ్బులను ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఆరంభంలోనే గ్రాంట్స్ విడుదల చేస్తే ప్రయోజనం ఉంటుందనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేసే స్కావెంజర్లు లేరు. తిరిగి స్కావెంజర్ల వ్యవస్థను పునరుద్ధరిస్తే బాగుంటుందని టీచర్లు, తల్లిదండ్రులు అంటున్నారు.

సగమే చేరిన పుస్తకాలు, ఏకరూప దుస్తులు

పదో తరగతి ఫలితాల్లో ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలుఏ ఫలితాలు సాధిస్తున్నాయి. దాంతో ఈ సంవత్సరం ప్రభుత్వ స్కూళ్లలో తమ పిల్లలను చదివిస్తే బావుంటుందనే నమ్మకం విద్యార్థుల తల్లిదండ్రుల్లో కొంత ఏర్పడింది. కానీ అందుకు తగ్గట్టుగా టీచర్ల నియమాకాలు, బడుల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తేనే పూర్తి నమ్మకం వస్తుంది. మనబస్తీ, మన బడి ద్వారా జిల్లా వ్యాప్తంగా మొదటి విడుతలో 159 స్కూళ్లకు గాను 17 స్కూళ్లలోనే అభివృద్ధి పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. మరో 14 ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపు స్తకాలు, నోట్ పుస్తకాలు పూర్థిస్థాయిలో అంద లేదని తెలుస్తోంది. మరోవైపు



సర్కారు స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం బోధన ప్రచారానికే పరిమితమైంది. ఇలాగైతే పేద, మధ్య తరగతికి చెందిన పేరెంట్స్ తమ పిల్లలను ప్రయివేట్ స్కూళ్లలో కాకుండా ప్రభుత్వ బడుల్లో ఎలా చేర్పిస్తారానే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మరోవైపు ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు భారీగా ఫీజు వసూళ్లకు రంగం సిద్ధం చేసుకున్నాయి. రకరకాల కోర్సులతో పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దగా చేసేందుకు కాచుకు కూర్చుకున్నాయి. కాబట్టి ప్రభుత్వం గురుకులాల మాదిరిగా సర్కారు విద్యను బలోపేతం చేస్తేనే అందరికీ మేలు జరగనుంది.

ప్రగతి నగర్‌లో స్ఫూర్తి మోడల్ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన స్ఫూర్తి మోడల్ స్కూల్ ను ఆదివారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ లక్ష్మీ కుమారీ, ఎస్ఎంసీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్ రెడ్డి, సుధీర్ రెడ్డి , నాయకులు స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయడం అభినందనీయం

- ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ
- సీఐ క్రాంతి కుమార్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

రక్తదానం మహా దానమని, రక్త దాతలు అభినందనీయులని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపుడి గాంధీ, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల ఆదేశాల మేరకు కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని శ్రీశ్రీశ్రీ వీరంజనేయ శివాలయం ప్రాంగణంలో గల కమ్యూనిటీ హాల్లో, చింతల్ లోని ఆర్.ఎన్.సి ఆస్పత్రి సౌజన్యంతో, ఆదివారం పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉచిత రక్తదాన శిబిరాన్ని అదే విధంగా ఉచిత వైద్య శిబిరాన్ని , ఆశ్రయ్, ఆకృతి స్వచ్ఛంద సంస్థ చెవి, వినికిడి పరీక్ష కేంద్రాలను వారు ప్రారంభించారు. అనంతరం రక్త దాతలకు ఆస్పత్రి నిర్వాహకులు సర్టిఫికెట్లను అందజేశారు. 18 సంవత్సరాలు నిండిన ఆరోగ్య వంతులందరూ డాక్టర్ల సలహా మేరకు ఏడాదిలో కనీసం రెండు నుంచి నాలుగు సార్లు రక్త దానం చేయడం మంచిదని వారు తెలిపారు. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరించి ప్రమాదంలో గాయపడ్డ వారికి అందించి వారికి తిరిగి జీవితాన్ని ప్రసాదించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస, ఆర్.ఎన్.సి ఆసుపత్రి ఛైర్మెన్ డాక్టర్ రమేష్ తో పాటుగా నాయకులు, భాస్కర్ రావు, పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, బస్తీ కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది, వాసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన పలువురు బీజేపీ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఆకర్షితులై కూకట్ పల్లి డివిజన్ కు చెందిన. బీజేపీ యువమోర్చా .కూకట్ పలి డివిజన్ ప్రధాన కార్యదర్శి బి. శ్రీధర్ తో పాటు.. పలువురు బీజేపీ కమిటీ సభ్యులు బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారని నాయకులు తెలిపారు. వారందరికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో, నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, ఎన్నో ఏండ్లుగా పరిష్కారం కాని సమస్యలు మాధవరం కృష్ణారావు చేసి చూపించారు.కళ్ళ ముందు కనిపిస్తున్న అభివృద్ధి చూసి మెచ్చుకోక తప్పలే దన్నారు. అంతేకాకుండా ఎన్నో సంక్షేమ పథకాలతో, నిరంత రం విద్యుత్ పంపిణీతో పరిశ్రమలు, పెట్టుబ డులతో హైదరాబాద్ మహానగరం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపారని అన్నారు. అందుకనే ముఖ్యమంత్రి కేసీఆ ర్.ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో పనిచేసేందుకు బీఆర్ఎస్ పార్టీలో చేరామని వారు తెలిపారు. కోఆర్డినేటర్ సతీష్. అరోరా, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు సంతోష్. ప్రభాకర్, పాల్గొన్నారు

హైదర్‌నగర్‌లో హిందూ స్మశాన వాటికను అభివృద్ధి పరచాలి



- సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం శంకర్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్‌నగర్ డివిజన్లోని హిందూ స్మశాన వాటికను అభివృద్ధి పరచాలని సీపీఎం కూకట్ పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదర్నగర్లోని హిందూ స్మశాన వాటికను సీపీఎం నాయకులు సందర్శించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని గతంలో పలుమార్లు స్థానిక ఎమ్మెల్యేకు, కార్పొరేటర్, జోనల్ కమిషనర్కు, ఎమ్మార్వోలకు వినతి పత్రాలను అందజేసిన సమస్య మాత్రం పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఇతర చోట్ల ఎలా అయితే అభివృద్ధి చేశారో అలానే ఇక్కడ కూడా హిందూస్ స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరారు. శ్రీనివాస్, అశోక్ యాదవ్, మహేష్ గౌడ్, రామకృష్ణ , మహేష్, వెంకటేష్ ,పాల్గొన్నారు.

పెద్ద కొడుకులా అండగా కేసీఆర్



- కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ముఖ్యమంత్రి కేసీఆర్ తాజా ప్రకటన పట్ల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని సుభాష్ నగర్ 130 డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులతో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ , మంత్రి కేటీఆర్ చిత్ర పటాలకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వికలాంగులకు రూ. 3116 పెన్షన్ను మరో వెయ్యి రూపాయలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. వచ్చే నెల నుంచే రూ. 4116 పెన్షన్ అందరికీ అందుతుంది అన్నారు. దివ్యాంగులు ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. సీఎం కేసీఆర్ తమ పాలిట దేవుడని, ఇటీవల కాలంలో కన్నబిడ్డలే చూసుకొని ఈ తరుణంలో నెల నెల పెన్షన్ ఇస్తూ వెయ్యి రూపాయలు పెంచి మాకు పెద్ద కొడుకులా అండగా నిలుస్తున్నారని వారు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ సంఘం సభ్యులు, పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే ధ్యేయం



నవతెలంగాణ-దుండిగల్

ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే ధ్యేయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు ఆదివారం శంభీపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్య లను పరిష్కరించాలని కోరారు. స్పందించిన కృష్ణ మాట్లాడుతూ సంబం ధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మీడియాకు క్షమాపణలు : కొంపల్లి మోహన్ రెడ్డి

నవతెలంగాణ- మేడ్చల్



మేడ్చల్ మండల మీడియా ప్రతినిధులకు బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్ రెడ్డి క్షమాపణలు తెలియజేశారు. ఆదివారం మేడ్చల్ పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మేడ్చల్ నియోజకవర్గ మహాజన్ సంపార్క్ అభియాన్ సంయుక్త మోర్చాల సమ్మేళనంలో భాగంగా బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్ రెడ్డి మాట్లాడుతూ పేపర్ వోడు 500మంది వరకు కార్యకర్తలు వస్తేనే మన న్యూస్ రాస్తారు లేకపోతే రాయరు అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల పై మేడ్చల్ మండల ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడు శివ కుమార్ ఫోన్ లో వారిని వివరణ కోరగా తాను కావాలని మీడియా ప్రతినిధులను కించ పరచలేదని అట్లా అంటే మీకు క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దుబ్బాక ఎమ్మెల్యే రఘు నందన్ రావు వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్య క్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ రూరల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షు డు కొండం ఆంజనేయులు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ దాస్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కృష్ణ ప్రియ మల్లారెడ్డి, మున్సిపల్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, రామన్న గారి శ్రీనివాస్ గౌడ్, కిషన్ రావు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-శామీర్ పేట



గ్రామీణ పాత్రల్లో పేదలకు మెరుగైన వైద్యం కోసం హెల్త్ క్యాంపులు దోహదపడుతుందని ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఏఆర్‌సీ హాస్పిటల్ ఎండి డాక్టర్. విఎస్ఎన్ రాజు అన్నారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో ఆదివారం ఏఆర్‌సీ హాస్పటల్ ఈసీఐఎల్ వారు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అనే నినాదంతో పేద ప్రజలకు సేవ చేస్తున్నట్టు పేర్కొన్నారు. అయితే ఈ శిబిరంలో సుమారు 150 మంది గ్రామస్తులకు ఆరోగ్య పరిక్షాలతోపాటు ఎముకలకు సంబంధించిన చెకప్‌లు చేశారు. అంతేగాక హాస్పిటల్ వారు గ్రామపంచాయతీకి ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కటికల వైద్యనాథ్ గ్రామ పెద్దలు మర్యాల వీరేశం గుప్తా, వై.చిత్తయ్య గౌడ్, సింగం నర్సింగ్ రావు, సింగం భాస్కర్, కారోబార్ నరసింహా పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే నేర్చుకోవాలి

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



శరీరం దారుఢ్యం పెంపొందించడంతో పాటు,ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరమని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ "బ్లూమింగ్ బడ్స్ కాన్వెంట్ స్కూల్ " లో శీను మాస్టర్ ఆధ్వర్యంలో కరాటే, కుంగ్ ఫూ జాతీయ పోటీలను మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలం లో బాలికలు మహిళలపై జరుగుతున్న దాడుల గురించి తెలిపారు. ఇలాంటి పరిస్థితులలో చిన్నప్పటి నుంచే బాలికలకు కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ నేర్పించాలని చెప్పారు. పిల్లలు కూడా చిన్నప్పటి నుంచే శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కేవలం చదువే కాకుండా విద్యార్థులను క్రీడల వైపు కూడా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. పిల్లలకు తమ ఆత్మ రక్షణ కోసం కరాటే లో శిక్షణ అందించిన మాస్టర్ శ్రీను అభినంది ంచారు. అందరికీ జీవితంలో కరాటే అనేది ముఖ్యమైనదని ప్రతి ఒక్కరికి అవసరమైన సమయంలో ఉపయోగ పడుతుందని, కొందరికి ఉపాధి కూడా కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టార్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు సాగర్ యాదవ్ మరణం పార్టీకి తీరనిలోటు

- ఎమ్మెల్యే కేపి వివేకానంద్
- కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గొల్ల విద్యాసాగర్ యాదవ్ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ అతని నివాసానికి వెళ్లి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద.. విద్యా సాగర్ కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఉద్యమ సమయంలో ధర్నాలు, రాస్తారోకోలలో చురుకుగా పాల్గొని.. బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీల పాత్ర పోషించిన సాగర్ యాదవ్ మరణం పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్ రెడ్డి, సుధీర్ రెడ్డి కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

యువమోర్చా డివిజన్ అధ్యక్షుడిగా దేవానంద్ ముదిరాజ్ నియామకం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రంగారెడ్డి డివిజన్ బీజేపీ యువమోర్చా అధ్యక్షులుగా దేవానంద్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం శివాజీ చౌక్ చౌరస్తాలో గల ఆ పార్టీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ నియామక పత్రాన్ని దేవానంద్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి మణికంఠ ,జిల్లా ఓబీసీ మోర్చా కార్యాలయ కార్యదర్శి మానే సంజీవ్ కుమార్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు గోపాల్, నారాయణ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు

శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సీఎంఆర్ హాస్పిటల్ కండ్లకోయ వారి సౌజన్యంతో వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ యాజమాన్యం సహకారంతో సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ లో ఆదివారం ఉ.9.30 నుండి మధ్యాహ్నం 2: 30 ని. వరకు నిర్వహించిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్స్ కంటి వైద్యా నిపుణులతో పాటు అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలు అందించారు. సి.ఎం.ఆర్ హాస్పిటల్ వారి బృందం డాక్టర్ పవన్ జనరల్ ఫిజీషియన్, డాక్టర్ అలేఖ్య డి.జి.ఓ , పి.ఆర్.ఓ.దుర్గాప్రసాద్ రెడ్డి , మార్కెటింగ్ మధు రాజా నారాయణ పాల్గొన్నారు. అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు, ఈ ఉచిత వైద్య సేవలు పొందినట్టు నిర్వాహకులు తెలిపారు. అనంతరం వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్య ంలో పారిశ్రామిక వాడలోని అన్ని వర్గాల వారికి కార్పొరేట్ వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ కరస్పాండెంట్ సునీత , శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు గురజాడ రంగారావు , బుల్లితెర నటుడు ఆదూరి దుర్గ నాగ మోహన్ ,కామోల్కర్ అనిరుద్ శర్మ , సూర్యనారాయణ శర్మ , మారుతి శర్మ , భార్గవ్ శర్మ స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సారెడ్డి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-దుండిగల్



టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి అన్ని ప్రాంతాల ప్రజలు, ఇతర ప్రాంతాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చి తమ అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలప డానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ అభిమాన నాయకుడికి గజమాలలు వేసి, భారీ కేక్, కట్ చేయించి, పూల దండాలు శాలువాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్, మెదక్ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు జి.మధుసూదన్ రెడ్డి, ఫిషర్మాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు మెట్టు సాయి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆవుల రాజి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ 4,999కే అమెజాన్ కొత్త స్మార్ట్ స్పీకర్



నవతెలంగాణ-హైదరాబాద్ : అమెజాన్ స్మార్ట్ స్పీకర్ల ఎకో ఫ్యామిలీకి సరికొత్త జోడింపుగా రూ. 4,999 వద్ద ఎకో పాప్ ను విడుదల చేసింది. ఇది పూర్తిగా కొత్త సెమీ- స్పియర్ ఫార్మ్ ఫ్యాక్టర్ కలిగి ఉండటంతో పాటుగా తెలుపు మరియు నలుపుతో పాటు, ఆకుపచ్చ మరియు ఊదా వంటి కొత్త రంగులలో అందుబాటులో ఉంది - ఇది ఏ ఇంటి సౌందర్యాన్ని అయినా పెంచుతుంది. యొక్క కస్టమ్-డిజైన్ చేయబడిన ఫ్రంట్ ఫేసింగ్ డైరెక్షనల్ స్పీకర్ పెద్దగా సౌండ్, సమతుల్యమైన బాస్ మరియు స్పష్టమైన గాత్రాన్ని అందిస్తుంది - ఇది బెడ్రూమ్, లివింగ్ రూమ్, పిల్లల గది లేదా మీరు ఇష్టపడే ఏదైనా ఇతర ప్రదేశానికి సరైన స్మార్ట్ స్పీకర్గా నిలుస్తుంది. సంగీతం ప్లే చేయడా నికి, క్రికెట్ స్కోర్లను ట్రాక్ చేయడానికి, స్మార్ట్ లైట్లు మరియు ప్లగ్‌ను నియం త్రించడానికి, అలారాలు, రిమైండర్లను సెట్ చేయమని వినియోగదారులు ఆంగ్లం, హిందీ మరియు హింగ్లీష్‌లో అలెకసా ని అడగవచ్చు.




నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ లో నూతనంగా ఏర్పాటు అయిన రేమండ్స్ పి.ఎం ఫ్యాబ్రిక్స్ షోరూం ను ప్రారంభించిన డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ .ఈ సందర్భంగా నిర్వహకులు రవి కుమార్, మురళి లకు అభినందనలు , శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు హరి బాబు, ఉంగరాల శ్రీనివాస్,శివ, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

రెడ్ డాట్ సేల్ ప్రారంభించిన సోచ్

నవతెలంగాణ-హైదరాబాద్ : భారతదేశంలో అత్యుత్తమ షాపింగ్ అను భవాలలో లీనమవండి. భారత దేశంలో అతిపెద్ద అకేషన్, ఈవెనింగ్ వేర్ బ్రాండ్ సోచ్ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెడ్ డాట్సేల్ ప్రారంభించింది. జూన్ 8 నుం చి సోచ్ స్టోర్ల వద్ద ఆన్లైన్లో ఈ అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఈ సేల్లో భాగ 0గా ఆకర్షణీయమైన రీతిలో 50శాతం వరకూ రాయితీని విస్తృతశ్రేణిలో చీరలు, స ల్వార్ సూట్లు, కుర్తీలు, టునిక్స్, డ్రెస్ మెటీరియల్స్పై పొందవచ్చు. వేసవి సీజన్ లో సోచ్ తేలికపాటి, శ్వాసించతగిన దుస్తులపై కూడా సోచ్ రెడ్ డాట్ సేల్ ఇప్పుడు ప్రత్యే కమైన రాయితీలను అందిస్తుంది. కాటన్ నుంచి కాటన్ సిల్క్, సిల్ బ్లెండ్, జార్జెట్స్ వ రకూ సోచ్, వేసవి స్ఫూర్తిదాయకమైన రంగులతో సీజన్ స్ఫూర్తి ప్రదర్శిస్తుంది. వి స్తృతశ్రేణి ఉత్పత్తులపై ప్రత్యేకమైన రాయితీలను అందించడంతో పాటుగా ఈ వె "సవిని మరింత అందంగా, ప్రత్యేకంగా మలుచుకునేందుకు అనువుగా అద్భుతమైన డీల్స్ను అందిస్తుంది. మీరిప్పుడు అత్యుత్తమ ఎథ్నిక్వేర్ అద్భుతమైన ఆఫర్లు, ధరల వల్ల పొందవచ్చని ఆసంస్థ పేర్కొంది.

నవచిత్రం


సుడిగాలి సుధీర్

సరికొత్త సుధీర్‌ని చూస్తారు

సుడిగాలి సుధీర్ కథానాయకుడిగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'కాలింగ్ సహస్ర'. షాడో మీడియా ప్రొడక్షన్స్, రాధా ఆర్ట్స్ పతాకాలపై అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కటూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సుధీర్ సరసన డాలిశ్య హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం నుంచి ఇటీవల 'కలయా నిజమా..' అనే లిరికల్ సాంగ్‌ను సినీ పాత్రికేయుల చేతుల మీదుగా రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ మోహిత్ రెహమానిక్ మాట్లాడుతూ, 'మా సినిమాలో 'కలయా నిజమా..' అనే మెలోడీ సాంగ్ పాడిన చిత్రకి థ్యాంక్స్. అందరికీ సినిమా నచ్చుతుందని భావిస్తున్నాను" అన్నారు. 'నిర్మాతలుగా 'కాలింగ్ సహస్ర' మా తొలి అడుగు. మాకు ఇదొక స్వీట్ మెమొరీ. మోహిత్ అద్భుతమైన ట్యూన్ ఇవ్వగా, లిరిసిస్ట్ లక్ష్మీ ప్రియాంక అద్భుతమైన లిరిక్స్‌ను అందించారు' అని నిర్మాత వెంకటేశ్వర్లు కటూరి చెప్పారు. నటుడు శివ బాలాజీ మాట్లాడుతూ, "కథలోని ట్విస్టులు, టర్నులు ఆద్యంతం ఆసక్తికరంగా ఉన్నాయి. ఫస్ట్ సీన్ నుంచి ఈ సినిమా ఎంగేజింగ్ చేస్తుంది. ఈ మూవీ నటుడుగా సుధీర్‌లోని కొత్త షేడ్‌ను చూపిస్తుంది' అని తెలిపారు. దర్శకుడు అరుణ్ విక్కిరాలా మాట్లాడుతూ, "కలయా నిజమా' పాటకు మోహిత్ ట్యూన్ వినగానే నచ్చింది. చిత్ర పాడిన తర్వాత ఆ పాటకు మరింత అందం వచ్చింది. సుధీర్ కంప్లీట్ డిఫరెంట్‌గా కనిపిస్తారు' అని అన్నారు. హీరో సుధీర్ మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు నేను చేసిన సినిమాలకు భిన్నంగా డిఫరెంట్ జోనర్‌లో చేసిన సినిమా ఇది. శివ బాలాజీ మంచి సపోర్ట్ అందించారు. నన్ను నమ్మి ఈ సినిమా చేస్తున్న దర్శక, నిర్మాతలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు' అని చెప్పారు.


ఐశ్వర్య మీనన్, నిఖిల్



ఘనంగా వీరసింహారెడ్డి 100 రోజులు వేడుక

నందమూరి బాలకృష్ణ 107వ చిత్రం 'వీర సింహారెడ్డి' ప్రేక్షకుల విశేష ఆదరణతో 100 రోజులు పూర్తి చేసుకుంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచి బయ్యర్లందరికీ భారీ లాభాలను అందించింది. బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా 'వీర సింహారెడ్డి' 100 రోజుల వేడుకను మేకర్స్ ఘనంగా జరిపారు. చిత్రయూనిట్‌తోపాటు డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ కూడా ఈ చిత్ర శతదినోత్సవ షీల్డ్‌లను అందించారు.

ఈ వేడుకలో దర్శకులు అనిల్ రావిపూడి, బాబీ, హరీష్ శంకర్, శివ నిర్వాణ, బుచ్చిబాబు, నిర్మాతలు నాగ వంశీ, సాహు గారపాటి, హరీష్ పెద్ది తదితరులు హాజరై, అరుదైన శతదినోత్సవ వేడుక అని కొనియాడారు.

రామాయణం అంతరార్థం తెలిపే సినిమా

సౌద అరుణ స్టూడియోస్ పతాకంపై పాపులర్ రైటర్ సౌద అరుణ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కోడ్ రామాయణ'.. ఈ చిత్ర టైటిల్ అనౌన్స్‌మెంట్ ఫిలిం ఛాంబర్‌లో గ్రాండ్‌గా జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా వచ్చిన బౌద్ధ భిక్షువు బంతె షీల్ రక్షిత్, ప్రముఖ రచయిత్రి లలిత.పి. చేతుల మీదుగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేశారు.



ఈ సందర్భంగా భరద్వాజ మాట్లాడుతూ, 'రామాయణాన్ని 'పూర్వ రామాయణం', 'రావణచరిత్ర', 'ఉత్తర రామాయణం'.. ఇలా మూడు భాగాలు ఇందులో చెప్పాం. 'కోడ్ రామాయణ' అంటే రామాయణ అంతరార్థం అని అర్థం. అలాగే రామాయణంలో ఏం చెప్పడం కోసం రామాయణం వచ్చింది అనేది ముఖ్య ఉద్దేశ్యం' అని తెలిపారు. చిత్ర దర్శకులు సౌద అరుణ మాట్లాడుతూ,'అప్పుడు, ఇప్పుడు సంగీత సాహిత్యాలతో వర్ధిల్లిన గడ్డే ద్రవిడ భూమి. ఈ గడ్డపై పుట్టిన మేం జై శ్రీ రావణ అని స్మరించుకోవడం చాలా సంతోషంగా ఉంది. ద్రవిడ భూమి ఆత్మ గౌరవం అనే నినాదంతో ద్రవిడ భూమి గొప్ప తనాన్ని ప్రపంచం మరింత అర్థం చేసుకోవడానికే ఈ సినిమా చేస్తున్నామే తప్ప ఎవరినీ వ్యతిరేకించడానికి ఈ సినిమా తీయడంలేదు. ఈ మూడు భాగాల .ప్రాజెక్టు చేయడం ఒక దశాబ్ద కాలం పట్టే యజ్ఞం. ఇప్పటి వరకు మేము మూడవ వంతు పని మాత్రమే చేశాం' అని తెలిపారు.

హల్‌చల్ చేస్తున్న జూమ్.. జూమ్.. సాంగ్

నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా గ్యారీ పిహెచ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'స్పై'. ఈడి ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై కె రాజశేఖర్ రెడ్డి నిర్మాతగా సుభాష్ చంద్రబోస్ సీక్రెట్ స్టోరీ, డెత్ మిస్టరీ ఆధారంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా నుంచి మొదటి పాట విడుదలైంది. 'జూమ్ జూమ్' అంటూ సాగే ఈ పాట నిఖిల్, ఐశ్వర్య మీనన్ మధ్య వచ్చే లవ్ రొమాంటిక్ సాంగ్. అనురాగ్ కులకర్ణి, రమ్య బేహారా పాడిన ఈ పాటకు కిట్టు విస్సప్రగడ సాహిత్యం అందించారు. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు సంగీత దర్శకులుగా పనిచేస్తున్నారు. అలాగే శ్రీ చరణ్ పాకాల కూడా ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. 'తూటాలే పేలుస్తుంటే నీ చిరు నగవే, అందాల గాయం తగిలే నా ఎదకే..' వంటి లిరిక్స్ చాలా అద్భుతంగా ఉన్నాయి. క్యాచీ పదాలతో సాగే ఈ మెలోడీ సాంగ్ శ్రోతల మనసు దోచేసింది. ప్రస్తుతం ఈ పాట కుర్రకారు గుండెలను మీటుతూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. భారత దేశ అత్యుత్తమమైన రహస్య కథను చరిత్రలో నిలిచిపోయే స్పై థ్రిల్లర్ చిత్రంగా దీన్ని రూపొందిస్తున్నారు.

ఈ చిత్రం పాన్ ఇండియా రేంజ్‌లో తెలుగు, హిందీ, తమిళ్, మళయాళం, కన్నడ భాషల్లో ఈనెల 29న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు రెడీ అవుతోంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఆర్యన్ రాజేష్, సన్యా ఠాకూర్, అభినవ్ గోమటం, మకరంద్ దేశ్‌పాండే, జిషు సేన్ గుప్తా, నితిన్ మెహతా, రవివర్మ కృష్ణ తేజ, ప్రిషా సింగ్, సోనియా నరేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకత్వం -ఎడిటింగ్ : గ్యారీ బీఎచ్, కథ -నిర్మాత: కె. రాజశేఖర్ రెడ్డి, సీఈఓ: చరణ్ తేజ్ ఉప్పలపాటి, డీఓపీ: వంశీ పచ్చి పులుసు, మార్క్ డేవిడ్, అదనపు సినిమాటోగ్రఫీ: జూలియన్ అమర్ ఎస్ట్రాడా, కైకో నకహరా, సంగీతం : శ్రీచరణ్ పాకాల, విశాల్ చంద్రశేఖర్, ఆర్ట్ : అర్జున్ సూరిశెట్టి.

మెప్పించే సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్

సాహస్, దీపిక నటించిన సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ '7:11 పీఎమ్'. ఈ చిత్ర ఫస్ట్ లుక్, ఫస్ట్ సింగిల్ తర్వాత విడుదలైన టీజర్‌తో అందరిలో ఈ సినిమాపై క్యూరియాసిటీ పెంచింది.

చైతు మాదాల ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆర్యన్ ఫిల్మ్స్ పతాకంపై నరేన్ యనమదల, మాధురి రావిపాటి, వాణి కన్నెగంటి నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది.


సాహస్, దీపిక

ఆదివారం ఈ సినిమా విడుదల తేదీని నిర్మాతలు అనౌన్స్ చేశారు. మైత్రి ద్వారా ఈనెల 30న విడుదల చేస్తున్నామని, ప్రముఖ ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ హౌస్ తమ చిత్రానికి సపోర్ట్ ఇవ్వడంతో సినిమాని భారీగా విడుదల చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు. 'ఇదొక హైలీ స్క్రీన్‌ప్లేతో నడిచే కమర్షియల్ చిత్రం. 1999లో ఒక ముఖ్యమైన రోజున, భవిష్యత్తులో 400 సంవత్సరాలలో వేరే గ్రహం నుండి మానవుల మనుగడకు కీలకమైన సమాధానాల కోసం 'హంసలదీవి' అనే చిన్న ఇండియన్ టౌన్‌కి చేరుకుంటారు. అదే రోజున ఆ టౌన్ ని నాశనం చేయడానికి కొన్ని సంఘటనలు జరుగుతాయి. ఇవన్నీ ఫాస్ట్ పేస్డ్ థ్రిల్లర్‌గా సీట్ ఎడ్జ్ అనుభూతిని పంచుతాయి' అని చిత్ర బృందం తెలిపింది.

వేటాడతా షూటింగ్ షురూ..

అంకయ్య ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై అనిత మూవీస్ సమర్పణలో అరుణ్, సృజనలను హీరో, హీరోయిన్లుగా పరిచయం చేస్తూ రూపొందుతున్న చిత్రం 'వేటాడతా'. సురేష్ రెడ్డి దర్శకత్వంలో అంకయ్య ఎమ్ నిర్మిస్తున్న ఈ చిత్ర ప్రారంభోత్సవం ఆదివారం ప్రసాద్ ల్యాబ్స్‌లో గ్రాండ్‌గా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నిర్మాత రామసత్య నారాయణ తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించగా, సాయి వెంకట్ క్లాప్ కొట్టారు. వైజాగ్ మాజీ మేయర్ దాడి సత్యనారాయణ కెమెరా స్విచాన్ చేశారు. నాగులపల్లి పద్మిని స్క్రిప్ట్ అందించారు.



సృజన, అరుణ్

ఈ సందర్భంగా నిర్మాత అంకయ్య ఎమ్ మాట్లాడుతూ, 'మా బ్యానర్‌లో మా అబ్బాయి అరుణ్‌ని హీరోగా పరిచయం చేస్తూ నిర్మిస్తున్న నాలుగో చిత్రమిది. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై సినిమా ఉంటుంది. ఇందులో నేను టైటిల్ రోల్ చేస్తున్నా' అని అన్నారు. "బరి' సినిమా దర్శకుడుగా నాకు మంచి పేరు తెచ్చింది. ఇది నా రెండో సినిమా. సస్పెన్స్, మర్డర్ మిస్టరీతో రూపొందుతున్న చిత్రమిది. ఈ నెలాఖరులో షెడ్యూల్ ప్రారంభించనున్నాం. అరకు, నంద్యాల, హైదరాబాద్ ప్రాంతాల్లో షూటింగ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని దర్శకుడు సురేష్ రెడ్డి చెప్పారు. హీరోగా నటిస్తున్న నా తొలి సినిమా ఇది. మా నాన్న మంచి కథ సిద్ధం చేశారు. డైరెక్టర్ సురేష్ రెడ్డి మంచి ప్లానింగ్‌తో షూటింగ్ ప్లాన్ చేస్తున్నారు' అని హీరో అరుణ్ చెప్పారు.

ఆటలు

ఐసీసీ టైటిళ్ల వేటలో టీమ్ ఇండియా దశాబ్ది నిరీక్షణ కొనసాగుతుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్ వరుసగా రెండోసారి నిరాశపరిచింది. 444 పరుగుల ఛేదనలో 234 పరుగులకే కుప్పకూలిన రోహిత్‌సేన.. గద వేటలో అభిమానులకు వ్యధ మిగిల్చింది!. 209 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది.

స్లో ఓవర్ రేట్ జరిమానాతో రెండేండ్ల క్రితం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో చోటు కోల్పోయిన ఆస్ట్రేలియా.. ఇప్పుడు ప్రతీకారం తీర్చుకుంది. అనుకూల పరిస్థితుల్లో అందరూ రాణించగా ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌గా అవతరించింది. 1987, 1999, 2003, 2007, 2015 వన్డే వరల్డ్‌కప్.. 2006, 2009 ఛాంపియన్స్ ట్రోఫీలు సహా 2021 టీ20 ప్రపంచకప్ నెగ్గిన ఆస్ట్రేలియా తాజాగా 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌తో మెన్స్ క్రికెట్‌లో పరిపూర్ణ జట్టుగా నిలిచింది. ఐసీసీ నాలుగు టోర్నీల్లో విజేతగా నిలిచిన ఏకైక జట్టుగా ఆస్ట్రేలియా రికార్డు సృష్టించింది.


ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ గదతో ఆసీస్ క్రికెటర్ల విజయోత్సాహం

గద వాళ్లకు.. వ్యధ మనకు!

- ప్రపంచ టెస్టు ఛాంపియన్‌గా ఆస్ట్రేలియా
- ఐసీసీ గద కంగారూల సొంతం
- 444 ఛేదనలో భారత్ 234/10

రెండోసారి భారత్‌కు భంగపాటు

నవతెలంగాణ-కెన్నింగ్టన్

ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్ ఆస్ట్రేలియా. ది ఓవల్‌లో జరిగిన ప్రపంచ టెస్టు మహా సంగ్రామంలో భారత్‌పై 209 పరుగుల తేడాతో గెలుపొందిన ఆస్ట్రేలియా.. 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ గదను సొంతం చేసుకుంది. 444 పరుగుల ఛేదనలో భారత్ 234 పరుగులకే కుప్పకూలింది. విరాట్ కోహ్లి (49, 78 బంతుల్లో 7 ఫోర్లు), అజింక్య రహానె (46, 108 బంతుల్లో 7 ఫోర్లు)లు చివరి రోజు భారత్ ఆశలను సజీవంగా నిలిపినా.. ఆట మొదలైన కొద్దిసేపటికే ఆశలూ ఆవిరయ్యాయి!. 63.3 ఓవర్లలోనే భారత్ 234 పరుగులకు చేతులెత్తేసింది. కంగారూ స్పిన్నర్ నాథన లయాన్ (4/41) మాయజాలానికి తోడు పేసర్లు స్కాట్ బొలాండ్ (3/46), మిచెల్ స్టార్క్ (2/77) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో విధ్వంసక శతకం సాధించిన ట్రావిశ్ హెడ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఐసీసీ టెస్టు ఛాంపియన్‌షిప్ గదతో పాటు రూ.13 కోట్ల నగదు బహుమతి అందుకున్నాడు. రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు సిల్వర్ మెడల్స్‌తో పాటు రూ.6.6 కోట్ల ప్రైజ్‌మనీ దక్కించుకుంది.

లంచ్‌లోపే ఆలౌట్ : ఓవర్‌నైట్ స్కోరు 164/3తో ఐదో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ మరో 280 పరుగులు చేయాల్సి స్థితిలో నిలిచింది. క్రీజులో విరాట్ కోహ్లి, అజింక్య రహానెలు అజేయంగా ఆడుతున్నారు. చేతిలో ఏడు వికెట్లు ఉండటంతో చివరి రోజు మనోళ్ల గెలుపు కోసం అమీతుమీ తేల్చుకుంటారనే అంచనాలు కనిపించాయి. కానీ ఉదయం సెషన్ ఆరంభంలోనే ఆశలు ఆవిరయ్యాయి. లంచ్ విరామానికి ముందే టీమ్ ఇండియా చేతులెత్తేసింది. 23.3 ఓవర్లలోనే చివరి ఏడు వికెట్లు చేజార్చుకుంది. వ్యక్తిగత స్కోరుకు మరో ఐదు పరుగులు జోడించిన విరాట్ కోహ్లి తీవ్రంగా నిరాశపరిచాడు. ఆసీస్ పేసర్ స్కాట్ బొలాండ్ ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టి భారత్‌ను ఓటమి కూరల్లోకి నెట్టాడు. బొలాండ్ ఓవర్లో ఆఫ్‌సైడ్ బంతిని వెంటాడిన విరాట్ కోహ్లి.. స్లిప్స్‌లో క్యాచ్ ఇచ్చాడు. కోహ్లి వికెట్‌తో భారత్ మానసికంగా ఓటమిని అంగీకరించగా.. ఆస్ట్రేలియా శిబిరంలో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. రవీంద్ర జడేజా (0) ఎదుర్కొన్న రెండో బంతికే వికెట్ల వెనకాల దొరికిపోయాడు. ఒకే ఓవర్లో విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా వికెట్లతో భారత్ పనైపోయింది. అజింక్య రహానె (46) సైతం ఎంతోసేపు వికెట్ కాపాడుకోలేదు. శార్దుల్ ఠాకూర్ (0) డకౌట్‌గా నిష్క్రమించగా.. ఉమేశ్ యాదవ్ (1), మహ్మద్ సిరాజ్ (1) ఆసీస్‌ను పెద్దగా కష్టపెట్టలేదు. లంచ్ విరామం లోపే చివరి ఏడు వికెట్లు కోల్పోయిన భారత్ 209 పరుగుల తేడాతో ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో పరాజయం పాలైంది.


ఈ గద.. అందని ద్రాక్షేనా?! రన్నరప్ మెడల్‌తో నిష్క్రమిస్తూ కోహ్లి..!

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 469/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 296/10

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : 270/8 డిక్లేర్డ్

భారత్ రెండో ఇన్నింగ్స్ : రోహిత్ (ఎల్బీ) లయాన్ 43, గిల్ (సి) గ్రీన్ (బి) బొలాండ్ 18, పుజార (సి) అలెక్స్ (బి) కమిన్స్ 27, కోహ్లి (సి) స్మిత్ (బి) బొలాండ్ 49, రహానె (సి) అలెక్స్ (బి) స్టార్క్ 46, జడేజా (సి) అలెక్స్ (బి) బొలాండ్ 0, భరత్ (సి,బి) లయాన్ 23, శార్దుల్ (ఎల్బీ) లయాన్ 0, ఉమేశ్ (సి) అలెక్స్ (బి) స్టార్క్ 1, షమి నాటౌట్ 13, సిరాజ్ (సి) బొలాండ్ (బి) లయాన్ 1, ఎక్స్‌ట్రాలు : 13, **మొత్తం : (63.3 ఓవర్లలో ఆలౌట్) 234.**

వికెట్ల పతనం : 1-41, 2-92, 3-93, 4-179, 5-179, 6-212, 7-213, 8-220, 9-224, 10-234. **బౌలింగ్ :** పాట్ కమిన్స్ 13-1-55-1, స్కాట్ బొలాండ్ 16-2-46-3, మిచెల్ స్టార్క్ 14-1-77-2, గ్రీన్ 5-0-13-0, లయాన్ 15.3-2-41-4.

అక్కడే చేజారింది!

వరుసగా రెండో ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్. రెండేండ్ల క్రితం ఇదే పరిస్థితుల్లో గద వేటలో భంగపాటు నుంచి భారత్ పాఠాలు నేర్చుకోలేదు. 2021లో న్యూజిలాండ్‌తో ఫైనల్లో, 2023లో ఆస్ట్రేలియాతో తుది పోరులో టీమ్ ఇండియాను విజయానికి దూరం చేసింది బ్యాటర్లే!. కివీస్‌పై తొలి ఇన్నింగ్స్‌లో 217 పరుగులే చేసిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే కుప్పకూలింది. ఇప్పుడూ తొలి ఇన్నింగ్స్‌లో 296 పరుగులు చేసి, రెండో ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు చేతులెత్తేసింది. తాజా టైటిల్ పోరులో బౌలర్ల వైఫల్యం సైతం కాస్త కనిపించినా.. ఓవరాల్‌గా రెండు ఐసీసీ టెస్టు ఫైనల్స్‌లో బ్యాటింగ్ విభాగం దారుణంగా విఫలమైంది.



ది ఓవల్‌లో టాస్ భారత్ వశం. ప్రణాళిల ప్రకారం తొలుత ఆసీస్ బ్యాటింగ్. బౌలర్లు రాణించగా 24.1 ఓవర్లలోనే 76/3తో కంగారూ శిబిరంలో ఒత్తిడి. ఇక్కడి వరకు బాగానే నడిచినా.. ఇక్కడ్నుంచే ఐసీసీ టెస్టు గద భారత్‌కు దూరమవుతూ వచ్చింది. ట్రావిశ్ హెడ్ (163), స్టీవ్ స్మిత్ (121) నాల్గో వికెట్‌కు 285 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేసి.. రోహిత్‌సేనను మానసికంగా వెనక్కి నెట్టారు. రిషబ్ పంత్ ప్రత్యర్థి జట్లకు ఇచ్చే ఝలక్ ది ఓవల్‌లో ట్రావిశ్ హెడ్ భారత్‌కు రుచి చూపించాడు. హెడ్, స్మిత్ భాగస్వామ్యాన్ని కట్టడి చేసి ఉంటే ఫలితం భిన్నంగా వచ్చేందుకు అవకాశాలు ఉండేవి. ఇక పిచ్ బ్యాటింగ్‌కు సహకరిస్తున్న సమయంలో టాప్ ఆర్డర్ కుప్పకూలటం కొంప ముంచింది. రోహిత్ (15), గిల్ (13), పుజార (14), కోహ్లి (14) పెవిలియన్‌కు క్యూ కట్టారు. రెండో ఇన్నింగ్స్‌లోనూ పరిస్థితిలో పెద్ద మార్పు లేదు. 91/1తో మెరుగ్గా సాగుతున్న దశలో రోహిత్, పుజార వికెట్లతో భారత్‌పై ఒత్తిడికి అధికమైంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 285 పరుగుల నాల్గో వికెట్ భాగస్వామ్యం ఆ జట్టును ఐసీసీ ప్రపంచ టెస్టు విజేతగా నిలుపగా.. బ్యాటర్ల సమిష్టి వైఫల్యం భారత్‌ను వరుసగా రెండోసారి రన్నరప్‌గా నిలిపింది.

జకోవిచ్ స్లామ్ నం.23

రికార్డు గ్రాండ్‌స్లామ్ సాధించిన నొవాక్



పారిస్ : టెన్నిస్ చరిత్రలో నొవాక్ జకోవిచ్ సరికొత్త రికార్డు. పురుషుల సింగిల్స్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన ఆటగాడిగా నొవాక్ జకోవిచ్ (సెర్బియా) చరిత్ర సృష్టించాడు. ఆదివారం జరిగిన మెన్స్ సింగిల్స్ ఫైనల్లో కాస్పర్ రూడ్ (నార్వే)పై 7-6(7-1), 6-3, 7-5తో వరుస గేముల్లో గెలుపొందిన జకోవిచ్ కెరీర్ 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో మూడో టైటిల్ సాధించి.. నాలుగు గ్రాండ్‌స్లామ్‌లను కనీసం మూడేసి సార్లు ముద్దాడిన ఏకైక క్రీడాకారుడిగా నిలిచాడు.

టైటిల్ పోరులో జకోవిచ్ 11 ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో విరుచుకుపడ్డాడు. పాయింట్ల పరంగా 118-89తో రూడ్‌పై ఆధిపత్యం చెలాయించిన జకోవిచ్.. తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో సొంతం చేసుకుని చారిత్రక విజయం సాధించాడు.

లంకలో భారత్ మ్యాచులు!

ఆసియా కప్ హైబ్రిడ్ మోడల్



దుబాయ్ : 2023 ఆసియా కప్‌పై నెలకొన్న సందిగ్ధతకు త్వరలోనే తెరపడనుంది. ఆసియా కప్ కోసం పాకిస్థాన్‌లో పర్యటించేందుకు బీసీసీఐ నిరాకరించగా.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సరికొత్త హైబ్రిడ్ మోడల్ ప్రతిపాదనతో ముందుకొచ్చింది. ఆసియా కప్‌లో భారత్ ఆడే మ్యాచులను శ్రీలంకలో నిర్వహించనున్నారు. భారత్ భాగస్వామ్యం లేని మ్యాచులను పాకిస్థాన్‌లో నిర్వహిస్తారు. 13 రోజుల పాటు సాగే ఆసియా కప్‌లో ఆరు జట్లు 13 మ్యాచులు ఆడనున్నాయి. భారత్ ఫైనల్స్‌కు చేరుకుంటే.. టైటిల్ పోరు సైతం శ్రీలంకలోనే జరుగనుంది. పీసీబి నూతన ప్రతిపాదనకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ త్వరలోనే ఆమోద ముద్ర వేయనుందని సమాచారం. ఇక తాజా ప్రతిపాదనతో 2023 వన్డే వరల్డ్‌కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీల్లో భారత్, పాకిస్థాన్ ఇరు దేశాల్లో పర్యటించే అంశంపై సైతం ఓ స్పష్టత వచ్చినట్టు తెలుస్తుంది. వన్డే వరల్డ్‌కప్ కోసం పాకిస్థాన్ జట్టు భారత్‌కు రానుండగా.. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారత్ సైతం పాక్ గడ్డపై అడుగుమోపనుందని క్రికెట్ వర్గాలు అంటున్నాయి.

తెలుగు టాలన్స్ ఓటమి

ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్

జైపూర్ : తెలుగు టాలన్స్ తొలి ఓటమి చవిచూసింది. ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్‌ఎల్)లో ఆదివారం జైపూర్‌లో జరిగిన లీగ్ మ్యాచ్‌లో మహారాష్ట్ర ఐరన్‌మ్యాన్ చేతిలో 26-30తో పరాజయం పాలైంది. ప్రథమార్ధం ముగిసే సరికి 14-12తో రెండు గోల్స్ ముందంజలో నిలిచిన తెలుగు టాలన్స్ విరామం అనంతరం మ్యాచ్‌పై పట్టు కోల్పోయింది. తెలుగు టాలన్స్ ఆటగాడు నసీబ్ సింగ్ 10 గోల్స్‌తో మెరిసినా.. ఐరన్‌మ్యాన్ ప్లేయర్ అంకిత్ కుమార్ 9 గోల్స్ ప్రదర్శనతో ఆ జట్టును విజేతగా నిలిపాడు. నేడు ఢిల్లీ పాంజర్స్‌తో తెలుగు టాలన్స్ తలపడనుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.